మాజిక్ గత వారం తప్పులు పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మీ మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 290 పేజీలు: 12 వెల: 6.50

## రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధించలేం



### బిల్లుల ఆమోదంపై స్పష్టం చేసిన సుప్రీంకోర్టు


### రాష్ట్రపతి రిఫరెన్స్‌పై విచారణ జరిపిన ధర్మాసనం

### బిల్లులు దీర్ఘకాలం పెండింగ్ సరికాదు.. పునః పరిశీలనకు పంపకుండా నిలిపివేయరాదు.. అత్యవసరమైతేనే సుప్రీం జోక్యం: సిజెఐ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, నవంబరు 20:** పార్లమెంట్ లేదా అసెంబ్లీలు తీర్మానం చేసిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి లేదా గవర్నర్లకు నిర్దిష్ట గడువు విధించలేమని దేశ అత్యునత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి న్యాయస్థానం గడువు విధించడంపై.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలకు సుప్రీంకోర్టు సమాధానమిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200/201 కింద బిల్లులకు అనుమతి ఇవ్వడంపై రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయాలకు న్యాయస్థానం >>2

## పద్మావతి అమ్మవారిని దర్శించిన రాష్ట్రపతి ముర్ము

**తిరుచానూరు, నవంబరు 20 ప్రభాతవార్త :** తిరుచానూరు పద్మావతి అమ్మవారిని భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, దేవాదాయ శాఖ కార్యదర్శి శ్రీహరి జవహర్‌లాల్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, జెఇఒ వీరబ్రహ్మాం, సివిఅండ్ఎస్ఓ మురళీకృష్ణ, అర్చకులు బాబుస్వామి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతంపలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆశీర్వాద మండపంవద్ద దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ రాష్ట్రపతికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అనంతపురం డిఐజి సీమోషీ ఘోష్, టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, డిఎస్పీ ప్రసాద్, సిఐ సునీల్ కుమార్, ఎవియస్ ధాకృష్ణమూర్తి ఎస్పై సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

## టెండర్లు ఎలా కేటాయించారు?

### కల్తీనెయ్యి వచ్చినా కేసు ఎందుకు నమోదు చేయలేదు?

### మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిని ప్రశ్నించిన సిట్

**తిరుపతి,నవంబరు 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో లడ్డూల తయారీకి 2020-24మధ్యకాలంలో టెండర్లు ఏ ప్రాతిపదికన పిలిచారు,టెండర్లలో పాల్గొన్న డెయిరీ యాజయాన్యం, కాంట్రాక్టర్లు ఎవరు అనే కోణంలో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సిబిఐ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పటికే నిందితుల రిమాండ్ రిపోర్టు ఆధారాలతో గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సుబ్బారెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించడంవిశేషం. లడ్డూప్రసాదంతయారీలో కల్తీనెయ్యి >>2




## 24 నుంచి 'రైతన్నా.. మీకోసం'

### వ్యవసాయంలో పంచసూత్రాలపై ఏడురోజులపాటు కార్యక్రమాలు

### అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తెద్దాం

### వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



**విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ రంగంలో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ ప్రతీరైతు ఇంటికి ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహా 10 వేలమందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలీకాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మీకోసం రైతన్నా పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనుంది.

ఈ సందర్భంగా టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. "17 నెలలుగా రైతుల్ని, వ్యవసాయాన్ని ముందుకు ముందుకెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకుచెల్లించాం. బిందుసేద్యానికి అధిక ప్రాధాన్యంఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపడుతున్నాం. ఇలాంటి >>2

## సమర్థ నాయకుడు మోడీ

### ఆయన సహకారంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

### నితీష్ నేతృత్వంలో బీహార్ కూడా అదే తీరు

### కొత్త సర్కార్ ప్రమాణ స్వీకారానికి హాజరైన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



గురువారం పాట్నాలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడీ సహకారంతో ఎపి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మోడీ బలమైననాయకుడు అనే భావన ప్రపంచమంతా ఉందన్నారు.. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది, పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో కలిగించారన్నారు. బీహార్‌లో ప్రజలు ఇటీవల ఇచ్చిన ఎన్నికల తీర్పు ప్రధాని నాయకత్వాన్ని మరింత బలపరుస్తుందన్నారు. ప్రధాని సహకారంతో నితీష్‌కుమార్ నేతృత్వం బీహార్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఎన్డీఎ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలన్ని పరస్పర సహకారంతో అభివృద్ధి సాధిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. విధ్వంస పాలనకు చరమగీతం పలికారు. 94శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిం >>2



గురువారం హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టుకు హాజరైన మాజీ సిఎం వైఎస్ జగన్

## హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**విజయవాడ, నవంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైదారాబాద్‌లోని సిబిఐ స్పెషల్ కోర్టుకు విచారణ కోసం హాజరయ్యారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయన నేరుగా అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు చేరుకున్నారు. జగన్ కోర్టు హాల్‌లో కేవలం ఐదు నిమిషాలు మాత్రమే కూర్చున్నారు. న్యాయమూర్తి ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీరేమైనా చెప్పదల్చు >>2


## 5 జిల్లాల్లో టెక్స్‌టైల్ పరిశ్రమలు

### - రాష్ట్ర చేనేత, జౌళి మంత్రి సవిత




**విజయవాడ, నవంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన 8 ఒప్పందాలతో ఐదు జిల్లాల్లో టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. విశాఖ, చిత్తూరు, గుంటూరు, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారన్నారు. వీటి ద్వారా 6,460 మందికి ఉద్యోగాలొచ్చే అవకాశాలున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

టెక్నికల్ టెక్స్‌టైల్స్, రీసైక్లింగ్, గార్మెంట్స్, సిల్క్, అపెరల్ రంగాల్లో పెట్టుబడులు రానున్నాయన్నారు. విశాఖపట్నంలో ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ రూ.4వేల కోట్లు,ఎంవీఆర్ టెక్స్‌టైల్స్ రూ.105.38 కోట్లు, చిత్తూరు జిల్లా గంద్రాజుపల్లిలో బెంగుళూరుకు చెందిన జీనియస్ ఫిల్టర్స్ సంస్థ రూ.120 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురంలో అరవింద్ అపెరల్ పార్క్ సంస్థ రూ.20 కోట్లు,గుంటూరులో వామిని ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ రూ.35 కోట్లు,అనకాపల్లిలో బీక్యూ టెక్స్‌టైల్స్ సంస్థ రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని పేర్కొన్నారు.



21-11pg2exHMNWJQETVR 2_21-11pg2exHMNWJQETVR.qxd 21/Nov/25 12:10 AM Page 1





గురువారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించడానికి వచ్చిన రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలకటానికి వచ్చిన హోంమంత్రి అనిత, మంత్రి రామనారాయణ రెడ్డి, టిటిడి ఇఒ సింఘాల్ తదితరులు

# సమర్థ నాయకుడు మోడీ

>> చారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. బీహార్ సిఎంగా నితీష్ కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సిఎంలు, కేంద్ర మంత్రులు, బిజెపి అగ్రనేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర సిఎంలు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘువాల్, బిజెపి అగ్ర నేత రవిశంకర్ ప్రసాద్, బీహార్ రాష్ట్రంలోని బిజెపి, జెడియూకు చెందిన పలువురు నేతలతో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమావేశమయ్యారు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎపి అభివృద్ధిలో అందరి సహకారం అవసరమన్నారు.సిఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదమైందన్నారు. 45 దేశాల్లో మన సమ్మిట్ చర్చనీయాంశమైందంటే, విశాఖ పేరు మార్మోగుతోందంటే టీం వర్క్‌తోనే ఇది సాధ్యమైంది. ఈ సదస్సులో అర్థవంతమైన, విజ్ఞానవంతమైన చర్చలు జరిపామన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచే పారిశ్రామికాభివృద్ధి మీద దృష్టిపెట్టి పనిచేస్తున్నామన్నారు.వివిధ సంస్థలకు పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. ఈ క్రమంలో విశాఖ భాగస్వామ్య సదస్సుతో సంబధం లేకుండానే సుమారుగా రూ. 10 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎపిపై పారిశ్రామిక వర్గాల్లో నమ్మకం కలగడానికి ఇదే నిదర్శనం అని అన్నారు.. వివిధ దేశాల వారు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ. 13 లక్షల కోట్లకు పైగా చేరడంతో అంచనాలను 100 శాతం చేరుకోవడంతోపాటు... అదనంగా మరో 30 శాతం మేర పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా మార్గం సుగమం అయిందని సిఎం చంద్రబాబు అన్నారు.ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారానికి పట్నాకు ప్రత్యేక విమానం చేరుకున్న సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్‌కే అక్కడి ఎన్‌డిఎ కూటమి పక్షాలు ఘన స్వాగతం పలికాయి,.రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారు సాదరంగా కార్యక్రమానికి ఆహ్వానించారు.

## తెలుగులో మాట్లాడండి: కలెక్టర్‌కు తెలంగాణ సిఎం రేవంత్ సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు20:** వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా ఒక కలెక్టర్ ఆంగ్లంలో వివరాలు తెలియజేస్తుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగులో మాట్లాడాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆంగ్లంలో వివరాలు వెల్లడించే ప్రయత్నం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలుగజేసుకుని తెలుగులో మాట్లాడాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా ఉన్నారని, వారందరికీ అర్థమయ్యేలా వీలైనంత వరకు తెలుగులో మాట్లాడాలని ఆయన సూచించారు. దీంతో కలెక్టర్ గరిమ తెలుగులో వివరాలు వెల్లడించారు.

## ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాపై ఇడి ఛార్జిషీట్

**న్యూఢిల్లీ, నవంబరు 20:** యూకేకు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపార వేత్త, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఛార్జిషీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. కాగా, యూకేకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులైలో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా వాద్రాపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# 24 నుంచి 'రైతన్నా.. మీకోసం'

>> వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతలకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రకృతి సేద్యం... అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

"రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలి. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాం. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నాం. రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రమోట్ చేయాలి. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించాను... ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నాయి. ప్రైవేట్ ఎరువుల షాపుల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉంది. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు... వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గడువు విధించలేం

>> ఎటువంటి గడువులను విధించలేమని పేర్కొంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ ధర్మాసనం.. బిల్లుల ఆమోదంపై గడువును విధించడం రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుందని స్పష్టం చేసింది. బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్ల చర్యలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావని, ఆ బిల్లు చట్టంగా మారిన తర్వాతే న్యాయ సమీక్షను అభ్యర్థించవచ్చని కోర్టు ఉద్ఘాటించింది.తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ రాజ్యాంగపరమైన చిక్కులు తలెత్తాయి. ముఖ్యంగా ఆ తీర్పు ద్వారా రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులు ఆమోదించడానికి గడువు విధించింది. దీంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరుతూ రిఫరెన్స్ పంపారు. ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి లేదా గవర్నర్‌లు తమ అధికారాల నిర్వహణ విషయంలో ఏ కోర్టుకు జవాబుదారీగా ఉండరని ఉదహరించారు. అలాగే ఆర్టికల్ 200 కింద బిల్లును తన ముందు ఉంచినప్పుడు.. మంత్రుల మండలి అందించే సహాయం, సలహాకు గవర్నర్ కట్టుబడి ఉంటారా? అని కోర్టును ప్రశ్నించారు.

**గవర్నర్లకు విచక్షణ.. కానీ అపరిమిత అధికారం కాదు**

దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గురువారం రోజు కీలక తీర్పును ఇచ్చింది. ముఖ్యంగా సుప్రీంకోర్టు తన తీర్పులో.. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించి గడువు విధించడం రాజ్యాంగానికి విరుద్ధమని తేల్చి చెప్పింది. అలాగే గవర్నర్ల అధికారాలపై పూర్తి స్పష్టతను ఇచ్చింది. కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని ధర్మాసనం వివరించింది. "గవర్నర్లు తమ అపరిమిత అధికారాలను వినియోగించలేరు. ఆర్టికల్ 200 కింద వారికి విచక్షణ అధికారం ఉంటుంది. కానీ ఆ విచక్షణ హేతుబద్ధంగా ఉండాలి" అని కోర్టు వివరించింది.

# టెండర్లు ఎలా కేటాయించారు?

>> వినియోగించారనే సంచలనంపై సిట్ చేపట్టిన లోతైన విచారణలో క్లైమాక్స్‌లో మాజీ ఛైర్మన్ వైవిని ప్రశ్నించారు. ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్లతో ఎలా పరిచయాలు, ఆ తరువాత కల్తీ నెయ్యి వచ్చిందని తెలిసినా ఎందుకు కేసు నమోదు చేయలేదు అనే కోణంలో ప్రశ్నలు వేసి సమాచారం రాబట్టినట్లు తెలిసింది. ఇప్పటికే సిట్ బృందం టిటిడి మార్కెటింగ్, కొనుగోలు విభాగం, పోటు విభాగం నుండి సేకరించిన సమాచారంతోబాటు వైవి పిఎ చిన్నఅప్పన్న నుండి రాబట్టిన కీలక ఆధారాలతో ఆరుగంటలకుపైగా విచారణ చేశారు. కొన్ని వివరాలు సేకరించారనేది తెలిసింది. చిన్నఅప్పన్నను టిటిడి వ్యవహారాల్లో ఎందుకు కలగజేసుకో మ్మన్నారు, దాని వెనుక లబ్ధి ఏపాటిది అనేవిచారణ చేయడంతో సుబ్బారెడ్డి సాధారణ సమాధానాలు ఇచ్చారనేది తెలిసింది. లడ్డూప్రసాదాల తయారీకి ఎంత కాలంగా కల్తీనెయ్యి వినియోగించారు?అసలు నెయ్యిసరఫరా చేయాల్సిన సంస్థలు, కాంట్రాక్టర్ల స్థానంలో మరొకరు సరఫరా చేశారనేది తెలిసినా ఎందుకు ఉదాసీనంగా ఉన్నారనే ప్రశ్నలకు అధికారులు పర్యవేక్షించే వాటిపై బోర్డు కలగజేసుకోలేదనేది ట్విస్ట్ వచ్చిందనేది తెలుస్తోంది. మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించాల్సిన అవసరం ఏముందనేది విచారణ చేపట్టినట్లు సమాచారం.మరీ ఇప్పుడు సిట్ తీసుకోబోయే చర్యలు ఏంటనేది ఉత్కంఠగా మారింది.



సిబిఐ కోర్టునుంచి బయటకు వస్తున్న జగన్ అభిమానులకు అభివాదం చేస్తున్న దృశ్యం

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

>> కున్నారా అని జగన్‌ను సిబిఐ కోర్టు న్యాయమూర్తి అడిగారు. అందుకు జగన్ తరఫు న్యాయవాది నో అని జవాబు చెప్పారు. ఆపై జగన్ వ్యక్తిగత హాజరును న్యాయస్థానం రికార్డు చేసింది. అటెండెన్స్ పూర్తి అయిన తరువాత కోర్టు నుండి జగన్ బయటకు వెళ్లిపోయారు. జగన్ రాక నేపథ్యంతో హైదరాబాద్ నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చే 2 మార్గాలను ఆధీనంలోకి తీసుకుని.. న్యాయవాదులకు మాత్రమే లోపలికి అనుమతించారు. కోర్టు ప్రక్రియ పూర్తి కావడంతో ఆయన లోటస్‌పాండ్‌కు బయల్దేరారు. ఈ కేసులో 2013 సెప్టెంబరు నుంచి జగన్ మధ్యంతర బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ చేసిన అభ్యర్థనను సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సిబిఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

## కోర్టు తీర్పులను కేంద్రం ఉల్లంఘించడం సరికాదు

### సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, నవంబరు 20:** కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రైబ్యునల్‌తో పాటు పలు ట్రైబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలకు వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తామే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వ న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సిజెఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రైబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సిజెఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

## కట్టలు తెంచుకున్న జగన్ మద్దతుదారుల అభిమానం

**బేగంపేట నవంబరు 20,ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నగరానికి వచ్చిన వేళ బేగంపేట విమానాశ్రయం వద్ద వైఎస్సార్సీ శ్రేణులు పెద్ద ఎత్తున హంగామా చేసారు.కట్టలు తెంచుకున్న అభిమానంతో వారు విమానాశ్రయానికి ఊహించని స్థాయిలో చేరుకోవడం, సిఎం, సిఎం అంటూ నినాదాలు చేస్తూ విమానాశ్రయంలోనికి చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించడంతో ముందుగా పోలీసులు,వైఎస్సార్సీ శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది.అయినా వైఎస్సార్సీ శ్రేణులు రెచ్చిపోవడంతో పోలీసులు స్వల్పంగా లాఠీ ఛార్జి చేయాల్సి వచ్చింది.గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట చేరుకున్న వైఎస్ జగన్ గురువారం ఉదయం గం 10.51నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు.ఆయనతో పాటు ప్రత్యేక విమానంలో మాజీ మంత్రులు పేర్నివెంకట్రామయ్య(నాని),ధర్మాన కృష్ణదాస్ తదితరులు రాగా బేగంపేట విమానాశ్రయంలో మాజీ మంత్రులు రామచంద్రారెడ్డి,మేరుగ నాగార్జున,విడదల రజనీ,ఎంపీ ఎస్ వి మోహన్ రెడ్డి,ఎమ్మెల్యేలు పి.రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తదితరులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. జగన్ నాంపల్లిలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానానికి హాజరవుతున్నారంటూ వైసీపీ నాయకులు క్యాడర్‌కు సమాచారం అందించడంతో పెద్ద ఎత్తున శ్రేణులు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని జై జగన్,సీఎం,సీఎం,రప్పా రప్పా వంటి నినాదాలు చేసారు. ఉదయం గం 10.51నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉదయం గం11.11నిలకు బేగంపేట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నాంపల్లిలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానానికి బయలు దేరి వెళ్లారు.

## చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని నిరూపించిన విద్యావేత్త చుక్కా రామయ్య అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఐఐటి శిక్షణ ద్వారా దశాబ్దాల పాటు ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది ఐఐటి రామయ్యగా గుర్తింపు పొందారన్నారు. చుక్కా రామయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయనకు సిఎం శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో పుట్టిన రోజులు చేసుకోవాలని ఆకాంక్షించారు.

## దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మా వద్ద లేరు

### హైకోర్టుకు తెలిపిన పోలీసులు

**విజయవాడ, నవంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టులు దేవ్‌జీ,మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుర్చేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటీషన్‌పై హైకోర్టుకు విచారణ జరిగింది. వారిద్దరూ తమ వద్ద లేదని పోలీసులు ఉన్నత నాయస్థానానికి తెలిపారు. అరెస్ట్ చేసిన ఇతర మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటీషనర్లను హైకోర్టు ఆదేశించింది. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్ స్టేట్ మెంట్ ఇచ్చారని పిటీషనర్‌తరపు న్యాయవాది తెలిపారు.ప్రెస్ స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఇరువైపులా వాదనలువిన్న హైకోర్టు తదుపరివిచారణను శుక్రవారం వాయిదా వేసింది.

## నేడు పుట్టపర్తి రానున్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

**పుట్టపర్తి, నవంబరు 20, ప్రభాతవార్త:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాలుపంచుకునేందుకు శుక్రవారం పుట్టపర్తికి రానున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఆయన ప్రత్యేక విమానంలో ఉదయం 09:15 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకుంటారని, అక్కడి నుండి ప్రత్యేక కాన్వాయ్‌లో 09:25 గంటలకు సత్యసాయి ప్రశాంతి నిలయం చేరుకుంటారన్నారు. 09:30 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని శతజయంతి ఉత్సవాలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. అనంతరం ఉదయం 11:00 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకొని ముంబాయికి తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

## రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి తుఫాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని విజయవాడ (అమరావతి) వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 48గంటల్లో ఇది పశ్చిమ వాయవ్యదిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్ర,శని ఆదివారాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు, వచ్చే మంగళవారం కొన్ని చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

# కెటిఆర్‌పై విచారణకు అనుమతించిన గవర్నర్

## ఫార్ములా ఇ-కార్ రేసులో ఎ-1గా కెటిఆర్, ఎ-2గా అర్వింద్ కుమార్

### విచారణ అనంతరం చార్జిషీటు దాఖలు

**హైదరాబాద్,నవంబర్20:** ఫార్ములా ఈకార్ రేసు కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించడానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ గురువారం అనుమతి ఇచ్చారు. నిధుల దుర్వినియోగంపై విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏసీబీ త్వరలో కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేయనుంది. విచారణ తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. కేటీఆర్ ప్రజాప్రతినిధిగా ఉన్నందున్న ఆయనపై చర్యలకు గవర్నర్ అనుమతి కోరుతూ ఇటీవల ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సానుకూలంగా స్పందించారు. కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇచ్చారు.కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటీఆర్ అరెస్ట్‌పై మీడియాతో మాట్లాడుతూ..2018లో ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్‌ను అమెండ్ చేశారు. ఏ మంత్రిమీద విచారణ చేయలన్నా.. విచారణకు ముందు గవర్నర్ అనుమతి తీసుకోవాలి. విచారణ తర్వాత ఛార్జ్‌షీట్ వెయ్యాలన్నా గవర్నర్ అనుమతి తీసుకోవాలి. విచారణకు ముందు గవర్నర్ అనుమతి తీసుకున్నాం. ఛార్జ్‌షీట్ ఫైల్‌చేయడానికి గవర్నర్ ఆమోదం కోసం పంపించాం. 3 నెలలు అవుతున్నా గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. గవర్నర్ అనుమతి లేకుండా కెటిఆర్‌ను అరెస్ట్‌చేసినా.. కేసుపెట్టినా పది నిమిషాలల్లో ఆయనకు బెయిల్ దొరుకుతుంది. కేసు నుంచి తప్పించుకోవడానికి దారి దొరుకుతుంది అని అన్నారు. ఇప్పుడు కెటిఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి లభించింది.ఫార్ములా ఈకార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందం కుదిరింది. ఫార్ములాఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్, మున్సిపల్ శాఖలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్‌లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్ర వరి 10,11 తేదీల్లో నెక్లెస్‌రోడ్‌లో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. తదుపరి ఏడాది 10వ సీజన్ నుంచి ఏస్ నెక్స్ట్ జెన్ అకస్మాత్తుగా తప్పుకుంది. దాంతో ప్రమోటర్ గా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)నే పాత్ర పోషించాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు.ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 54.88 కోట్లను ఫార్ములాఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ మొత్తం వివాదానికి తెరలేపింది.

## వారం - వర్జ్యం

21-11-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
కృ.పాడ్యమి మ.2.47
అనూరాధ మ.1.55, అనూరాధ కార్తె
వర్జ్యం : రా.9.11-9.58
దు.ఉ.8.14-8.59,
2) మ.12.17-1.02
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ప్రత్యర్థి వర్గం బలహీనపడుతుంది. భూవివాదాల నుండి బయట పడతారు. వస్త్రలాభం కల్గుతుంది.

**వృషభం:** కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. చిన్ననాటి మిత్రులతో ఇష్టా గోష్టిని సాగిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** వివాహ యత్నాలు ఫలిస్తాయి. పెద్దవారికి సంబంధించిన విషయాలను పునః పరిశీలించుకుంటారు.

**కర్కాటకం:** సెంటిమెంట్లకు ప్రాధాన్యత నిస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు గాను పరిష్కార మార్గాలు లభిస్తాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. వాహన సౌఖ్యం కల్గుతుంది.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి పథంలో ఉంటాయి. ఉద్యోగులకు కార్యాలయంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది.

**తుల :** రాజకీయ, కళారంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది.

**వృశ్చికం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. నిష్కారణమైన చికాకులు తప్పకపోవచ్చు. మిత్రుల నుండి సాయం పొందుతారు.

**ధనుస్సు:** నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు సమర్థవంతంగా ఎదుర్కొంటారు. పన్నులను సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** అహంభావ ధోరణిని విడనాడి సహోద్యోగులతో స్నేహభావంతో మెలగండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం:** వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు. సమయానికి నిద్రహారాలు వుండవు. కొన్ని నిబంధనలను అతిక్రమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాష్ట్రంలో ఫిన్లాండ్‌లోని 'ఆట ఆధారిత అభ్యాసం'

# ప్రయోగాత్మకంగా అమలు

### జిల్లాకో అంగన్‌వాడీలో చేపట్టనున్న విద్యాశాఖ

### ఫిన్లాండ్‌లో పర్యటన వివరాలు వెల్లడించిన ఐఎఎస్ అధికారుల బృందం

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఫిన్లాండ్ లోని 'ఆట ఆధారిత అభ్యాసం' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. జిల్లాకు ఒక అంగన్‌వాడీలో ఫిన్నిష్ పూర్వ శిశువిద్య అమలుకు సహకారం అందించేందుకు ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్(ఈడీయూఎఫ్ఐ)ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆధ్వర్యంలో ఐఏఎస్‌లు నారాయణ, భరత్‌గుప్తా, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, గణేష్‌కుమార్‌లతో కూడిన బృందం ఇటీవల ఫిన్లాండ్ పూర్వ శిశువిద్య విధానం అమలుతో భవిష్యత్ తరాలకు మెరుగైన పునాదులు వేయడానికి మార్గం సుగమం అవుతుందని అధికారుల బృందం పేర్కొంది. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఈ విధానం దోహదపడుతుందని వెల్లడించింది. 'ఫిన్లాండ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదేళ్ల మాస్టర్ డిగ్రీ విద్యార్హత తప్పనిసరి. తనిఖీలు, ర్యాంకింగ్ లాంటి వ్యవస్థలు ఉండవు. ఉపాధ్యాయులు తమ భోధనా విధానాలు,మూల్యాంకనాలను వారే నిర్ణయించుకునే స్వయం ప్రతిపత్తి ఉంది. ప్రామాణిక పరీక్షలు లేని మూల్యాంకన విధానం లాంటి అంశాలు విద్యార్థి మనోవికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. హెల్సింకి విశ్వవిద్యాలయం లోని ప్లేఫుల్ లెర్నింగ్ సెంటర్,వర్జియోక్యూలా డేకేర్ సందర్శనలు'ఆట అనేది అభ్యాసానికి మాధ్యమం,విరామం కాదు.'అనే సూత్రాన్ని రుజువు చేశాయి. పూర్వ శిశువిద్యలో 'డాన్సింగ్ మౌస్ ఎమోషన్ బోర్డు' లాంటి సాధనాలు పిల్లల భావోద్వేగ పరిశీలనకు అద్భుతంగా ఉపయోగపడుతున్నాయి.

ప్రిన్సిపల్‌కు పూర్తి పరిపాలనా అధికారం ఉంటుంది. మున్సిపాలిటీలు కేవలం నిధులు, మౌలిక సదుపాయాలకే పరిమితమవుతాయి'అని పేర్కొంది. 'హెల్సింకిలోని ఊడి గ్రంథాలయం అమరావతిలో ఏర్పాటు చేసే నాలెడ్జ్ హబ్‌కు ఒక బెంచ్ మార్కుగా నిలుస్తుంది.ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు, ఇన్నోవేషన్ స్ప్రింట్‌లు, డిజైన్ ఫ్యాక్టరీ నమూనా ఆధారంగా ప్రయోగాత్మకంగా ప్రోటోటైపింగ్ హబ్‌లన ఏర్పాటు చేయడానికి సంస్థలను గుర్తించాం.

ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ మద్దతుతో అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో మార్పులు తీసుకురానున్నాం. యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకిలో కళల విద్యలో ఉత్తమ పద్ధతులు,స్టూడియో ఆధారిత భోధన,మెంటార్‌షిప్ శిక్షణ,ఆల్టో యూనివర్సిటీలో డిజైన్ ఫ్యాక్టరీలో విభాగాల అనుసంధానం, ఓపెన్ ప్రోటోటైపింగ్ ల్యాబ్స్,స్టార్టప్‌లకు మెంటారింగ్ వ్యవస్థలపైన అధ్యయనం చేశాం' అని తెలిపింది.

# సాయి సన్నిధిలో ఘనంగా 11వ ప్రపంచ సదస్సు

## పాల్గొన్న 125 దేశాల ప్రతినిధులు

## ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరి



మహా సమాధిని దర్శిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 20 ప్రభాతవార్త** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి సేవా సంస్థల 11వ ప్రపంచ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు కేంద్ర జాతీయ రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి ప్రశాంతి నిలయం చేరుకున్న ప్రతినిధులు వారి దేశ పతాకాన్ని చేత పట్టుకొని సత్యసాయి మహాసమాధి చెంతకు ఊరేగింపుగా వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ధన్యవాదములు శ్రీ సత్యసాయి అను గీతాన్ని బృందంగా చేరి ఆలపించారు. అనంతరం సదస్సు కార్యాచరణను మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ , ట్రస్టు సభ్యులు ఎస్ఎస్ నాగనంద్, డాక్టర్ మోహన్‌లతో కలిసి ప్రారంభించారు. స్వాగత ఉపన్యాసాన్ని శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్.ఎస్.నాగానంద్ మాట్లాడుతూ శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా నేషనల్ లీడర్షిప్ ప్రోగ్రాంలో యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,ఫీజీ, నేపాల్, శ్రీలంక, చైనా, జపాన్, ఇండోనేషియా, యూరోప్ , మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా మొదలకు దేశాలలో సేవాదళ్ సభ్యులు ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలలో, ప్రకృతి విలయ సమయాలలో అనేక సేవలను నిర్వహిస్తున్నారన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య మాట్లాడుతూ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని 10 జోన్ల నుండి 135 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి అయిన నితిన్ గడ్కరీ పాల్గొని సత్యసాయి చేస్తున్న నిస్వార్థ సేవలను గురించి ప్రసంగించారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవితమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఈ సదస్సు పూర్ణచంద్ర ఆడిటోరియంలో కొనసాగింది. ఈ సదస్సుకు విదేశాల నుండి దాదాపు 3000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తిరిగి సాయంత్రం సాయి కుల్వంత్ సభ మండపంలో గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని యువతి యువకులు అద్భుతమైన సంగీత గాన కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూరోప్ భక్తులు ఆలపించిన "శివ.. శివ.. శివ... వినరాద..." అను గీతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.



# సికింద్రాబాద్ నుండి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ మీదుగా సికింద్రాబాద్ నుంచి అయోధ్య కాశీ బైద్యనాథ్ ధామ్ పుణ్యక్షేత్ర పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో టూర్ ప్యాకేజీని ప్రకటించింది. పూరీ కోణార్క్ గయ వంటి ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలు ఈ ప్యాకేజీలో ఉన్నాయి. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. తొమ్మిది రాత్రులు/ 10 పగళ్ల సాగే యాత్రా స్పెషల్ ఇది.జనవరి 21వ తేదీన సికింద్రాబాద్ నుండి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్తుంది. మొత్తం 714 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్ 237, 3ఏసీ 425, 2ఏసీ 52. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్ కు ఖాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్‌లల్లో హాల్ట్ సౌకర్యం ఉంది. ఆయా స్టేషన్లల్లో ప్రయాణికులు బోర్డింగ్/డీబోర్డింగ్ అవ్వొచ్చు.తొలుత పూరీ జగన్నాథుడిని దర్శించుకోవచ్చు. అక్కడ ప్రత్యేక పూజలు చేయవచ్చు. కోణార్క్ సూర్య దేవాలయాన్ని సందర్శించవచ్చు. అనంతరం గయాకు వెళ్తుంది ఈ ఎక్స్ ప్రెస్. ఇక్కడ విష్ణుపాద ఆలయాన్ని దర్శించుకునే వెసలుబాటు ఉంది. ఆ తర్వాత వారణాశి వెళ్తుంది. కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి , అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయాల్లో పూజల్లో పాల్గొనవచ్చు. అక్కడి కారిడార్ సందర్శనం కూడా ఈ టూర్ ప్యాకేజీలో ఉంది. సాయంత్రం గంగా హారతిని తిలకించవచ్చు. దీని తర్వాత అయోధ్య. చారిత్రాత్మక బాలరాముడి ఆలయం, హనుమాన్ గర్హి ఆలయాలను దర్శించవచ్చు. అక్కడి సరయూ నది హారతిలో పాల్గొనవచ్చు.

# దివిసీమ వికృతతాండవ ఘటన జీవితాన్నే మార్చేసింది

## - హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** దివిసీమ తన కర్మ భూమి అని, ఇక్కడ పొందిన ప్రేరణ మరువలేనిదని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్ అధ్వర్యంలో 1977 దివిసీమ ఉప్పెన 48వ వార్షిక సంస్మరణ సభ,మానవతామూర్తులకు దివ్యవందన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దత్తాత్రేయ విచ్చేశారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా స్థానిక వంతెన కూడలి లోని ఆయన విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారంతా 1977 ఉప్పెన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో దత్తాత్రేయ మాట్లాడుతూ...ఉప్పెన సమయంలో నాగాయలంక మండలం పర్రచివర,దిండి.సొర్లగొంది, మూలపాలెం,కోడూరు మండలంలో చేసిన సేవల జ్ఞాపకాలు తన హృదయానికి దగ్గరగా ఉంటాయని చెప్పారు. సహాయక చర్యల కోసం 6 నెలలు గడిపిన కాలం తన జీవితంలో గొప్ప మార్పు తెచ్చిం దన్నారు. ఆ ప్రేరణ మరువలేనిదన్నారు.ఎక్కడ చూసినా కుప్పలుగా ఉన్న శవాలు చూసి చలించి పోయానని, సామూహిక శవ దహన కార్యక్రమం నిర్వహించానని చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు మంత్రిహోదాలో ఉన్నా రోజూ ముళ్ళబాటలో నడిచి,...కాళ్ళకు పుండ్లు పడినా లెక్కచేయకుండా సహాయక కార్యక్రమాల్లో ప్రజలకు అండగా నిలిచారు.

# రాష్ట్రంలో మద్యంపై గణనీయంగా తగ్గుతున్న ఆదాయం

**విజయవాడ,నవంబరు19,ప్రభాతవార్తప్రతినిధి** :రాష్ట్ర ఖజానాకు మద్యం ద్వారా వచ్చే ఆదాయం భారీగా తగ్గుతోంది. ప్రభుత్వ వర్గాల సమాచారాన్ని అనుసరించింది, ఈ ఏడాది మద్యం ఆదాయం అక్టోబర్లో 56 శాతం తగ్గినట్లు తేలింది.ఆయా ఆదాయార్జన వర్గాలకు సంబంధించి ప్రభుత్వం తాజా విడుదల చేసిన సమాచారాన్ని అనుసరించి మద్యం విక్రయాలపై గత నెలల్లో ఆదాయం తక్కువగా ఉంది.గత ఏడాది అక్టోబర్లో రు.4,409 కోట్లు రాగా, ఈ అక్టోబర్లో కేవలం రు. 1,956 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో రు. 16,288 కోట్లు రాగా, ఈ ఏడాది అదే ఏడు నెలల్లో రు. 15,275 కోట్లు ఖజనాకు చేరాయి. అంటే, అంటే ఆరు శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. ఇలా భారీగా ఆదాయం తగ్గడానికి గల కారణాలను కూడా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇక మొత్తం ఆదాయం కూడా ఆందోళన కలిగించేదిగానే కనిపిస్తోంది. గతేడాది అక్టోబర్ వరకు రు. 57,528 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ వరకు కేవలం మూడు శాతం వృద్ధితో రు. 57,392 కోట్లు వచ్చింది. అయితే ఒక్క అక్టోబర్ నెల గణాంకాలు పరిశీలిస్తే 20 శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్లో రు. 10,235 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ లో రు. 8,203 కోట్లు మాత్రమే రావడం విశేషం. మిగిలిన ఆదాయ విభాగాలను పరిశీలిస్తే వాణిజ్య పన్నుల విభాగంలో గతేడాది కన్నా కేవలం నాలుగు శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. వాహనాల పన్నుద్వారా కూడా నాలుగు శాతమే వృద్ధి కనిపించింది.

# గ్రామపంచాయతీలు, జిల్లా పరిషత్తులకు నిధులు విడుదల చేయండి

## - సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు



రామ్‌ప్రతాప్‌కు వినతి పత్రం ఇస్తున్న జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లోని గ్రామపం చాయ తీలు, మండల జిల్లా పరిషత్తులకు 15 వ ఆర్థిక సంఘం నిధులు 998 కోట్లు విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ రామ్ ప్రతాప్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్య క్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్ట ర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారు.ఢిల్లీలోని కేజీ మార్గ్ లో గల ఆయన కార్యాలయంలో ఆయనను గురువారం కలిసి వినతిపత్రాన్ని జాస్తి అందించారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు రాజీవ్ రంజన్ లలన్ సింగ్ కార్యాలయ ఆఫీసర్ ఆన్ డ్యూటీ బీరేంద్ర కుమార్ మిశ్రా కు కూడా అందించారు కేంద్రం 2025-2026 వ ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నిధులు రెండవ విడత 998 కోట్ల రూపాయలను గత నెల అక్టోబర్ లో విడుదల చేయవలసి ఉన్నదని ఆ నిధులను త్వరగా విడు దల చేయాలని వినతి పత్రాన్ని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అం దించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13, 340కి పైగా గ్రామపం చాయతీలు, స్థానిక సంస్థలు ఉన్నాయి చాలా గ్రామపం చాయ తీలకు ఆదాయ వనరులు నిధులు లేక జీతాలు, అంబాసిడర్ జీతాలు విద్యుత్ బకా యిలు చెల్లించలేకుండా ఉన్నారన్నారు.

# మద్యాన్ని ఏరులై పారించిన గత ప్రభుత్వం: ప్రత్తిపాటి



చిలకలూరిపేట, నవంబర్ 20, ప్రభాతవార్త: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడలేని గత పాలకులు, విషపూరిత కల్తీ మద్యాన్ని ఏరులై పారించి అమాయకుల ప్రాణాలు తీసి తమ ఖజానా నింపుకోవడంలో మాత్రం ప్రపంచస్థాయిలో పేరుపొందారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.30 వేల జనాభా ఉన్న గణపవరం గ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు అందించడం గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రికి చేతకాలేదన్న ప్రత్తిపాటి.. డబ్బు యావతో ప్రజల ప్రాణాల్ని గాలికి వదిలేసి, ఆరోగ్యశాఖను అనారోగ్యానికి కేరాఫ్ గా మార్చారని మండిపడ్డారు. గురువారం ఆయన కూటమినాయకులతో కలిసి గణపవరం గ్రామ తాగునీటి అవసరాలకోసం ఏర్పాటు చేయించిన తాగునీటి ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. వాటి పనితీరును గమనించిన ప్రత్తిపాటి.. అనంతరం ప్రజలతో మాట్లాడి నీటి సరఫరాపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డబ్బుయావ తప్ప ప్రజల గురించి ఆలోచించలేదు అవినీతి మంత్రి చేతిలో ఆరోగ్య శాఖ ఉన్నాకూడా ఏనాడూ ప్రజల కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేకపోయారని, తమ జేబులు నింపే పనులకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి.. డబ్బుయావతో చివరకు గెలిపించిన ప్రజల్ని గాలికి వదిలేశారన్నారు. డబ్బుయావ తప్ప గత పాలకులకు ఏనాడూ ప్రజల ఆరోగ్యం.. వారి సుఖసంతోషాలు గుర్తురాలేదని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ సహకారంతో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. సాంకేతిక సమస్యల్ని అధిగమించి మరీ కృష్ణతేజ ప్రజలకు మేలు చేశాడన్నారు. తాగునీటి సరఫరా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో చేర్చామని, భవిష్యత్ లో నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాటి తెలిపారు. ఎంపీ కృష్ణదేవరాయలుని సంప్రదించి, వారితో కలిసి త్వరలోనే నూతన ఫిల్టర్ బెడ్లు ప్రారంభిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. స్థానిక రాజీవ్ గాంధీ కాలనీ వాసుల సమస్యల్ని జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజా రమేశ్ తన దృష్టికి తీసుకొచ్చారన్న ప్రత్తిపాటి.. కాలనీ వాసులకు త్వరలోనే శ్మశాన వాటికకు అవసరమైన స్థలం కేటాయించేలా చూస్తామన్నారు. అదే విధంగా రోడ్లు, డ్రైనేజ్ లను నిర్మించేలా అధికారులకు తగిన ఆదేశాలిస్తామని ప్రత్తిపాటి చెప్పారు.ఫిల్టర్ బెడ్ల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, పెంటేల శేషయ్య, వలేటి హిమవంతరావు, కెల్లంపల్లి ఆచయ్య, ఎంపీడీవో స్వరూపరాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23న ఆర్టీసీ కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం



చిలకలూరిపేట, నవంబర్ 20, ప్రభాతవార్త: ప్రత్తిపాటి ఫౌండేషన్, సామాజిక వేత్త కంచర్ల శ్రీనివాసరావు గార్ల సంయుక్త సహకారంతో ఆర్టీసీ కార్మికులకోసం శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి ప్రత్తిపాటి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం గోడపత్రికల్ని కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించిన ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో 23వ తేదీన ఆదివారం నాడు ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహణలో 37వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రత్తిపాటి చెప్పారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ గతంలో ఎన్నోసార్లు శంకర కంటి ఆసుపత్రి యాజమాన్యంతో కలిసి నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించిందని, ఎప్పుడూ 7 నుంచి 10 వేల మంది వైద్య సేవలు పొందేవారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాక్షేమం కోసం నిర్వహించే వైద్య శిబిరాల్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి కోరారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మద్దూరి వీరారెడ్డి , కుర్ర రత్తయ్య, ముద్దన నాగేశ్వరరావు, ఆర్టీసీ డీఎం రాంబాబు, టి.యన్.టి.యు.సి నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, బోనం శ్రీనివాసరావు, అద్దంకి వర ప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారం చేయాలి

చిలకలూరిపేట, నవంబర్ 20, ప్రభాతవార్త: గామ రెవెన్యూ సహాయకుల సమస్య పరిష్కారం చేయాలని తాహసిల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. తాహసిల్దార్ మహమ్మద్ హుస్సేన్ కు వినతి పత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ సాంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయక్, సిఐటీయు మండల కన్వీనర్ పేరు బోయిన వెంకటేశ్వర్లు వీఆర్ఏల కమిటీ సభ్యులు టి. ఆనంద్ కుమార్ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా వీఆర్ఏల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదను, ఎన్నోసార్లు మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగి వినతి పత్రాలు అందజేసిన సమస్యను పరిష్కరించుటకు కృషి చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దశల వారి పోరాటాన్ని చేపట్టాలని వి.ఆర్ ఏల రాష్ట్ర కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు. .కె. సురేష్. పి.నాగేశ్వరావు.యన్ నాగ శివ.డి.అంజి. షేక్ సైదులు.సి.హెచ్ సువార్త కె. అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

# పరకామణి చోరీ కేసులో వీడని ట్విస్ట్

## -కీలక ఫిర్యాదుదారుడు మృతితో తర్జనభర్జనలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో సమర్పించుకునే కానుకల్లో అమెరికన్ డాలర్లు చోరీకేసులో తొలిసారి నమోదైన కేసు విచారణలో తాజాగా ట్విస్ట్‌నెలకొంది. 2023 ఏప్రిల్‌లో జరిగిన 920 అమెరికన్ డాలర్లు చోరీ కేసుపై పరకామణి పూర్వ ఏవిఎస్ఓ వైవి సతీశ్‌కుమార్ భౌతికంగా లేకపోవడం, దర్యాప్తు సాగుతున్న ఈ కేసులో అడ్డంకులు రాకుండా కొత్తగా మరో కేసును నమోదు చేయాలని టిటిడి బోర్డు ఇటీవల నిర్ణయించింది. గత కేసు నమోదు అంత పటిష్టంగా లేదనే వాదనలతో క్రిమినల్ కేసుగా తిరుమల పోలీసులకు మళ్ళీ తాజాగాఫిర్యాదు చేయాలని భావించారు. అయితే ఇప్పుడు ఎవరిచేత ఈ కేసు పై ఫిర్యాదిచేయించాలి అనేది ఇప్పుడు సందిగ్ధతనెలకొందని తెలుస్తోంది. అదేగాక ఇప్పటికే ఈ చోరీ కేసుపై 2023లో తిరుమల వన్‌టౌన్ పోలీసులు 24/2023గా ఎఫ్ఐఆర్ కూడా చేశారు. ప్రధాన నిందితుడు సివి రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేయకున్నా కోర్టు వరకు వెళ్ళింది. ఆ తరువాత కొన్ని పరిణామాలతో ఈ కేసును అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీకుదుర్చుకున్నారు. ఇందుకుగాను రవికుమార్‌నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను వేంకటేశ్వరస్వామికి విరాళంగా అందించామని గత బోర్డులో తీర్మానం చేయడం జరిగింది. ఈకేసు పూర్తిగా పక్కదారిపట్టి నిందితుడినుండి పెద్దలు లబ్ధిపొందారనే ఆరోపణలతో హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు గత రెండు వారాలుగా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు కూడా. ఇప్పుడు హైకోర్టు పరిశీలనలో ఉన్న కేసుపై మళ్ళీ కేసు ఎలా నమోదు చేయాలనే అంతర్మథనం పోలీసుల్లో వ్యక్తమవుతోంది. అదేగాక కీలకమైన టిటిడి బోర్డు ఫిర్యాదు చేస్తే ఎలా కేసు నమోదు చేయాలని తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలుస్తోంది.

# సాంస్కృతిక కళా సంపదను కాపాడుకుందాం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**.విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక జీవనశైలిలో మసకబారుతున్న కళలు, సాంస్కృతిక కళా సంపదను పరిరక్షించుకుంటూ వాటిని భావితరాలకు అమూల్యమైన వారసత్వ సంపదగా అందించేందుకు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించేలా జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కోహన్స్ సంస్థ సహకారంతో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కథలు, కవితలు, కార్టూన్ల విభాగంలో పోటీలు కూడా నిర్వహించడం జరిగిందని.. 500కు పైగా ఎంట్రీలు వచ్చాయని, ఉత్తమ రచనలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల యువతకు సరైన దిశానిర్దేశం లభిస్తుందని, సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లేందుకు చేయూత, నూతనోత్సాహం లభిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జిల్లాలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా మరో ముందడుగుగా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ సాహితీవేత్తల ప్రసంగాలు, సాహితీ సేవామూర్తులకు సత్కారాలు, కథ, కవిత, కార్టూన్ల పోటీ విజేతలక నగదు బహుమతుల ప్రదానం తదితరాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశకోరారు

నిరంతర సాధనకు పుస్తక పఠనం ఏకైక మార్గం.గ్రంథాలయాలు జీవన వికాసం సామాజిక పురోగతికి సోపానాలు ప్రజల జీవన వికాసం సమాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని, గ్రంథాలయ విశిష్ఠతను నేటి తరానికి చాటి చెప్పి ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ సేవలకు గుర్తుగా ఆయన జన్మదినం రోజున జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాల అవశ్యకతను నేటి తరానికి తెలియచేయాల్సిన అవసరం ఉ ందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ బుక్స్, ఆడియో బుక్స్ వంటివి ప్రజలకు అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరూ కంప్యూటర్, మొబైల్స్, ల్యాప్టాప్ వంటి అధునాతన పరికరాల ద్వారా కావాల్సిన సమాచారాన్ని పొందగలుగుతున్నప్పటికి గ్రంథాల ద్వారా అందే సమాచారానికి మించినది లేదన్నారు. పుస్తక పఠనం మేదో వికాసానికి దోహదపడుతుందన్నారు. కంప్యూటర్ పఠనం ద్వారా నేత్రాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. పుస్తక పఠనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. పుస్తక పఠనం ద్వారా పొందే విజ్ఞానం, సమాచారం ఎల్లపుడు గుర్తు ఉండిపోతుందన్నారు. పుస్తక పఠనం నిరంతర అధ్యాయనం వంటిదని, గ్రంథాలయ అవశ్యకతను నేటి తరానికి చాటిచెప్పెందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# గత ప్రభుత్వ అనధికార విలీనం నాలుగు గ్రామాలకు శాపంగా మారింది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 20, ప్రభాతవార్త: గత ప్రభుత్వం, గత అవినీతి మంత్రి గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం, దండమూడి గ్రామాల్ని గాలికి వదిలేశారని, స్వప్రయోజనాల కోసం ఆనాడు అనధికారికంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి పబ్బం గడుపుకున్నారు గానీ, గ్రామాల అభివృద్ధి, ప్రజాసమ్యల్ని పట్టించుకోలేదని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన కూటమి నాయకులతో కలిసి పసుమర్రులో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేసిన అనంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు.అటో... ఇటో తేలక ఆరున్నరేళ్ల అభివృద్ధికి దూరమయ్యాయి.. అనధికార మున్సిపల్ ఎన్నికలతో అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ నిధులు లేక నాలుగు గ్రామాలు ఆరున్నరేళ్లపాటు అభివృద్ధికి దూరమయ్యాయని, వైసీపీ పాలన ప్రజలకు శాపంగా మారిందని ప్రత్తిపాటి చెప్పారు. పసుమర్రు గ్రామానికి మరీ ఎక్కువగా అన్యాయం జరిగిందన్న ఆయన.. స్థానిక రైతుల్ని కూడా దోచేశారన్నారు. పసుమర్రు గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేయించారని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. సాంకేతికంగా ఇంకా పసుమర్రు పంచాయతీగా గుర్తించనప్పటికీ.. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ.. ప్రజల బాధలు గమనించి నిధులు మంజూరు చేయించినట్టు ఆయన చెప్పారు. మంత్రి లోకేశ్ సహకారంతో పాఠశాలల అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు.. త్వరలోనే లిఫ్ట్ ఇరిగేషన్ల ఆధునికీకరణ పనులకు టెండర్లు విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకారంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.10లక్షలు, ఉర్దూ ప్రైమరీ స్కూల్ కు రూ.10 లక్షలు మంజూరు అయ్యాయని.. ఆ పనులతో పాటు రూ.6లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్డు పనులకు నేడు శంఖుస్థాపన చేసినట్టు ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ల సమస్యపై జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడానన్న ప్రత్తిపాటి.. త్వరలోనే వాటికి సంబంధించిన టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. పసుమర్రులో 6వేల ఎకరాలకు సాగునీరు, గ్రామానికి తాగునీరు అందించే రెండు లిఫ్ట్ లతో పాటు, ఇతర గ్రామాల్లోని లిఫ్ట్ లను కూడా శరవేగంగా పునరుద్ధరిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన నాలుగు గ్రామాలను కూటమిప్రభుత్వ సహకారంతో పూర్తిగా బాగుచేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు జాలాది సుబ్బారావు, శ్రీనివాసరావు, గద్దె చౌదరి, చైతన్య, కిషోర్, శరత్, రఫీ, గ్రామ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సుగాలి కాలనీలో పార్కును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

చిలకలూరిపేట, నవంబర్ 20, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని మాజీ మంత్రివర్యులు మన శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ.ప్రత్తిపాటి పుల్లారావు గారి ఆదేశాల మేరకు పట్టణంలోని సుగాలి కాలనీలోని పార్కును పరిశీలించి మన శాసనసభ్యులు వారి దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని వార్డు ప్రజలకు తెలియజేశారు అనంతరం సుగాలి కాలనీ బోస్ రోడ్డు లో పట్టణంలోని పలువార్డుల్లోపారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ షేక్.రఫ్ఫాని గారు ఈ కార్యక్రమంలో శాలరీ ఇన్స్పెక్టర్ సునీత వార్డు ఇన్చార్జి కొండ వీరయ్య గారు కార్యకర్తలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


NOTICE

MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi

| Sr. No. | Particulars / Grade | NPK 10-30-13 | NPKS 10-05-31-7 |
|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 10 | 10 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 30 | 5 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 13 | 31 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 7 |
| 6 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 |
| 7 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 |
| 8 | Sodium (as NaCl) per cent by weight, maximum | 0.5 | 0.5 |
| 9 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 |
| 10 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 |
| 11 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble.
2. Improves Quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.

Packing : Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing.

Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036.
www.mahadhan.co.in



నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

NIWAS HOUSING FINANCE

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

స్వాధీనతా ప్రకటన [నిబంధన 8(1) మరియు (2)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు (యాక్ట్) 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క (నిబంధన 3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను నెరవేర్చే నిమిత్తం ఇందులో పేర్కొన్న సెక్యూర్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి రుణగ్రహీత(లు) నోటీస్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు నోటీస్ స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీస్ జారీ చేసారు.
రుణగ్రహీత(లు) ఇట్టి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి, దిగువ సంతకందారు NHFPL అధీకృత అధికారి అయినందున సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులను క్రింద పేర్కొనబడిన ప్రతీ ఆస్తి ఎదురుగా ఉన్న తేదీ స్వాధీనం చేసుకొన్నారని ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది. చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (8) నియమాల ఏర్పాట్లు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం ఏమనగా అందలి నిర్దేశితాలను అనుసరించి రుణగ్రహీత లభ్యంగా గల సమయంలోగా తనఖా పెట్టబడిన ఆస్తులను తిరిగి పొందవచ్చును.
ప్రధానంగా రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా తెలుపబడిన ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఒకవేళ అలా జరిపిన పక్షంలో NHFPL వారికి దిగువ తెలిపిన బకాయి మొత్తం మరియు వడ్డీ మరియు ఆపై ఇతర ఛార్జీలు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరాలు | మొత్తం మరియు డిమాండ్ నోటీస్ తేదీ | స్వాధీనతా తేదీ | స్వాధీనతా స్టేటస్ |
|---|---|---|---|---|
| LNGUN0HL-06220025090 | 1. కోటేశ్వర రావు చెలబోయిన (రుణగ్రహీత) 2. శ్రావణి చెలబోయిన (సహ-రుణగ్రహీత) | రూ.11,80,339/- (రూపాయలు పదకొండు లక్షల ఎనభై వేల మూడు వందల ముప్పై తొమ్మిది మాత్రమే) తేదీ: 16-జనవరి-2025 | 17.11.2025 | భౌతికంగా స్వాధీనం |

ఆస్తి కలిగి ఉన్నది : గుంటూరు జిల్లా, నరసారావుపేట ఉప జిల్లా, చిలకలూరిపేట మండలం, కావూరు గ్రామం, లింగంగుంట్ల పంచాయతీ ఏరియా పరిధి, కావూరు గ్రామం వద్ద ఇ.నం.611-C, 145.2 చ.గ.ల విస్తీర్ణం యొక్క స్థలం 1150 చ.అ. నిర్మిత RCC ఇల్లు ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులచే: తూర్పు: కొన్నలగడ్డ శ్రీనుకు చెందిన ఆస్తి గోడ, పడమర: పంచాయతీ బజార్, ఉత్తరం: షేక్ మైమున్నీసా ప్రవీణ్‌కు చెందిన ఆస్తి, దక్షిణం: కె. కోటేశ్వరరావుకు చెందిన ఆస్తి. ఈ పై సరిహద్దులలో 145.2 గ. లేదా 121.40 చ.మీ. యొక్క స్థలం 1150 చ.అ. RCC నిర్మిత ఇల్లు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో.

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేదీ : 21.11.2025

సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున

వార్త


మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

-జాకబ్ బ్రౌడీ

# సంక్షోభంలో యువజనం!

యువతే జాతి పురోగతికి మూలాధారం. నేటి బాలలు, యువతీయువకులే రేపటి దేశభవిత నిర్ణేతలు. యువజనశక్తియుక్తులే దేశాభివృద్ధికి బాటలంటూ ఉపన్యాసాలిస్తూ, కోట్లాది రూపాయలు వారి సంక్షేమం, అభ్యుదయం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లోరోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు, ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ఉన్న యువతీయువకుల పరిస్థితి ఇందకు మినహాయింపు కాకపోయినా దేశ ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి రానురాను అత్యంత దయనీయంగా తయారవుతున్నది. చదివిన చదువులకు తగ్గట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోలేని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అర్థాకలితో అల్లాడిపోతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ చివరకు ఇంజినీరింగ్‌లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసిన విద్యార్థులు సైతం గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశంలో కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీ,ఇన్నీ కావు. నగరాలకు చేరుకొని ఒక పూటే తింటూ పోటీ పరీక్షలకు తయారవుతున్న కోట్లాది మంది విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పని చేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలనే ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒక స్థానం సంపాదించుకోవాలనే తపన ఉంది. అయినా ఏ ఆధారం లేక నిరుత్సాహంగా అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఏ చిన్న ఆధారం దొరికినా కష్టపడి పనిచేయడానికి వెనుకాడడం లేదు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులుచేసిన యువతీయువకులు నిన్నమొన్నటివరకు విదేశీ బాటపట్టేవారు. ఇప్పుడు రానురాను అవి కూడా ముగిసిపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు రెండోసారి స్వీకరించిన తర్వాత దాదాపు దారులు మూసేశారనే చెప్పొచ్చు. ఇందులో బాగానష్టపోయింది, పోతున్నది భారతదేశం నుంచి వెళ్లిన, వెళ్తున్నవారేనని చెప్పొచ్చు. వాస్తంగా అక్కడికి వెళ్లి చదువును మరింత పెంచుకొని, జీవనోపాధి సంపాదించాలని మనస్ఫూర్తిగా వారికి లేదు. కేవలం డబ్బు సంపాదన కోసమే అధికశాతం మంది వెళ్తున్నారు. ఇక్కడ ప్రజల డబ్బుతో చదివి, ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన యువతరం ఏదోరకంగా విదేశాలకు వెళ్లి తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని అక్కడి ప్రజలకు సేవలు అందించడానికి ఆరాటపడడంలో ఉన్న అంతర్థానాన్ని అర్థం చేసుకోవాలి. ఇలా విదేశాలకు వెళ్తున్నవారిలో భారతదేశం అగ్రస్థానంలోఉంటే అందులో తెలుగురాష్ట్రాలు మొదటి వరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. వీరంతా ఒకవేళ ఇక్కడే సేవలు అందిస్తారనుకున్నా వారికి తగిన వసతులు, వేతనాలు చెల్లించడంలో కేంద్రప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫలితంగా ఏదో ఒక జీవనోపాధి కోసం విదేశీ బాటలు పడుతున్నారు. ఇలా పడుతున్నవారిని మోసం చేసేవారు ఇటీవలకాలంలో పెరిగిపోతున్నారు. లక్షలాది రూపాయలు తలతాకట్టుపెట్టి అప్పుతెచ్చి దళారులకు ఇచ్చి మోసపోయిన నిరుద్యోగులు దేశంలో లక్షల్లోనేఉంటారు. ఇక నిరుద్యోగుల కోసంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. స్వయం ఉపాధిపథకాల కింద కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతోశాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేధాశక్తిని సంపాదించుకొని శక్తియుక్తులు ప్రతిభా సామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైందని తెలియనివారు ఎవరూ లేరు. నవ భారత నిర్మాణానికి ఉద్యమించి దేశకీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపవలసిన పవిత్ర బాధ్యత యువజనుల భుజస్కంధాలపై ఉన్నదని సమాజాన్ని ముందుకు నడిపేది, కొత్త మార్గాలకు జాతి వికాసానికి చేతులు కలిపి దోహదం చేసేది యువజనులేననేది నిర్వివాదాంశం. ఇలాంటి ఉపన్యాసాలు వింటూనే ఉంటాం. ఆ ఉపన్యాసాలు చేస్తున్న ప్రకటనలు పరిశీలిస్తుంటే దేశంలో యువజన సంక్షేమం ఆశ్చర్యం గొలిపేలా పయనిస్తున్నదని భావిస్తాం. ఇన్నికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా యువజనుల అభ్యున్నతే ధ్యేయంగాపనిచేస్తున్నామని పాలకులు ప్రకటిస్తున్నా ఇంతటి నిరుత్సాహం, నిస్పృహల్లో ఎందుకు యువజనులు మునిగిపోతున్నారనే అనుమానాలు రాకతప్పదు. అటు గ్రామాల్లో యువత, ఇటు నగరాల్లోని యువజనం కుల, మత, వర్గ, బేధాలులేకుండా అందరిలోనూ ఈ అసంతృప్తులు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఇవి పాలకులకు తెలియవని అంటే నమ్మశక్యంకాదు. అసలు యువజన సంక్షేమం కోసం చేపడుతున్నపథకాలు ఏమేరకు నిజమైన అర్హులకు అందుతున్నాయి? అందులో రాజకీయ జోక్యం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం వంటివి ఎందుకు నిరోధించలేకపోతున్నారు? ఇలాంటి కారణాలు ఎన్నో నిజమైన అర్హులకు దూరం చేస్తున్నాయి. అటు ఉద్యోగాలు రాక, స్వయం ఉపాధి పథకాలు కళ్లముందే అనర్హులపాలవుతుంటే నిరాశానిస్పృహలకు లోనవుతూ ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నవారు లేకపోలేదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. యువజనుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. పాలకుల వైఖరిలో మార్పురావాలి. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్దిష్టమైన కాలపరిమితిలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి. యువజన సంక్షేమ కార్యక్రమాలు త్రికరణశుద్ధిగా అమలు చేయాలి.

ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాస్‌తో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి.



ఐన్‌స్టయిన్

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్లే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలనిస్తుంది.



కె. స్టాన్ స్లావిస్కి

# అభివృద్ధికి తూట్లు పొడుస్తున్న అవినీతి

**చట్టాలు బలహీనంగా ఉంటే, నిఘా సంస్థలు నిద్రపోతే, ప్రజలు మౌనంగా ఉంటే అవినీతి పెరుగుతుంది. దీనికి నివారణ ఒకటే సామాజిక మేలుకొలుపు. దేశం మారాలంటే ప్రజల్లో సహనం పెరగాలి. రాజకీయ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గాలి. దర్యాప్తు సంస్థలకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలి. కఠినశిక్షలు తప్పనిసరి చేయాలి. పారదర్శక పాలన వ్యవస్థలను ప్రతిష్టించాలి. విద్యార్థులకు బాల్యంనుంచే నీతిపాఠాలు బోధించాలి. లంచం తీసుకున్నవారే కాదు, ఇచ్చిన వారికీ శిక్షలుండాలి. ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై పటిష్ఠ నిఘా ఉంటే ఓట్ల కు డబ్బుపంచడం ఆగిపోతుంది. అధికారులు తమను తాము శుభ్రపరుచుకుంటే వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు నిరసిస్తే పాలకులు వణికిపోతారు. అవినీతి రహిత భారతదేశం ఒక కలగానే మిగిలిపోతుంది అనేది ఒక నగ్న సత్యం. అందుకే మార్పు మన దగ్గర నుంచే ప్రారంభం కావాలి.**



మన్నారం నాగరాజు

ప్రపంచం మొత్తం క్యాన్సర్‌లా వ్యాపించిన ఒక వ్యాధి ఉంది శరీరానికి కాదు, సమాజానికి. రక్తప్రసరణకు కాదు, పరిపాలనకు. దేశాల భవిష్యత్తును క్షీణింపజేసే ఓ భయంకర జాడ్యం అదే అవినీతి. నాగరికతలు అభివృద్ధి చెంది, ప్రజాస్వామ్యాలు బలపడుతున్నాయని మనం చెప్పుకుంటున్నా, ఈ దుర్భందానికి ప్రపంచంలో ఇప్పటికీ శాశ్వత ఔషధం దొరకలేదు. దేశం ఎంత అభివృద్ధి చెందినదైనా, ప్రజాస్వామ్యం ఎంత పెద్దదైనా, నిబంధనలు ఎంత కఠినమైనా ఈ కలుషిత లావా మన వ్యవస్థలను మన కళ్ల ముందే కాల్చేస్తూనే ఉంది. 2003లో ఐక్యరాజ్యసమితి తీసుకున్న నిర్ణయం ప్రపంచ దేశాల పాలనలో పారదర్శకత అవసరాన్ని స్పష్టంగా చెబుతోంది. అవినీతి తాకిడికి విపరీతంగా బాధపడుతున్న ప్రపంచ ప్రజలకు ఓ మేల్కొలుపు పిలుపు. డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు అధిక పారదర్శకతతో, కఠిన చట్టాలతో అవినీతిని చాలా వరకు అదుపులో పెట్టాయి. మరో వైపు సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా, నార్త్ కొరియా వంటి దేశాలు అవినీతి అగాధంలో పూర్తిగా కూరుకుపోయి ప్రపంచ దృష్టిలో అత్యంత అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 1995 నుంచి ప్రకటిస్తున్న అవినీతి సూచీలో భారత్ స్థానమే మనకు అత్యంత చేదు నిజాన్ని చెబుతోంది. 180 దేశాల్లో మన దేశం 85వ స్థానంలో మాత్రమే ఉంది. ఇది మన అభివృద్ధి లక్ష్యాలకు పెద్ద అడ్డంకే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకు దెబ్బకు దెబ్బ. అవినీతి భారతదేశంలో నిన్న మొన్నటి సమస్య కాదు. స్వాతంత్ర్యం వచ్చిన రెండేళ్లకే 1948లో జీపుల కుంభకోణం వెలుగుచూసింది. అప్పటి మన హైకమీషనర్ వి.కె.కృష్ణమీనన్, అన్ని ప్రభుత్వ ప్రోటోకాల్స్‌ను పక్కనబెట్టి 80 లక్షల రూపాయల విలువైన జీపుల కొనుగోలుకు విదేశీ కంపెనీతో అక్రమ ఒప్పందం చేసుకోవడం దేశంలో అవినీతి వ్యవస్థకు తొలి అధ్యాయం అయింది. ఆ రోజు నుంచే మన దేశంలో అవినీతి కేసులు వరదలా వస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా, నాయకులు మారినా, ఆశలు మారినాకానీ అవినీతి మాత్రం ప్రతి కాలంలో రెక్కలు విప్పి ఆకాశంలో ఎగిరింది. భారతదేశ చట్టాలు, న్యాయ వ్యవస్థ, పరిపాలనలో అనేక లోపాలు ఉండటం వల్ల ఈ అవినీతి రాక్షసానికి మరింత బలం వచ్చింది. ఉన్నతాధికారులకు ఇచ్చిన విస్తృత విచక్షణాధికారాలు, నిఘా సంస్థల నిద్రలేపకపోవడం, ఫైల్ ప్రాసెసింగ్‌లో ఉన్న అడ్డంకులు, పారదర్శకత లేకపోవడం, వ్యవస్థలో పాతుకుపోయిన పనితీరు ఇవన్నీ అవినీతికి కారణమయ్యాయి. అది ఒక మొక్కలా పెరిగి చెట్టుగా మారింది. చెట్టుగా మారి అడవిగా వ్యాపించింది. చివరకు న్యాయ వ్యవస్థ ద్వారాల దగ్గరికి కూడా చేరేసుకుంది. 2021లో అత్యధిక అవినీతి ఉన్న రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ పేర్లు చేరుకోవడం మనకు ఒక పెద్ద హెచ్చరిక. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రతినిధులుగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ, ఎంపీలూ కూడా అవినీతి పాలై సమాజాన్ని తప్పుదోవ పట్టించడం దురదృష్టం. ఒకప్పుడు రాజకీయాలను సేవగా భావించేవారు. ఇప్పుడు రాజకీయాలు అత్యంత లాభదాయక వ్యాపారంగా మారిపోయాయి. ఎన్నికల్లోడబ్బు, మద్యం, బహుమతులు పంచడం సాధారణ ప్రక్రియగా మారిపోయింది. 50సంవత్సరాల క్రితం ఓటర్లకు డబ్బులివ్వాలని ఎవరూ అనలేదు. ఇప్పుడు శాసనసభ ఎన్నికలకు



100 కోట్లు, పార్లమెంటు ఎన్నికలకు 200 కోట్లు ఖర్చు చేస్తున్నారంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? స్పష్టమే అవినీతి ద్వారానే. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఓటుకు 10,000 రూపాయలు వరకూ ఇవ్వడం సాధారణంగా మారిపోయింది. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో ఓ పార్టీ గోనెసంచుల్లో నోట్ల కట్టలతో కాలనీల్లో తిరుగుతూ ఇంటింటికి వెయ్యి రూపాయలు పంచిన ఘటన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నం. ఇది కేవలం ఓట్ల కొనుగోలుకాదు. ప్రజాస్వామ్య విలువలకే ఖనన. ఇదంతా రాజకీయ నాయకులకే పరిమితం కాదు. పరిపాలన వ్యవస్థలోని ఉన్నతాధికారులు, ముఖ్యంగా ఉన్నతస్థానాల్లో ఉన్నవారు, ప్రతిష్టాత్మక పదవులలో ఉన్నవారు కూడా లంచాల్లో మునిగిపోయిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. 2018-19లో 643 ఫిర్యాదులు, 2019-20లో 753, 2020-21లో 581 ఫిర్యాదులు ఉన్నతాధికారులపై రావడం బాధాకరం. కాని అత్యంత భయంకరమైన పరిస్థితి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో నమోదు అవుతోంది. మొత్తం 1,15,000 మందిపై అవినీతి ఆరోపణలు రావడం దేశ పరిపాలనా దౌర్బల్యానికి స్పష్టమైన ప్రతీక. అందులో ప్రభుత్వ ఉద్యోగులపై మాత్రమే 11,000కేసులు రావడం ఆశ్చర్యం. కేవలం ప్రభుత్వ ఉద్యోగులే కాదు మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, మైనింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్, విద్యుత్, ఆరోగ్య రంగాలు ప్రతి రంగంలోనూ అవినీతి శిరాకేసి కూర్చుంది. 2013లో ఎర్నెస్ట్ యంగ్ సంస్థ ఇచ్చిన నివేదిక దీనికి ధృవీకరణ. ఇప్పుడు తెలంగాణ విషయానికి వస్తే ,రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అవినీతి గురించి చెప్పాలంటే, మాటలు సిగ్గుపడతాయి. రెండు సంవత్సరాల్లో మూడు సార్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు జరగడం కూడా ఇదే కథ చెబుతోంది. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఏ శాఖ చూసినా లంచాల బజారుగా మారిపోయింది. భూముల రిజిస్ట్రేషన్లకు 25,000 నుంచి60,000 వరకు బహిరంగంగా లంచం తీసుకుంటున్నారంటే సాధారణ మధ్యతరగతి ప్రజలపై పడుతున్న భారాన్ని ఊహించుకోవచ్చు. చిన్నపాటి వివాదాలున్న భూములైతే లక్షల్లో డిమాండ్లు చేస్తున్నారు. అధికారులకు అండగా కొన్ని డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, రాజకీయ నాయకులు కలిసిఒక వ్యవస్థీకృత అక్రమ అండర్‌వల్డ్‌ను ఏర్పరుచుకున్నారు. కొందరు రోజుకు లక్షలు సంపాదిస్తున్నట్లు ఏసీబీ విచారణల్లో బయటపడింది. వెంటనే స్పందించాల్సిన పరిస్థితి ఇది. కానీ అవినీతి అధికారులు దాడులు చేయొద్దని, లేని పక్షంలో ఉద్యోగాలకు రాకుండా సమూహంగా సెలవులు తీసుకుంటామని ప్రభుత్వానికే బెదిరింపులు పెడుతున్నారు! అవినీతిఇంత బలవంతం అవడం మన పాలనా వ్యవస్థ పతనానికి సంకేతం. హెచ్ఎండీఏ, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల్లో ఆస్తుల అక్రమకేసులు, ట్రాప్‌లు, ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో ప్రతి నాలుగు రోజులకు ఒక అవినీతి కేసు నమోదవుతోంది. ఇది కేవలం అంకెల సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్యానికి వచ్చిన పగుళ్లు. ఈ అన్ని ఉదాహరణలు మనకు ఒక స్పష్టమైన నిజం చెబుతున్నాయి. చట్టాలు బలహీనంగా ఉంటే, నిఘా సంస్థలు నిద్రపోతే, ప్రజలు మౌనంగా ఉంటే అవినీతి పెరుగుతుంది. దీనికి నివారణ ఒకటే సామాజిక మేలుకొలుపు. దేశం మారాలంటే ప్రజల్లో సహనం పెరగాలి. రాజకీయ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గాలి. దర్యాప్తు సంస్థలకు సంపూర్ణ స్వేచ్ఛఇవ్వాలి. కఠినశిక్షలు తప్పనిసరి చేయాలి. పారదర్శక పాలన వ్యవస్థలను ప్రతిష్టించాలి. విద్యార్థులకు బాల్యంనుంచే నీతిపాఠాలు బోధించాలి. లంచం తీసుకున్నవారే కాదు, ఇచ్చిన వారికీ శిక్షలుండాలి. ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై పటిష్ఠ నిఘా ఉంటే ఓట్లకు డబ్బుపంచడం ఆగిపోతుంది. అధికారులు తమను తాము శుభ్రపరుచుకుంటే వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు నిరసిస్తే పాలకులు వణికిపోతారు. అవినీతి రహిత భారతదేశం ఒక కలగానే మిగిలిపోతుంది అనేది ఒక నగ్న సత్యం. అందుకే మార్పు మన దగ్గర నుంచే ప్రారంభం కావాలి. ●

# యువతకు ఆత్మస్థైర్యమే ఆయుధం

డాక్టర్. వై.సంజీవ కుమార్

నేడు యువత మేధస్సులో పదును తగ్గింది, ఆలోచనలో లోతు తగ్గిపోయింది. ఆవేశంలో వేగం పెరిగింది. కానీ వెళ్లాల్సిన గమ్యం ఏది అనేదే తెలియకుండానే పరుగెడుతున్నారు. జీవితాన్ని సార్థకం చేసుకునే వయస్సులో, తప్పటడుగులతో జీవితాన్ని నాశనం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆధునిక పోకడలు అధికమయ్యాయి. విలువలు, బాధ్యతలను వదిలేసేస్తున్నారు. సంతోషం, ఎంటర్టైన్మెంట్, ఎంజాయ్ అనే పేర్లతో నా జీవితం నా ఇష్టం అనే క్షణికానందంతో జీవితాలను అతలాకుతలం చేసుకుంటున్నారు. వాళ్ళ జీవితానికి ఇవ్వాల్సిన విలువ, పెద్దలకు, సమాజానికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేక సర్వస్వం కోల్పోతున్నారు. సామజిక స్పృహ, ధైర్యం లేని చోట, అవకాశాలు కనిపించవు. ఆత్మస్థైర్యం వదిలేసినప్పుడు, ప్రతి సమస్య పెద్ద కొండలా అనిపించేలా ఉంటుంది. భయంతో, అయోమయంతో, ఒక్క తప్పు అడుగు జీవితాన్ని తప్పు దిశలో నడిపేస్తోంది. విద్యార్థి దశ అభివృద్ధి కాలం, అభివృద్ధికి అన్వేషణ సమయం, జీవితానికి పునాది వేసే వయస్సు. కానీ ఈ దశలోనే యువత. దిశ మార్చి, దారితప్పి, తమలో ఉన్న అద్భుతమైన శక్తిని మరచిపోతున్నారు. వాళ్లలో కొరత ప్రతిభలో కాదు, ధైర్యాన్ని నిలబెట్టే మనసులోవారికి లోపం బుద్ధిలో కాదు. యువత ఇప్పటికైనా గ్రహించాలి. జీవితం ఒక్క రోజులో సార్థకం కాదు. కానీ తీసుకునే ఒక్క నిర్ణయం మాత్రం జీవితాన్ని మార్చిపెట్టగలదు. మనస్సులో పదును పెరిగితేనే, జీవితంలో వెలుగు పుడుతుంది. జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే చుట్టూ సమాజంలో కనిపించేవాటిలో ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు, అనేక సంఘటనల నుంచి గ్రహించవచ్చు, విజయం సాధించిన



ఎందరో మీ ముందు కనిపిస్తున్నారు, మీకు తెలియని వాళ్ళ జీవితాలకన్నా, మీకు కనిపిస్తున్న వాళ్ళ జీవితాలను గ్రహించండి. చిన్నస్థాయి ఉద్యోగం నుంచి అత్యున్నతమైన స్థాయికి చేరుకునేవాళ్ళు, వీధిలో వ్యాపారం నుంచి విదేశాలలో ఎగుమతులు చేసే స్థాయికి వచ్చినవాళ్లు, రీసెంట్‌గా చిన్న వయస్సులోనే శాసనసభ్యురాలిగా ఎన్నికైన మైథిలీ ఠాకూర్ ఇలా ఇందరో ఉన్నారు. వ్యాపారాలలో విజయపరంపర సాగిస్తున్న వ్యాపార వేత్తలు, ఇంకా ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్‌లు ఇలా ఎందరో మీ చుట్టే ఉన్నారు. వాళ్ళ జీవితాలను పరిశీలించండి, ఎన్ని ఒదిగుడుకులు ఎదుర్కొని సాధించారో అర్థం అవుతుంది. విజయం సాదించినవాళ్లు మొదటి ప్రయత్నంలోనే గెలుపు సాధించలేదు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని అహర్నిశలు కష్టపడ్డారు. ఆకలి బాధలను ఓర్చుకున్నారు. కన్నీళ్లను దిగమింగుకున్నారు. ఓడిపోయినా పట్టు విడువ లేదు, లక్ష్యాన్ని సాధించేవరకు యుద్ధమే చేసారు. జీవిత ఆశయాన్ని నిలబెట్టుకున్నారు. జీవితాన్ని సార్థం చేసుకోవ డం ఒక కల, ఆ కలను సాధిస్తే మీరే ఎందరికో మార్గదర్శ కులు అవుతారు. జీవితం ఎడారి, రహదారిని నిర్మించుకో వలసింది మీరే, తప్పటడుగు వేస్తే జీవితం అగాధంలోకే వెళ్తుంది, మనిషి బానిసగా మార్చే వ్యసనాలను దరి చేర నీయకపోతే మీరు రహదారిలోనే వెళ్తునట్టే. ఎవ్వరో వచ్చి మేల్కొల్పరు. మీ జ్ఞానమే మీకు మేలుకొలుపు అవ్వాలి. జీవితం అత్యంత విలువైనది. కోల్పోవడం క్షణమే, కానీ నిలుపుకోవడం సాధించుకోవడం సాగిపోవడం జీవితాన్ని సార్థం చేసుకోవడమే. మనస్సును సానుకూలమైన వాటి పట్ల కేంద్రీకరిస్తే శక్తివంతంగా మారుతుంది. మీ దశ మార్చే వెలుగు రేఖ అవుతుంది. మీ దిశనే మార్చేస్తుంది. ఆలోచన ఓ విత్తనం, ఆచరణే దానికి జీవం. సాధిస్తే మహా వృక్షమే అవుతుంది, కావలసింది మీలో దృఢమైన సంకల్పం. ఆత్మస్థైర్యమే ఆయుధంగా మారాలి. దృఢమైన ఆచరణ కొనసాగిస్తే మీరే విజేత. ●

# ప్రజావాక్కు



## రైతులకు పెరుగుతున్న సవాళ్లు

పత్తి పంటభారత వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తుందనే విషయం తెలిసిందే. అయితే ఇటీవలి కాలంలో పింక్ బాల్‌వార్మ్ దాడులు పత్తి రైతులను తీవ్రసవాళ్లను ఎదుర్కొనే పరిస్థితికి నెదుతున్నాయి. పత్తి కాయల లోపలికి చేరి గింజలు, నూలు రెండింటినీ పాడుచేసే ఈ పురుగు వల్ల కాయలు బయటకు ఆరోగ్యంగా కనిపించినా లోపల పూర్తిగానాశనం అవుతుంటాయి. ఫలితంగాకోత సమయంలోనే రైతులకు అసలు నష్టం తెలుస్తుంది. ఈ దాడుల కారణంగా పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు ఉత్పత్తి వ్యయాలను తిరిగి పొందే అవకాశాన్నే తగ్గిస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలకు భారీగా ఖర్చు పెట్టిన రైతులుచివరికిలాభం కాకుండానష్టాలతో నిలబెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో రుణభారం, మార్కెట్ అనిశ్చితి, వంటి ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మీసేవ సిబ్బంది సమస్యలు ఎన్నో

రాష్ట్రంలోని ప్రభుత్వ మీ సేవ కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బందివారికి కనీస వేతనాలు పెంచాలి. సర్కార్ కొత్తగా ప్రవేశ పెడుతున్న సేవలవల్ల వారికి పనిభారం పెరుగుతున్నది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలుప్రజలకు అన్నిరకాల సేవలను అందిస్తున్నాయి. అయినప్పటికి గత రెండేండ్లుగా మీ సేవ కేంద్రాల కనీస వేతనాలు పెంచలేదు. వార్షిక బోనస్ ఇన్సెంటీవ్ చెల్లించలేదు. పీఎఫ్‌ఖాతాలను బ్రేక్ లేకుండా కొనసాగించడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం విధివిధానాలు రూపొందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## వికలాంగులకు డిప్యూటేషన్ రద్దు చేయాలి

వికలాంగుల ఉద్యోగులువారి ఇష్టప్రకారం వారు కోరుకొంటేనే డిప్యూటేషన్‌లో పంపాలి. కానీ బలవంతంగా పంపవద్దు. వారు దృష్టిలోపంతో వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్నారు. ఒక సంవత్సర కాలం కూడా పూర్తి కాక ముందే డిప్యూటేషన్ అనిఅధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వికలాంగులు గదులు కిరాయికి తీసుకొని పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడం జరుగుతుంది.

- రాపాక రవీందర్, జనగాం

## సోషల్ మీడియా ప్రభావం

ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించే దిశగా ముందడుగు వేయడం, ప్రపంచ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఇది కేవలం నియంత్రణ చర్య మాత్రమే కాకుండా పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రత, అభివృద్ధినికాపాడేందుకు తీసుకున్నసమయోచిత నిర్ణయం. భారత దేశం వంటి పెద్ద జనాభా కలిగిన దేశాల్లో ఈ చర్య మరింత అవసరం. సాంకేతిక వినియోగం పెరుగుతున్న కొద్దీ పిల్లలపై దానిదుష్ప్రభావాలు వేగంగావిస్తరిస్తున్నాయి. అందువల్ల భారత ప్రభుత్వం కూడా ఈ దిశగా ఆలోచించి, వయసు నియంత్రణ, ధృవీకరణ వంటి చర్యలను అమలు చేయడం అత్యవసరం. సోషల్ మీడియా పిల్లలపై కలిగించే హానికర ప్రభావాలు అనేకం. మొదటగా, మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. నిరంతరం లైక్‌లు, ఫాలోవర్లు, కామెంట్ల కోసం ఎదురు చూడటం వల్ల ఆందోళన, డిప్రెషన్, తక్కువ స్వీయగౌరవం వంటి సమస్యలు పెరుగుతాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బంగ్లాతో స్నేహం

బంగ్లా చరిత్ర ఒక మలుపు వైపుగా ప్రయాణం చేస్తున్నది. దక్షిణాసియాలోనే మూడో దేశాధినేతగా వ్యవహరించిన వ్యక్తికి మరణ దండన పడిన నేపథ్యం చూస్తున్నాం. 1971 బంగ్లా లిబరేషన్‌లో పుట్టుకొచ్చిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ హసీనాకు మరణ దండన విధించింది. ఇకపోతే ఈ బంగ్లా పరిణామాలు భారత్ పైన కచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. ఎలా భౌగోళికంగా భారత్ 4000 కిలోమీటర్ల పై బడి సరిహద్దును పంచుకుంటున్నది. సాంస్కృతిక స్నేహశీలతను ఆ దేశంతో కలిగి ఉంది. బంగ్లా విముక్తి పోరాటానికి భారత్ సహాయం చేసింది. అంటే భౌగోళికంగా, చారిత్రకంగా చూసిన భారత్ బాంగ్లాదేశ్ తో ఒక గొప్ప చారిత్రక నేపథ్యం కలిగి ఉంది.

-భారత అవినాష్, జనగామ

## లక్ష్మణ్‌ని హెడ్‌కోచ్‌గా నియమించాలి

వి.వి.ఎస్.లక్ష్మణ్‌ను భారత జట్టుకు హెడ్ కోచ్‌గా నియమించడం సముచితం. ఆయనకు అంతర్జాతీయ క్రికెట్‌లో విశాలమైన అనుభవం, నిశ్చల స్వభావం, ఆటగాళ్లను ప్రేరేపించే నాయకత్వ లక్షణాలుఉన్నాయి. భారతజట్టుకు ఎన్నో మరుపురాని విజయాల్ని అందించారు. ఎన్.సి.ఏ. హెడ్‌గా అనేక యువ ఆటగాళ్ల ప్రతిభనువెలికితీసిజట్టుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నైపుణ్య విద్యతోనే ఉద్యోగ కల్పన సాధ్యం

సొప్పరి నరేందర్

విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవనపద్ధతి. విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది. నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈమూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు. సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశం ముందుకు సాగుతుంది. విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం. నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి, నవ చైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. నైపుణ్యం ఆధునిక ప్రపంచానికి పునాది, ప్రపంచం మారుతోంది. జ్ఞానం కంటే నైపుణ్యాలే నేటి ఉద్యోగ విపణిలో ముఖ్యం అవుతున్నాయి. కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, సమస్య పరిష్కరణ, నాయకత్వ లక్షణాలు వంటి అనేక నైపుణ్యాలు వ్యక్తిని విజయవంతుడిగా నిలబెట్టే మెట్లు. సాంప్రదాయ విద్యలో నైపుణ్యాల మీద పెద్దగా దృష్టి ఉండలేదు. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యావ్యవస్థ నైపుణ్యాల పెంపు వైపు మళ్లాలి. పాఠశాలస్థాయి నుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు. నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలి నుంచి మార్చుతుంది నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాల పట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు. నవ చైతన్యం అభివృద్ధికి కొత్త



దారి, భవిష్యత్తు నవచైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడం సరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకు సాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవ చైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్యాలక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగిన వాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం. పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలల నుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్నికోణాల్లో అభివృద్ధి చేసేసమగ్ర ప్రక్రియకావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు, సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టుఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలువిద్యార్థులను భవిష్యత్తువైపు తీర్చిదిద్దుతున్నాయి. నేటితరం ఉద్యోగాలకేకాదు, జీవితానికి సిద్ధమవ్వాలి. అందుకోసం నైపుణ్యం, నీతి, సృజనాత్మకత కలిసి నడిచే విద్య అవసరం. ●

## దూరవిద్య పీజీ పరీక్షల ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నవంబరు20, ప్రభాతవార్త: వర్సిటీ దూరవిద్యా కేంద్రం జూలై/ఆగస్ట్ నెలల్లో నిర్వహించిన పీజీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. ఎంఏ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, హిందీ, తెలుగు, ఇంగ్లీష్, జర్నలిజం, సోషియాలజీ, సోషల్‌వర్క్, ఎంఎస్సీలో కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బోటనీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, మాథమాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఐటి, సైకాలజీ, ఎంకాం, ఎంబిఏ, ఎంసిఏ, హెచ్‌ఆర్ఎం, ఎంఎల్ఐఎస్‌సి, బిఎల్ఐఎస్‌సి కోర్సుల ఫలితాలు ఉన్నాయి. పరీక్షల ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ మాట్లాడుతూ పీజీ కోర్సులకు రీవాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించి ఈనెల 29లోగా దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తులు డిసెంబరు2వ తేదీలోగా పంపాలని సూచించారు. ఈ సందర్భంలో పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు కృష్ణవేణి, కోదండపాణి, సూపరింటెండెంట్ వెంకటప్పారెడ్డి, దూరవిద్యా కేంద్రం ఐసిటి డివిజన్ డైరెక్టర్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త





# గుంటూరు కార్పొరేషన్‌లో ...
# మేం పనులు చేయలేం...బాబోయ్!

**-అభివృద్ధి పనులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్న కాంట్రాక్టర్లు...**
**-అప్పులు చేసి పనులు చేసే బిల్లుల చెల్లింపులో పక్షపాతం అంటూ అసంతృప్తి**
**-పెట్టుబడి డబ్బుకు వడ్డీలు కట్టలేక అల్లాడిపోతున్నామంటున్న కాంట్రాక్టర్లు**
**-పనులు చేయాలని బెదిరిస్తున్నారంటూ కాంట్రాక్టర్ల గగ్గోలు**
**-నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే బిల్లులు చెల్లిస్తామంటూ హడావుడి**
**- ఒక్క కాంట్రాక్టర్‌కి ఒక బిల్లే... అంటూ షరతు... నేటితో గడువు ముగింపు**

**గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 20, ప్రభాతవార్త :** గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని నగరంలో పలు అభివృద్ధి పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. వా మ్మో గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు చేయాలా...? ! ఇప్పటివరకు చేసిన పనులు పూర్తయ్యాక బిల్లులు చెల్లించడం లేదంటూ పనులు చేసేందుకు ముందుకు రాకపోవడమే కాకుండా... ప్రస్తుతం అక్కడ పనులు చేయలేం బాబోయ్ అంటూ కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇంట్లో భార్య, పిల్లల బంగారం తాకట్టు పెట్టి, ఒక వేళ డబ్బులు చాలకపోతే అధిక వడ్డీలకు అప్పు తీసుకొని వచ్చి గుంటూరు నగరానికి మంచి పేరు రావాలని పనులు పూర్తి చేస్తే బిల్లులు చెల్లించడం లేదంటూ బహిరంగంగానే అధికారులకు వెల్లడిస్తున్నారు. పనులు పూర్తి చేశాక బిల్లుల కోసం చెప్పులు అడిగేలా కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క అప్పులు చేసి వాటికి వడ్డీలు కట్టలేక, మరోపక్క సకాలంలో బిల్లులు రాకపోవటం వల్ల నరకయాతన అనుభవిస్తున్నామని కార్పొరేషన్ లో బహిరంగంగానే కాంట్రాక్టర్లు వెల్లడిస్తున్నారు. పనులు చేసే వరకు అధికారులు వెంటపడతారని ఆ పనులు పూర్తయ్యాక తాము పడుతున్న బాధ ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లింపులో పక్షపాత వైఖరి వల్ల సకాలంలో పనులు చేసిన తాము తీవ్ర స్థాయిలో నష్టపోతున్నామని అనేకమంది కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం పెట్టుబడి పెట్టిన డబ్బుకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామంటూ, బిల్లుల కోసం కార్పోరేషన్ చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతూ అనేక అవమానాలపాలయ్యామని వెల్లడిస్తున్నారు. ఒకపక్క ఇళ్లల్లో వాళ్ళ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, బ్యాంకులో డబ్బు చెల్లించాలని, వడ్డీకి తెచ్చిన డబ్బులు కట్టాలంటూ కాంట్రాక్టర్లు కొంతమంది అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగి మొర పెట్టుకున్న ఎటువంటి ఫలితం లేకపోవడంతో తిరిగి మరికొంత వడ్డీకి అప్పు తెచ్చుకొని తమ అవసరాలు గడుపుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు బిల్లులు ఇవ్వటం లేదంటూ ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి చేతులు జోడించాల్సిన పరిస్థితి ఎదురైందని వెల్లడిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన వారికి సిఫార్సు చేస్తేనే ఇప్పటివరకు బిల్లులు చెల్లించారని బాధితులైన అనేకమంది కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ లో మేము పనులు చేయలేమంటూ చెబుతున్న ఏదో విధంగా చేయాలంటూ తమపై ఒత్తిడి చేయడమే కాకుండా బ్లాక్ లిస్టులో పెడతామంటూ అవసరం అయితే బెదిరింపులకు దిగుతున్నారని వాపోతున్నారు. చేయాల్సిందంతా చేసి ప్రతి కాంట్రాక్టర్ నిధి పోర్టల్ లో బిల్లులు అప్లోడ్ చేస్తే చెల్లిస్తామంటూ హడావుడి చేస్తున్నారని చెబుతున్నారు. అయితే కోట్ల రూపాయల పనులు చేస్తే ఒక కాంట్రాక్టర్కు ఒక బిల్లే అప్లోడ్ చేస్తామని షరతులు విధించారన్నారు. నిధి పోర్టల్ లో ఎక్కించిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని వారు వెల్లడిస్తున్నారు. నిధి పోర్టల్ లో బిల్లులు అప్లోడ్ చేసే గడువు సాయంత్రం తో ముగిసిపోయిందని, మళ్లీ తిరిగి సైట్ ఎప్పుడు ఓపెన్ అయితే అప్పటి వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనా గుంటూరు కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు చేయాలంటే మా వల్ల కాదు బాబోయ్ అంటూ కొంతమంది కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్న వాటిని చేయకుండా క్యాన్సిల్ చేసుకుంటే, మరి కొంతమంది ఆన్లైన్ టెండర్ లో పాల్గొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరి కొంతమంది కాంట్రాక్టర్లు కొంతకాలం వరకు పనుల జోలికి వెళ్ళకూడదు అంటూ కార్పోరేషన్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. వారికి అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే బిల్లులు చెల్లించడం పై నీకు మంది కాంట్రాక్టర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

**అడ్డగోలుగా రోడ్లు తవ్వేశారంటూ ఎమ్మెల్యేలు అసంతృప్తి :** గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న అనేక ప్రాంతాలలో అభివృద్ధి పనుల పేరుతో అడ్డగోలుగా ఎక్కడపడితే అక్కడ తోవ్వేసారంటూ గుంటూరు కార్పొరేషన్ పరిధికి సంబంధించిన ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి,బూర్ల రామాంజనేయులు లు ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికారుల పనితీరును ఎండగట్టిన విషయం విధితమే. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే, టెండర్లు దక్కించుకున్న మిగతా పనులు ఏ విధంగా పూర్తి చేస్తారంటూ వారు అధికారులను ప్రశ్నించిన సందర్భాలు అనేక ఉన్నాయి. ఏదో అభివృద్ధి చేసేస్తున్నామంటూ రోడ్లను ఎక్కడపడితే అక్కడ తోవ్వేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే ఎలా అంటూ కౌన్సిల్ వేదికగా ప్రజా ప్రతినిధులు ప్రశ్నించిన విషయం విధితమే. అనేకమంది కాంట్రాక్టర్లు కార్పొరేషన్ పరంగా వాళ్లకు బిల్లులు చెల్లింపులు కాకపోవడం పై ఎమ్మెల్యేల వద్ద మొరపెట్టుకోవటంతో కౌన్సిల్లో వారు అధికారులను ప్రశ్నించారు. ఈ పరిస్థితి చూస్తుంటే సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థమైపోతుంది.

**నిధి పోర్టల్ లో అనేకమంది కాంట్రాక్టర్లను ఎక్కించలేదు :**
ఎమ్మెల్యే మాధవి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోతే వారు మరొక అభివృద్ధి పని చేపట్టాలంటే ఎలా చేస్తారంటూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవి సాక్షాత్తు కౌన్సిల్ సమావేశంలో అధికారులను ప్రశ్నించిన విషయం విధితమే. కార్పొరేషన్ నుంచే నేరుగా బిల్లులు ఇచ్చే విషయంలో అన్యాయం జరిగి నష్టపోయిన వారు అనేకమంది ఉన్నారని, అలానే నిధి పోర్టల్ లో అనేకమంది కాంట్రాక్టర్ల బిల్లులు అప్లోడ్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించాలని కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 300 మంది పైగా కాంట్రాక్టర్లు నిధి పోర్టల్ లో అప్లోడ్ అవ్వకుండా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే గల్లా మాధవి అడిగిన ఈ ప్రశ్న పై నిధి పోర్టల్ లో బిల్లులు అప్లోడ్ చేసేందుకు మరో అవకాశం కల్పించినట్టు, అదికూడా గురువారం సాయంత్రం తో ముగిసినట్టు తెలిసింది. ఇప్పటివరకు గుంటూరు కార్పొరేషన్ కు సంబంధించి ఎంతమంది కాంట్రాక్టర్లను నిధి పోర్టల్ లో ఎక్కించి బిల్లులు చెల్లించేందుకు కార్పొరేషన్ అధికారులు నివేదిక సిద్ధం చేశారో తెలియాల్సి ఉంది.

**అప్పుడు సిఎం ఎఫ్ఎస్... ఇప్పుడు నిధి పోర్టల్ అంతే తేడా...?**
గత వైసిపి ప్రభుత్వం లో కాంట్రాక్టర్లు ఏమైనా అభివృద్ధి పనులు చేపడితే అవి పూర్తయ్యాక బిల్లులు తీసుకోవాలంటే సీఎం ఎఫ్ ఎస్ సైట్లో బిల్లులు అప్లోడ్ చేస్తే ఎప్పటికో చెల్లింపులు జరిగేవి. ఈ కారణం వల్ల వైసిపి గవర్నమెంట్ లో టెండర్లు దక్కించుకున్న అనేకమంది కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనకడుగు వేశారు. త్వరగా పనులు చేసి పూర్తయ్యాక ప్రభుత్వం నుంచి బిల్లులు ఎప్పుడు వస్తాయో అంటూ పనులు చేసేందుకు ముందుకు రాలేదు. కార్పోరేషన్ కమిషనర్ గా ఉన్న కీర్తి చెరుకూరి ఉన్న విషయాన్ని స్పష్టంగా చెబుతూ మీ ఇష్టమైతే పనులు చేయండి... బిల్లులు మాత్రం సీఎం ఎఫ్ఎస్ ద్వారా చెల్లించటం జరుగుతుందని స్పష్టం చేశారు. అందుకు ఇష్టపడిన కాంట్రాక్టర్లు మాత్రమే అప్పట్లో పనులు చేశారు.అనేక పనులు కాంట్రాక్టర్లు చేయకుండా పెండింగ్లో ఉంచారు.
ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సీఎం ఎఫ్ఎస్ ని రద్దు చేస్తున్నామని, స్థానిక సంస్థల్లో ఏ అభివృద్ధి పనులు జరిగిన బిల్లులు చెల్లించుకొనేలా ఆ స్థానిక సమస్యలకు అధికారాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ మున్సి పాలిటీలతోపాటు, పంచాయతీల్లో బిల్లులు చెల్లించే విధంగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. దీంతో అప్పటివరకు పెండింగ్లో ఉన్న పనులంతా కాంట్రాక్టర్లు శరవేగంగా పూర్తి చేశారు. కొన్ని నెలలు గడిచాక బిల్లులు చెల్లింపులో పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే హఠాత్తుగా ప్రభుత్వం నిధి పోర్టల్ లో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు అప్లోడ్ చేయాలని సూచించింది. ఈ నిధి పోర్టల్ లో బిల్లులు అప్లోడ్ చేయాలంటే తమ కనుకూలమైన కాంట్రాక్టర్లకు మాత్రమే అవకాశం దక్కుతుందని, నేరుగా బిల్లులు చెల్లించినప్పుడు అలానే... నిధి పోర్టల్ లో కూడా ఇలానే చేస్తున్నారని అనేకమంది కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ కష్టాలను గుర్తించి తగిన న్యాయం చేయాలని గుంటూరు కార్పొరేషన్ లోని కాంట్రాక్టర్లు అనేకమంది కోరుతున్నారు.

## నేరస్థులను ప్రోత్సహించేలా జగన్ తీరు: వర్లరామయ్య

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 20: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రూ. 43,000 కోట్ల భారీ ఆర్థిక అవినీతి కేసుల్లో జగన్ మోహన్ రెడ్డి ఏ1గా ఉన్నారని స్పష్టంగా పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్థిక అక్రమాలపై సీబీఐ విస్తృత దర్యాప్తు చేపట్టి 2012 నాటికే మొత్తం 11 ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఈ అక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రజల ఖజానాకు భారీ నష్టం కలిగించాయని అన్నారు. ఇటువంటి అవినీతిని రాష్ట్ర ప్రజలు ఎన్నడూ మరువరని దీనికి సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలు స్పష్టంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జగన్ 18 నెలలు రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. బెయిల్ ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు డివిజనల్ బెంచ్ జడ్జీలు, ఇంత తక్కువ సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇన్ని కోట్లు ఎలా సంపాదించగలిగాడని ప్రశ్నించి, ఆర్థిక పరమైన కేసులు హత్య కేసుల కంటే అత్యంత ప్రమాదకరమైనవి అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్‌లో ఆడిన ఖిడ్రామాఖి, నటించిన తీరు వర్ణనాతీతం, చట్టవ్యతిరేకం అని తీవ్రంగా విమర్శించారు. ఆయన గతంలో కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు కోరుతూ తాను ముఖ్యమంత్రిని, కోర్టుకు వస్తే శాంతిభద్రతలకు ప్రమాదం కలుగుతుందని, ప్రజల జీవనం కుంటుపడుతుందని, రాష్ట్ర ఖజానాకు ఖర్చు అవుతుందని చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక ముద్దాయి కోర్టుకు వస్తుంటే జనం ఎందుకు రావాలి? జగన్ దేశం కోసం పోరాడిన మహాత్మా గాంధీ గానీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ గానీ కాదని, ప్రజల సొమ్ము కొట్టేసిన ఆర్థిక నేరస్థుడని అన్నారు. గతంలో మాజీ ప్రధానులు, ముఖ్యమంత్రులు కూడా కోర్టుకు హాజరయ్యారని ముఖ్యమంత్రి అనే కారణంతో హాజరు నుంచి మినహాయింపు కోరడం సబబు కాదు అని, చట్టం దృష్టిలో దొంగ దొంగేనని స్పష్టం చేశారు. జగన్ ఏమైనా దేశ సేవకుడా?: "దండాలు పెడుతూ వస్తున్నాడు... ఆయన ఏమైనా దేశ సేవకుడా? ఆంధ్రప్రదేశ్ కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు లాంటివాడా? బ్రిటిష్ వారి తుపాకులకు రొమ్ము విరిచిన ప్రకాశం పంతులా? హైకోర్టులో చిన్న కామెంట్ చేస్తే రాజీనామా చేసి నీలం సంజీవరెడ్డి లాంటివాడా?" ప్రజల సొమ్ము కొట్టేసి, 11 ఛార్జిషీట్లు ఎదుర్కొంటున్న ఆర్థిక నేరస్థుడు, ముద్దాయి కోర్టుకు హాజరయ్యే సందర్భంగా పొట్టి శ్రీరాములు వంటి దేశసేవకులతో, త్యాగధనులతో పోల్చుకునే విధంగా, లేదా ప్రజలకు అభివాదం చేసే విధంగా వ్యవహరించడం సిగ్గు లేనితనం అని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి కోర్టుకు హాజరవుతున్నప్పుడు పెద్ద ఎత్తున హడావుడి చేసి ప్రజల నుంచి దండాలు అందుకోవడం ద్వారా తాను ఏదో గొప్ప త్యాగం చేసిన వ్యక్తిగా లేదా ప్రజా నాయకుడిగా చూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అయితే వాస్తవానికి ఆయన ఆర్థిక నేరాల కేసుల్లో ముద్దాయి మాత్రమే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హైదరాబాద్ నాంపల్లి కోర్టుకు హాజరైన సందర్భంగా జరిగిన రభస, అలజడి సీబీఐ కోర్టును ప్రభావితం చేసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పోలీసులు జగన్‌ను నియంత్రించడంలో తత్తరబడ్డారని విమర్శించారు. ముద్దాయిని ఒక పోలీస్ వ్యాన్‌లో ఎక్కించి, నలుగురు పోలీసులు నేరుగా కోర్టుకు తీసుకురావచ్చు, కానీ ఆ విధంగా చేయకుండా అరాచకం సృష్టించేందుకు అనుమతించారని విమర్శించారు.



## నైపుణ్యాల మెరుగుకు ఏఎన్‌యు ప్రత్యేక శిక్షణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నవంబరు20, ప్రభాతవార్త: వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు నైపుణ్యాల మెరుగుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 10రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తరగతులు గురువారం ఆచార్య హరగోపాల్ రెడ్డి, ఆచార్య బాలమోహన్ దాస్ సెమినార్ హాల్స్‌లో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణకు 72గంటల ప్రణాళిక రూపొందించారు. అందులో 36గంటలు ఇంగ్లీష్, సాఫ్ట్‌స్కిల్స్, మరో 36గంటలు ఆప్టిట్యూడ్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈశిక్షణకు హైద్రాబాద్‌లోని ట్రీమ్ ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సిఇఓ జలపాటి శ్రీధర్, తన బృందంతో తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.లింగరాజు విద్యార్థులకు ఇచ్చే నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండి తౌసిఫ్ అహ్మద్ పర్యవేక్షణలో ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఇటువంటి కార్యక్రమాలకు అవకాశం కల్పించిన తాత్కాలిక వీసి ఆచార్య గంగాధరరావు, తాత్కాలిక రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలిపారు.




## మైనర్ బాలిక వివాహంలో ముగ్గురు అరెస్ట్

గుంటూరు క్రైమ్, నవంబర్20, ప్రభాతవార్త: సొంత కుటుంబ సభ్యులే మైనర్ బాలికకు వివాహం జరిపించి ఆమె జీవితాన్ని అగమ్యగోచర పరిస్థితి లో పడేసిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి బాద్యులైన వారిలో ముగ్గురని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సౌత్ డి.ఎస్పీ భానోదయ తెలిపారు. కొరివి శాంసన్, నిర్మల్ కుమారుడైన దానియేలు,వట్టి చేకూరు మండలం కొర్నేపాడు గ్రామనికి చెందిన నాయనమ్మ అయితే బాలికకు ,దానియేలు వరస అవ్వడంతో దగ్గర చుట్టరికం ఉన్నవారు కుటుంభం సభ్యులు కలసి 13 ఏళ్ల మైనర్ బాలికకు దానియేలు కు చర్చ్ లో ఈ ఏడాది 5వ నెలలో వివాహం జరిపించారు.తదుపరి కొన్ని నెలలు గడిచాక కట్నకానుకల విషయమై వివదాలు తలెత్తాయి.బాలిక తనకు తాను ఆలోచించుకుంటు తనను బడికి పంపిస్తాను అని చెప్పి పంపిచకుండా పెళ్ళి చేసి,కాపురానికి వచ్చి ఈ వివాదాల సుడిగుండంలో చిక్కుకున్న అని భయపడింది. ఈ నెల 8.11.25 న చైల్డ్ వెల్ఫేయిర్ 1098 కి సంప్రదించింది చరవణిలో అన్ని విషయాలు వెల్లడించింది.ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సౌత్ డి.ఎస్పీ బానుదయ ఆధ్వర్యంలో బాలిక ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కారకులైన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డి.ఎస్పీ తెలిపారు. బాధిత వివాహానికి ప్రోత్సాహహించిన వారిని అరెస్టు చేయాల్సి ఉందని డి.ఎస్పీ తెలిపారు.



## అన్నదాతకు కొండంత అండగా చంద్రబాబు: ఎంఎ షరీఫ్



గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 20: అన్నదాతకు కొండంత అండగా చంద్రన్న ఉన్నాడంటూ మరోసారి ఁఅన్నదాత సుఖీభవ్త రెండోసారి నిధులు విడుదల చేసి రైతుకు భరోసానిచ్చారని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ తెలిపారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని జగన్ రెడ్డి ఎంత దారుణంగా నట్టేట ముంచేశారో ఈ గణాంకాలే సాక్ష్యమన్నారు. ఆయన గత ఐదేళ్లలో రైతులకు రూ. 58 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రూ. 39 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, రైతును పూర్తిగా దగా చేశారు. ధాన్యం అమ్ముకున్నా రైతుకు డబ్బులివ్వని దుస్థితి తీసుకొచ్చారు. 84,724 మంది రైతులకు చెల్లించాల్సిన రూ. 1,674.47 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, రైతు కష్టం విలువ తెలిసి, జగన్ రెడ్డి పెట్టిన ఈ రూ. 1,674.47 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించి రైతుకు భరోసా ఇచ్చింది.జగన్ రెడ్డి ఖివైఎస్సార్ రైతు భరోసాఖి అని హంగామాగా ప్రచారం చేసుకుని, ఓటు బ్యాంకు రాజకీయమే లక్ష్యంగా పనిచేశారు. రాష్ట్ర నిధుల నుంచి ఆయన కేవలం రూ. 3,000 మాత్రమే ఇచ్చి, మిగతా రూ. 6,000 కేంద్రం ఖీలికిసాన్‌ను కలిపి, రూ. 13,500 అని అబద్ధాల హడావిడి సృష్టించారు. అంటే, ఐదేళ్లలో ఒక్కో రైతుకు ఆయన ద్వారా కనీసం రూ. 30,000 నష్టం జరిగింది! 64 లక్షల మందికి ఇస్తానని హామీ ఇచ్చి, చివరకు లక్షలాది మంది అర్హులను పక్కన పెట్టి కేవలం 52 లక్షల మందికే వర్తింపజేశారు. ఈ మోసం చాలు, జగన్ రెడ్డి రైతు సంక్షేమాన్ని ఎలా నిర్వీర్యం చేశారో చెప్పడానికి..!జగన్ రెడ్డి పాలన ఎంత అరాచకంగా ఉందంటే... గిట్టుబాటు ధర లేక, ప్రకృతి విపత్తుల నిధి (రూ. 4 వేల కోట్లు) ఏర్పాటు చేయక, ధరల స్థిరీకరణ నిధి (రూ. 3 వేల కోట్లు)కు దిక్కులేక... రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు! ఐదేళ్లలో మానవ హక్కుల సంఘాల నివేదిక ప్రకారం 2,552 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో రైతు ఆత్మహత్యల సంఖ్యలో 3వ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానం దక్కించుకోవడం వైసీపీ పాలనలోని చీకటి అధ్యాయం! 2024 జూన్ లోపు ఆరు నెలల్లోనే 213 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చింది. మా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఖిఅన్నదాత సుఖీభవఖి పథకం ద్వారా రైతులకు నిజమైన భరోసా ఇచ్చాం. పెట్టుబడి సాయం కింద కేంద్రం రూ. 6,000 కు అదనంగా రాష్ట్రం సొంతంగా రూ. 14,000 కలిపి, మొత్తం రూ. 20,000 పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు.

## పైపులైన్ లీక్ మరమ్మతుల పనులు నిర్దేశించినగడువు కంటే ముందే పూర్తి చేయాలి
### : నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 20, ప్రభాతవార్త :** గుంటూరు నగరానికి తాగునీరు అందించే కార్పొరేషన్ కు చెందిన తక్కెళ్ళపాడు లోని హెడ్ వాటర్ వర్క్స్ పైపు లైను మరమ్మత్తుల పనులు నిర్దేశించిన గడువు కంటే ముందే పూర్తిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తక్కెలపాడు హెడ్ వాటర్ వర్క్స్ రిజర్వాయర్లో జరుగుతున్న పైప్ లైన్ లీకేజీ మరమ్మతు పనులను గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పైప్లైన్ లీకేజీ కారణంగా మరమ్మత్తుల నిమిత్తం చేపట్టిన పనులలో భాగంగా ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ఆయా రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రకటించడం జరిగింది అన్నారు. 22 సాయంత్రం పాక్షికంగా, 23వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు.



గురువారం తక్కెలపాడులో కార్పొరేషన్ హెడ్ వాటర్ వర్క్స్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు

సుమారు 90 శాతం నగరంలో తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని నగర ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. ఇక్కడ జరిగే పనులను ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, నిర్దేశించిన గడువు కంటే ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో భాగంగా కమిషనర్ తో పాటు ఈ ఈ కోటేశ్వరరావు, డిఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

**నూతనంగా నిర్మించే రోడ్లను డ్రైన్ టు డ్రెయిన్ నిర్వహించాలి**
గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులలో భాగంగా నూతనంగా నిర్మించే రోడ్లను డ్రైవ్ టు డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఎస్వీఎన్ కాలనీ, విద్యానగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3, వాసవి నగర్, ఏటుకూరు, జోనం చుండూరు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పనులు, ఆక్రమణలను తనిఖీ చేశారు. సంబంధిత విభాగ అధికారులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. పారిశుధ్య విభాగం కార్మికులు పనులు చేపట్టేందుకు వీలుగా ఉండేలా, రోడ్లపై నీరు నిల్వ లేకుండా ఉండేలా డ్రైనేజీలపై ఆక్రమణ తొలగించాలని, రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక వేస్ట్ మెటీరియల్ కాంట్రాక్టర్ల సొంత ఖర్చుతో తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించిన అధికారులు సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, స్మిత పద్మజ, డిఈలు రమేష్ బాబు, సతీష్ కుమార్, ఎస్ ఎస్ ప్రసాదు, ఆయా విభాగాలుకు చెందినఆయా విభాగాలుకు చెందిన అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయాలకు చెందిన సెక్రటరీలు పాల్గొన్నారు.

**హెవీ లోడర్ వాహనాల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేస్తాం**
గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో హెవీ లోడర్ వాహనాలు ప్రతిరోజు రాత్రి 10 గంటలు నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే నగరంలోకి రావడానికి అనుమతి ఉందని, నిబంధనలను ఆయా వాహన యజమానులు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాస్ హెచ్చరించారు. కార్పొరేషన్ లోని తన చాంబర్లో కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ట్రాన్స్ పోర్ట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులతో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. నిబంధనలో అతిక్రమించి భారీ వాహనాలతో నగరంలో రాకపోకలు సాగించడం వల్ల రహదారులు పాడవుతున్నాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అమలు జరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు.

## గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం

పెదకూరపాడు , నవంబర్ 20 ప్రభాతవార్త : గత వారం రోజులుగా శాఖ గ్రంథాలయ లో 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, పాటల పోటీలు, వకృత పోటీలు, వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలు, నిర్వహించారు. ప్రతిరోజు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు లైబ్రరీ యన్ మహమ్మద్ అలీ శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ నిర్ణీతలుగా జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రమణ పాల్గొని వారికి ఎన్నో సూచనలు సలహాలు అందించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు రమణ పెదకూరపాడు గ్రామ సర్పంచ్ రాజు పలువురు పెద్దలు పాల్గొన్నారు.



## ఎన్ ఐ బిసి ఆంధ్రా సెక్రటరీగా బిషప్ సత్య కిరణ్ బాధ్యతల స్వీకారం

సత్తెనపల్లిటౌన్ నవంబర్ 20 ప్రభాతవార్త :సత్తెనపల్లి పట్టణానికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్, ఖినేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ ఎన్ ఐ బిసి ఖి ఆంధ్రప్రదేశ్ శాఖకు కార్యదర్శిగా నియమితులయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.సంస్థ వ్యవస్థాపకులు మరియు జాతీయ ఛైర్మన్ అయిన ఆర్చ్ బిషప్ డాక్టర్ మార్టిన్ కాట్రగడ్డ, బిషప్ సత్య కిరణ్ కి నియామక పత్రాన్ని అందజేసి, బాధ్యతలు అప్పజెప్పారు. ఈ ముఖ్య కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన రాష్ట్ర ప్రెసిడెంట్లు , పలువురు పెద్దలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి వివిధ జిల్లాల నుండి 200 కు పైగా బిషప్‌లు , ఇతర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా, ఖినేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్‌ఖి ఛైర్మన్ డాక్టర్ మార్టిన్ కాట్రగడ్డకు బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్ తన కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సత్య కిరణ్ కి హాజరైన బిషప్‌లు మరియు ఇతర నేతలు అభినందనలు తెలిపారు.




## కోటి సంతకాల సేకరణ

ముప్పాళ్ళ, నవంబర్ 20కోటి సంతకాల సేకరణ, ప్రభాతవార్త: కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ళ మండలం ముప్పాళ్ళ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ..గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఇందూరు నరసింహారెడ్డి , మాజీ వైస్ ఎంపీపీ మారూరి రామలింగారెడ్డి , మాజీ మండల కన్వీనర్ రెండేద్దుల వెంకటేశ్వర రెడ్డి, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ షేక్ జానీ భాష, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చావా రమేష్ బాబు, జక్కరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి , కోటి రెడ్డి , తలకోల బాలిరెడ్డి , షేక్ ఖాసిం , తలకోల వెంకటప్ప రెడ్డి , లోకసాని గోవింద్ రెడ్డి , దేవి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ఆరమండ రాజశేఖర్ రెడ్డి, దొడ్డ జానకి నివాస రెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదు: ఎస్ఐ అనంతకృష్ణ

మాచర్ల, నవంబరు 20 ప్రభాతవార్త: జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదని మాచర్ల అర్బన్ ఎస్ఐ అనంతకృష్ణ అన్నారు. మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మాజీ సర్పంచ్ అల్లం రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు అల్లం కోటిరెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల బస్టాండ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ అనంతకృష్ణ పాల్గొని మాట్లాడారు. చదువుకున్న పాఠశాలను, పుట్టిన ఊరును, జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదన్నారు. ప్రతిఒక్కరూ పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఏఆర్ ఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవలు చేస్తున్న కోటిరెడ్డిని అభినందించారు. ఏఆర్ఆర్ ట్రస్టు ఛైర్మన్ అల్లం కోటిరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి రామిరెడ్డి పేరున పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు నోట్‌బుక్స్, పేద విద్యార్థులకు ఫీజులు, చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జోన్ ఛైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, లయన్స్ క్లబ్ ఫాస్ట్ అధ్యక్షులు అల్లం వెంకటేశ్వరరెడ్డి, చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## యువజనోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులకు నేడు బహుమతులు

మాచర్ల, నవంబరు 20 ప్రభాతవార్త: రోటరీక్లబ్ ఆఫ్ మాచర్ల ప్రతి సంవత్సరం నిర్వహించే రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, చెస్, క్విజ్, డాన్స్, వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం నరిశెట్టి కళ్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలోని మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాలకు చెందిన విద్యార్థులు సుమారు 350 మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులకు మొమెంటోలు, సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేసీపీ యూనిట్ 1 హెడ్ వి.వెంకటరమణ, ప్రత్యేక అతిథిగా మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఆత్మీయ అతిథిగా రోటరీ జిల్లా వార్డు కమిటీ ఛైర్మన్ డా॥ పంగులూరి విష్ణుబాబు పాల్గొంటారన్నారు. కావున పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కన్వీనరు ఇక్కుర్తి శంకర్, రోటరీ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, ట్రెజరర్ యనమల వెంకటరమయ్య, న్యూజనరేషన్ డైరెక్టర్ అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు.




## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే పశువుల యజమానులపై చర్యలు

మాచర్ల, నవంబరు 20 ప్రభాతవార్త: మాచర్ల పురపాలక సంఘ పరిధిలోని వీధుల్లో ముఖ్యకూడళ్లలో, మెయిన్ రోడ్లపై ఆవులు, వాటి పిల్లలు విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. ఆవుల యజమానులు ఆవులను, పశువులను ఇంటివద్దనే కట్టేయాలని కోరారు. ఆవుల సంచారంతో ట్రాఫిక్ అంతరాయంతోపాటు ప్రజలను గాయపరుస్తున్నాయని జనసంచారానికి ఆటంకంగా మారుతున్నాయని, యజమానులు వాటిని కట్టడి చేయకపోతే పురపాలక సంఘం వారు వాటిని బందెల దొడ్డికి తరలిస్తారని హెచ్చరించారు. ఈ నెల 24వ తేదీ కల్లా వాటిని కట్టడి చేయకపోతే, వాటి యజమానులకు రూ.5 వేలు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. జరిమానా చెల్లించలేకపోతే ఆవులను సుదూర ప్రాంతంలోని ఉన్న గోశాలకు తరలిస్తామని తెలిపారు.

## సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్: ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, నవంబరు 20 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, అధికారుల స్థాయిలోనే సమస్యలు పరిష్కారం కావాలని సూచించారు. ప్రజా దర్బార్‌కు 35 అర్జీలు ఎమ్మెల్యే జూలకంటి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ సమస్యలపై ప్రజలు 35 అర్జీలు అందించారు. వీటిల్లో దాదాపు ఎక్కువశాతం వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాలు, భూముల మాఫియా, స్థల వివాదాలు, కొత్త పింఛన్లు అందించాలని, ఇంటి ముందు బజారు ఆక్రమణ చేసుకుని బెదిరిస్తున్నారని వంటి పలు అంశాలపై కక్షిదారులు అర్జీల రూపంలో ఫిర్యాదులు అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి ఎడ్లపందేలకు బహుమతి

కారంపూడి, నవంబరు 20 ప్రభాతవార్త: పల్నాటి వీరారాధనోత్సవాల సందర్భంగా జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించడం ఆనందించదగ్గ విషయమని ఆటో అండ్ ఎంప్లాయిస్ ఫైనాన్స్ యూనియన్ అధ్యక్షులు బొగ్గవరపు శ్రీనివాసరావు అన్నారు. ఆరు పాలపళ్ల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన కేసానపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లకు రూ.40 వేలు, మొమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆటో అండ్ ఎంప్లాయిస్ ఫైనాన్స్ సభ్యులు ముచ్చర్ల రామకోటేశ్వరరావు, గణిత అమరయ్య, సూరె కోటేశ్వరరావు, సంధి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించండి: ఎమ్మెల్యే

నరసరావుపేట, నవంబర్ 20 ప్రభాతవార్త :ప్లాస్టిక్ కవర్ల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు విజ్ఞప్తి చేశారు.ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక ఆర్టీసి బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార సముదాయం, మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న షాపులలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వ్యాపారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్స్ వద్దు జూట్ కవర్స్ ముద్దు అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ఆయన కోరారు. ప్రతి షాపుకు వెళ్లి వ్యాపారుల చేతుల్లో జూట్ బ్యాగులు అందజేస్తూ, ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతఅని, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను అర్థం చేసుకుని, ప్రతి ఒక్కరూ జూట్, క్లాత్ బ్యాగులు వాడితేనే భవిష్యత్ తరాలకు మనం మంచి వారసత్వం అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, వార్డు అధికారులు, టీడీపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలీసుల చొరవతో అదృశ్యమైన బాలిక తల్లి చెంతకు

నరసరావుపేట క్రైమ్, నవంబర్ 20 ప్రభాతవార్త :: పోలీసుల చొరవతో తప్పిపోయిన బాలిక తల్లి చెంతకు చేరింది. గురువారం వివరాలను ఎస్ఐ లేఖ ప్రియాంక తెలియజేశారు.నరసరావుపేట పట్టణ రెండో పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు బావుల సెంటర్లోని వేల్పూరి మంగమ్మ, ధనబాబు కూతురు ఎస్తేరు ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికిన కనిపించకపోవడంతో వేల్పూరి మంగమ్మ 2 టౌన్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఎస్ఫై లేక ప్రియాంక, పోలీసు సిబ్బందితో కలిసి చుట్టుపక్క ప్రాంతాలలో వెతుకుతూ స్థానిక శిశు మందిర్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బిడ్డను తల్లి మంగమ్మకు అప్పజెప్పారు. తప్పిపోయిన చిన్నారిని వెతికి పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ లేఖా ప్రియాంక వారి సిబ్బందిని సీఐ ప్రభాకర్,డి.ఎస్.పి హనుమంతరావు అభినందించారు.



## ఇమామ్-మోజమ్‌లకు గౌరవ వేతనం పంపిణీ

నరసరావుపేట, నవంబర్ 20 ప్రభాతవార్త :: నియోజకవర్గంలోని ఇమామ్-మోజమ్‌ల గౌరవ వేతనల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా కొనసాగిస్తూ, ఇటీవల రూ.90 కోట్ల నిధులను విడుదల చేసిందని వారు తెలిపారు. ఈ మొత్తంలో 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బకాయిలు కూడా ఉన్నాయన్నారు.ఈ నిధుల ఆధారంగా నరసరావుపేట నియోజకవర్గంలోని 50 మంది ఇమామ్‌లు, మోజమ్‌లకు గౌరవ వేతనం నేరుగా ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. పార్టీ కార్యాలయంలో స్వయంగా ఇమామ్‌లకు నెలకు రూ.10,000 చొప్పున, మోజమ్‌లకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందించడం సంతోషంగా ఉందని డాక్టర్ అరవిందబాబు తెలిపారు. సి యం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం మైనారిటీ సోదరుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోందన్నా రు. గత ప్రభుత్వం వదిలేసిన బకాయిలను కూడా క్లియర్ చేస్తూ, ఈ పథకాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని, నరసరావుపేట నియోజకవర్గంలో అందరికీ ఈ పథకం అమలు అవుతుందని అన్నారు. ముస్లిం మైనార్టీలు భక్తి తో అల్లాను ఆరాధించడానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం మంచి ఆలోచనతో ఈ గౌరవ వేతన పథకాన్ని తీసుకొచ్చిందని అన్నారు. తల్లికి వందనం ద్వారా ముస్లిం మైనార్టీ పిల్లలకి చదువుకోటానికి ఆర్థిక చేయూత కల్పించామని, అలాగే నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించామని అన్నారు. టీడీపీ నాయకత్వంలో నరసరావుపేట నియోజకవర్గం మైనారిటీ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రంలోనే అగ్రభాగంలో నిలిచిందన్నా రు.ఈ కార్యక్రమానికి హాజరైన ఇమామ్‌లు, మోజమ్‌లు, మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ని సన్మానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపి కొనియాడారు. కూటమి ప్రభుత్వం చల్లగా ఉండాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



## జిల్లాలో లెప్రసి, ఎయిడ్స్, టిబి నియంత్రణ పై సమీక్ష

రొంపిచర్ల, నవంబర్ 20 ప్రభాతవార్త ::జిల్లాలో లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి నియంత్రణ కోసం ఉద్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి అని డాక్టర్ బి. రవి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లోనీ లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి సిబ్బందితో అక్టోబర్ మాసపు నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలోని లెప్రసి విభాగం ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 17 30 వరకు జరగనుందన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించాలని, తద్వారా గుర్తించిన కేసులకు వైద్యం అందించాలని చెప్పడం జరిగింది. జిల్లా ఎయిడ్స్ నివారణకు సంబంధించి గుర్తించిన, నిర్ధారణ చేసిన హెచ్ఐవి కేసులు అన్ని కూడా ఏఆర్టి కేంద్రాల ద్వారా మందులు వాడేటట్లు పర్యవేక్షి ంచాలన్నారు. సకాలంలో వారికి వైరల్ లోడ్ పరీక్షలు పెండింగ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఏఆర్టి మరియు లింక్ ఎఆర్టి కేంద్రాలలో వైరల్ లోడ్ పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. ప్రతి హెచ్ఐవి పాజిటివ్ గర్భిణికి కి 3226 వారాలలో కచ్చితంగా వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించాలని, వారికి వైరల్ లోడ్ పరీక్ష బట్టి నెవరపిన్ లేదా జుడోవిడోన్ సిరప్ అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి గర్భిణికి హెచ్ఐవి పరీక్ష చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ మాధవిలత, డిఎన్ఎమ్వో డాక్టర్ మురళి కృష్ణ, జిల్లాలోని లెప్రసి, ఎయిడ్స్, టిబి సిబ్బంది పాల్గొన్నారు.


## తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక చేయూత

నరసరావుపేట, నవంబర్ 20 ప్రభాతవార్త :: పట్టణంలోని కంభంపాలెం కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాపనపల్లి నాగ సురేంద్ర ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు అందజేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం శాసనసభ్యులు మరణించిన నాగ సురేంద్ర కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ ప్రమాద భీమా పథకం కింద రూ.5 లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబంలో ఒకరు కన్నుమూస్తే అది మన అందరి నష్టమే. పార్టీ సభ్యత్వం ఉన్న కుటుంబాలకు ఎల్లవేళలా పార్టీ అండగా నిలుస్తుంది. ఈ దుఃఖ సమయంలో కుటుంబం ఒంటరిగా ఉండదు" అని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ పై అవగాహన సదస్సు

నరసరావుపేట క్రైమ్,నవంబర్ 20 ప్రభాతవార్త : నరసరావుపేట ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్ లో గురువారం పట్టణ ట్రాఫిక్ సిఐ లోకనాథం ట్రాఫిక్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. నరసరావుపేట టౌన్ లో గల ట్రాఫిక్ పాయింట్స్, బస్ లు ఎక్కడ ఆపాలి, ఆపే




సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి. శ్రీనివాసరావు, 30 మంది డ్రైవర్స్ పాల్గొన్నారు.

## బుచ్చి పాపన్నపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం

రొంపిచర్ల, నవంబర్ 20 ప్రభాతవార్త :::మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నరసరావుపేట పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పి. రామారావు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పై గడ్డి జొన్నలు, లింగ నిర్ధారణ వీర్యం పంపిణీ చేస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 48 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స,12 పశువులకు గర్భనిర్ధారణ, 8 పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 150 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టుకు వాగ్దేవి విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబర్ 20 ప్రభాతవార్త ::ఈనెల 14,15 తేదీలలో అండర్ 19 స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ మీట్ లో స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి షేక్. మొహమ్మద్ నిసార్ అత్యంత ప్రతిభ చూపారు. తమ కళాశాల విద్యార్థి ఆంధ్ర జట్టుకు ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఓగురి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. 2026 జనవరి 10 15 తేదీలలో జరిగే జాతీయస్థాయి మీట్ కు మొహమ్మద్ ఆంధ్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తాడని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా మహమ్మద్ నిసార్ ను రాయల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పివి. అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు



## విద్యార్థులకు బహుమతి ప్రధానం

నరసరావుపేట, నవంబర్ 20 ప్రభాతవార్త ::58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఉప్పలపాడు శాఖా గ్రంధాలయంలో ఈనెల 14 20 వరకు వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి గురువారం బహుమతి ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. నాగేశ్వరరావు, గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శనివారపు సుబ్బారెడ్డి, నంద్యాల కోటిరెడ్డి, జడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డిలు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని గ్రంధాలయమునకు కేటాయించి మీకు నచ్చిన పుస్తకం చదవాలని, ప్రతిరోజూ దిన పత్రికలు చదవడం వలన జ్ఞానం పెంచుకోవాలని తద్వారా పలు విషయాలుపై అవగాహనా కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంధాలయ నిర్వాహకుడు కె. వెంకట్రావు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రంథాలయం అంటే పుస్తక దేవాలయం

సత్తెనపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త: గ్రంథాలయం అంటే పుస్తక దేవాలయం అని విజ్ఞానసముపార్జనకు సోపానములని మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు. రాఘవేంద్ర రావులు పేర్కొన్నారు గురువారం పట్టణంలోని వైయస్సార్ శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పాఠశాలలో పాఠ్యాంశాలతో పాటు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను చదవటం కూడా విద్యార్థి స్థాయి నుంచి అలవ ర్చుకోవాలని విద్యార్థులకు వారు సూచించారు.వారోత్సవాల లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ క్విజ్, పోటీలు ,ఆటల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు.గ్రంథాలయాధికారి రమేష్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల విజయవంతానికి కృషి చేసిన అధికారులకు, ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు ,పాల్గొన్న విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచికంటి వెంకటేస్వర్లు, ఉమా మహేశ్వరరావు , విశ్రాంత గ్రంథాలయు అధికారి కె వాణి, అన్ని పాఠశాల ల నుండి విద్యారులు ఉపాధ్యాయులు, సిబ్బంది రజని పాల్గొన్నారు.



## అండర్-14 బేస్‌బాల్ స్టేట్ టీమ్‌కు విద్యార్థి ముఖేష్ ఎంపిక

క్రోసూరు, నవంబర్ 20 ప్రభాతవార్త: జడ్పీహెచ్ఎస్ కొర్రపాడు హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్.ఐ అండర్-14 బేస్‌బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెలక్షన్లలో క్రోసూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ముఖేష్ స్టేట్ టీమ్‌కు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం దుగ్గి బాబురావు, పీడీ ఎం. నరసింహారావు ఆయనకు అభినందనలు తెలిపారు.ఇవే కాకుండా ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జరిగే 69వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీలలో ముఖేష్ పాల్గొననున్నాడని హెచ్ఎం దుగ్గి బాబురావు తెలిపారు.



## విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి



క్రోసూరు, నవంబర్ 20, ప్రభాతవార్త: అనంతవరం గ్రామంలో విద్యుత్ తీగల తగిలి స్థానిక ఉసిరికాయల ముసలయ్య మృతి చెందాలని వారి బంధువులు తెలిపారు. తమ కొత్త ఇంటి ఎదురుగా త్రీఫేస్ కరెంటు తీగలు వినబడుతున్నాయని పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బందికి వారు తెలిపారని ఆయన అధికారులు నిరక్ష ్యంల నేడు ముసలయ్య ప్రాణం బలిగొందని వారి బంధువులు రోదించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా విద్యుత్ శాఖ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని బంధువులు కోరారు.

## దొడ్లేరు గోల్డ్ బాధితులకు నష్టపరిహారం అందించిన బ్యాంక్ అధికారులు..

క్రోసూరు, నవంబర్ 20 ప్రభాతవార్త: దొడ్లేరు గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో 2023 ఆగస్టులో గోల్డ్ అప్రైజర్ నాగార్జున చేతివాటం కారణంగా మొత్తం 505 మంది గోల్డ్ బాధితులు నష్టపోయారు.బ్యాంక్ అధికారులు బాధితులకు నష్టపరిహారం అందించారు..గతంలో 401 మంది బాధితులకు గ్రాముకు 6,700 చొప్పున 2 కోట్లు 50 లక్షలు రూపాయలు పంపిణీ చేశామని వారుతెలిపారు.నవంబర్ 20వ తారీఖున మిగతా 104 మంది బాధితులకు కోటి రూపాయలు ఇవ్వటం జరిగిందని దొడ్లేరు బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో నష్టపరిహారం పంపిణీ చేశారు. మొత్తం 505 మంది బాధితులకు గాను 3 కోట్ల 50 లక్షలు రూపాయలు పంపిణీ చేశామని వారు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.సుభాష్ మాట్లాడుతూ,బాధితులందరికీ న్యాయం చేశామని, ఏ ఒక్క ఖాతాదారుడు కూడా నష్టపోకుండా చూశామని తెలిపారు. ఈ ప్రక్రియలో సహకరించిన పోలీసులకు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ పి.రవిబాబు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు

సత్తెనపల్లి క్రైమ్ , నవంబర్ 20. ప్రభాత వార్త: పట్టణంలో వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయని దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని టౌన్ సిఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు భారీ గేట్లు ఏర్పాటు చేశారు. జెకె సిమెంట్ వారి సహకారంతో గజ్జల హాస్పిటల్ వరకు ట్రాఫిక్ ని అంతరించి ఎందుకు వేగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక భారీగార్లను అమర్చారు. అచ్చంపేట రోడ్లో బైక్ పై జారిపడి ప్రమాదానికి గురైపోయిన మహిళ అక్కడక్కడే మృతి సిఐ తక్షణమే స్పందించారని స్థానిక ప్రజలు అన్నారు. టౌన్ లోకి ఎంటర్ అయిన వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని సిఐ సూచించారు. ట్రాఫిక్ కారణమైన ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డుకి ఇరువైపులా ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఏర్పడిన సహించేది లేదన్నారు



## వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన.

పెదకూరపాడు, నవంబర్ 20 ప్రభాతవార్త. వీఆర్ఏలకు పేస్కేలు జీతాలు, ప్రమోషన్లు,నామిని సమస్య పరిష్కారం చేయకపోతే ఉద్యమిస్తాంమని వీఆర్ ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ అన్నారు.తిశిగ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం,59/86, సిఐటియు) పెదకూర పాడులో మండల గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తహసిల్దార్ ధనలక్ష్మికి వినతి పత్రం అందించారు.



## పారదర్శకంగా పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం



పొన్నూరు, నవంబరు 20,ప్రభాతవార్త: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వచ్చే అర్జీలను పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ నోడల్ ఆఫీస్ కంభంపాటి శ్రీనివాస్ చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలకు సంబంధించిన రికార్డులను గురువారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించేందుకు తనను నియమించినట్లు చెప్పారు. ప్రతి సోమవారం ఎన్ని అర్జీలు వస్తున్నాయి..? వాటిలో ఎన్ని పరిష్కారం అవుతున్నాయి...?పెండింగ్‌లో ఉన్నటువంటివి ఎందుకు పెడింగ్‌లో ఉన్నాయన్న విషయాలను తెలుసుకొని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో కూడా పరిశీలిస్తానన్నారు. ప్రతి సోమవారం వచ్చే అర్జీల్లో ఎక్కువ శాతం భూమికి సంబంధించిన, సర్వేకి సంబంధించిన అర్జీలు వస్తున్నాయన్నారు. వీటిని వేగవంతంగా పరిష్కరించాలన్నదే ప్రభుత్వం యొక్క ఆలోచన అని చెప్పారు. కూటమి ప్రభుత్వం భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. నియోజకవర్గంలో మూడు మండలాల్లో వచ్చిన అర్జీలను ఆయా మండలస్థాయి అధికారులు సకాలంలోనే పరిష్కరిస్తున్నారన్నారు. ఇంకేమైనా పెండింగ్‌లో ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకెళ్తే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కూడా చర్యలు తీసుకొంటామన్నారు. కొన్ని గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని, అవసరమైతే రీ సర్వే జరిగే ప్రాంతానికి వెళ్ళి కూడా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా సచివాలయాల పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి సచివాయాలను కూడా సందర్శిస్తానన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళడంతోపాటు బాధితులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

## భక్తిశ్రద్ధలతో భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి వేడుకలు

పొన్నూరు, నవంబరు 20,ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవము భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తమ జీవితాలను సార్థకం చేసుకున్నారని శ్రీ భగవాన్ సత్యసాయి మందిరం నిర్వాహకులు బొందలపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సత్యసాయి బాబా మందిరంలో గురువారం శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సత్యసాయిబాబాను భారతీయ ఆధ్యాత్మిక వేత్త, కలియుగ ప్రత్యేక్ష దైవం అని చాలా మంది భక్తులు విశ్వసిస్తారన్నారు. సత్యసాయిబాబా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రపంచ వాప్తంగా జరిగేవిధంగా ప్రణాళికను రూపొందించారన్నారు. ఇప్పటికీ సత్యసాయిబాబా సేవా కార్యక్రమాలు నిరాఘాటంగా జరుగుతున్నాయన్నారు. సత్యసాయిబాబా మార్గం ప్రతిఒక్కరికీ ఆచరణీయం, అనుసరణీయమన్నారు. సత్యసాయి ఎన్నో మహిమల ద్వారా ఎంతో మంది భక్తులను ప్రభావితం చేయగలిగారన్నారు. అందరినీ ప్రేమించు, అందరికీ సేవ చేయి, ఎప్పుడూ సహాయం చేయి, ఎప్పుడూ బాధించకు అనే ఆయన సూచించిన సూక్తులు భక్తులను ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. సత్యసాబాబా జయంతి సందర్భంగా పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందిరంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున నారాయణులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మందిరం కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



పొన్నూరు, నవంబరు 20,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్, ఇతర దేశాల్లో ఉన్న క్రైస్తవుల సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చూస్తామని ఏపి రాష్ట్ర క్రైస్తవ నాయకుడు ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని క్రైస్తవ సమాజం యొక్క సమస్యలను స్థానిక నాయకుల ద్వారా సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.గత వైకాపా పాలన కంటే ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రైస్తవ సమాజం పట్ల చక్కగా స్పందిస్తున్నారన్నారు. ఇతర దేశాల్లో ఉద్యోగాల నిమిత్తం వెళ్ళి అక్కడ ఉంటున్నారన్నారు. వారికి ఏదైనా సమస్య తలెత్తితే, చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీలుగా, రాష్ట్రంలో వున్న క్రైస్తవ నాయకత్వంతోపాటు, ప్రతి దేశంలోనూ ఒక క్రైస్తవ కోఆర్డినేటర్‌ను పెడుతున్నట్లు చెప్పారు. క్రైస్తవులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెల్ నెం:7075482182కు సంప్రదించవచ్చన్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



పొన్నూరు, నవంబరు 20,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణకు శ్రీకారం చుట్టిందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తుందన్నారు. రైతు సేవ కేంద్రాల ద్వారా కనీస మద్ధ ధర సాధారణ రకం 100కిలోల బస్తా రూ.2,369, 75కిలోల బస్తా రూ.1,777, గ్రేడ్ ఏ రకం వంద కిలోల బస్తా రూ.2,389, 75కిలోల బస్తా రూ.1,792 నాణ్యతా ప్రమాణాలతో రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పనిచేయడం జరుగుతుందన్నారు. రైతులు కనీస మద్దతు ధర కన్నా తక్కువకు విక్రయించుకోవద్దని కోరారు. దళారులకు విక్రయించి రైతులు నష్టపోవడం, మోసపోవడం వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. రైతులు విక్రయించుకున్న ధాన్యానికి 24గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నదే ప్రభుత్వం యొక్క ఉద్దేశమన్నారు. పొన్నూరు మండలంలో పంట నమోదులో 32,571ఎకరాలు నమోదైనట్లు చెప్పారు. వీటి ద్వారా ఈ ఏడాది 7,32,852క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకారాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని తహశీల్దార్ కోరారు.

## 23న పర్యావరణంపై అవగాహన సదస్సు

రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త:విజయవాడ శ్రీ సరస్వతి విద్యాపీఠం,విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ సప్తశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రేపల్లె పట్టణంలోని శ్రీ రామకృష్ణ విద్యానిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని గురువారం నిర్వాహకులు తెలిపారు.భారతదేశ ఉన్నతిలో మహిళల పాత్ర,కుటుంబ ప్రబోధన,పర్యావరణంపై భారతీయ దృష్టి తదితర అంశాలపై విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకురాలు డి.నాగరాజకుమారి,సామాజిక సేవకురాలు కె.హరిక ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు,మాతాజీలు,విద్యార్థులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి



రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎపిజెఎసి బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు కె.రోశయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి,డి.ఎ,ఐఆర్,ఎపిజిఎల్ఐఎస్,రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## విజేతలకు బహుమతులు



రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త:విద్యార్థులు నిరంతరం గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.వి.సుబ్బారావు అన్నారు.గురువారం మండలంలోని నల్లూరుపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిసాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రంథాలయ శాఖ అధికారులు ఉపకార వేతనాలు ప్రవేశపెట్టడం శుభపరిణామమన్నారు. ఈ సంవత్సరం ఎక్కువ రోజులు గ్రంథాలయానికి వచ్చిన మనోజ్‌ను ఆయన అభినందించారు.చదవటం మాకిష్టం అనే కార్యక్రమంలో భాగంగా ఎక్కువ రోజులు గ్రంథాలయానికి వచ్చిన జి.అవంతిక,బి.సంజన,జి.అమృత,ఎన్.శరణ్య,జి.స్వరూపరాణిలకు ఉపకార వేతనాలను అందజేశారు.చిత్రలేఖనం,వ్యాసరచన,క్యారమ్స్,రంగవల్లుల,నైపుణ్యతా ప్రసంగ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

## వైభవంగా గోపూజ



రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త:విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీకమాసం చివరి రోజైన గురువారం కోటి కుంకుమార్చన, పూజలు, గోపూజ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. రేపల్లె,పేటేరు,పెద్ద అరవపల్లి, భట్టిప్రోలు,అద్దేపల్లి తదితర గ్రామాలలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విశ్వహిందూ పరిషత్ ధర్మరక్షా ప్రసార విభాగం కమిటీ సభ్యులు సిహెచ్.కిషోర్‌బాబు,పినపాల సత్యసాయి,ఎల్.కుటుంబరావు,ధర్మరక్షా ప్రసార కార్యకర్తలు జి.దుర్గా ప్రసన్న, కె.శివనాగేశ్వరి, డి.మాధవి,డి.చంద్రమ్మ, వి.శివనాంచారయ్య, రత్నకుమారి,లోయ రమాదేవి,వి.శ్రీలక్ష్మి,పూర్ణకుమారి, నాగప్రియాంక, కృష్ణవేణి పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## సృజనాత్మక శక్తిని పెంచేది గ్రంధాలయాలు

కొల్లిపర,నవంబర్ 20 ప్రభాతవార్త: విద్యార్థులలో సృజనాత్మక శక్తిని,మేదస్సును పెంపొదించేందుకు గ్రంధాలయాలు దోహదపడతాయని మాజీ సర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని తూములూరు,వల్లభాపురం,మున్నంగి శాఖా గ్రంధాలయాలలో 58 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు జరిగాయి.దీనిలో భాగంగా తూములూరు లైబ్రరీలో లైబ్రరియన్ సత్యమ్మ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రంధాలయాలు ఆధునిక దేవాలయాలుగా బాసిల్లుతున్నాయని చెప్పారు.వల్లభాపురం లైబ్రరియన్ నాగసాంబశివనాయక్ మాట్లాడుతూ గ్రంధ పఠనం ద్వారా పేద విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొదించుకుంటే పోటీ పరీక్షలలో విజేతలుగా నిలుస్తారన్నారు.మున్నంగి లైబ్రరియన్ జ్యోతి మాట్లాడుతూ గ్రంధాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొదించుకోవచ్చని చెప్పారు.అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిధులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో విద్యార్థులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## నిత్యావసర సరుకులు పంపిణీ



కొల్లిపర, నవంబరు 20 (ప్రభాతవార్త) : మండలంలోని అత్తలూరి వారిపాలెం గ్రామంలో తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలకు అంతరాజతీయ రక్షణ సైన్యం ఎమర్జెన్సీ డిజాస్టర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ నాయకులు కమీషనర్ దాసరి డేనియల్ రాజు ఆధ్వర్యంలో తుఫాను బాధిత కుటుంబాలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లెప్టినెంట్ కర్నూల్ గేదా, ధామస్ బృందము మరియు చెన్నైకు చెందిన మేజర్ ప్రభాత్‌కుమార్, కెప్టెన్ రమేష్ జీవన్‌రాయి, మేజర్ రవి, మోజేస్, హెల్పర్ దొప్పలపూడి జ్యోతిబాబు, హెల్పర్ ప్రతిభ, మేనేజర్ కోటయ్య సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

వేమూరు నవంబరు 20 (ప్రభాతవార్త) : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు సూచించారు.58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాల్లో విద్యార్థులకు అవసరమైనటువంటి అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత సాధించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో చావలి గ్రామ సర్పంచ్ విష్ణు మొలకల శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి నవరాణి, గ్రంధాలయ అధికారి కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రేపల్లెకు మరిన్ని రైళ్ళు కావాలి

రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త: గుంటూరు,విజయవాడ రైల్వే డివిజన్ల అధికారులు దృష్టి కేంద్రీకరిస్తే రేపల్లెకు రైళ్ళ పొడిగింపు సాధ్యపడుతుందని ప్రయాణీకులు అభిప్రాయ పడుతున్నారు.పులిగడ్డ-పెనుమూడి వారధి మార్గం కారణంగా కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం నుంచి రేపల్లెకు గంట వ్యవధిలోనే చేరుకునే అవకాశం ఏర్పడటంతో ఆ ప్రాంత ప్రయాణీకులు రేపల్లె రైల్వే స్టేషన్‌పై ఆధారపడుతున్నారు.గుంటూరు నుంచి రాత్రి 11.20 గంటలకు రాయగడకు(17243,17244)బయల్దేరే ఎక్స్‌ప్రెస్‌ను రేపల్లె రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరేలా చర్యలు తీసుకుంటే విశాఖపట్నం, విజయనగరం,శ్రీకాకుళం వంటి నగరాలకు ప్రయాణ సౌకర్యం ఏర్పడుతుందని కృష్ణానదీ తీరప్రాంత ప్రయాణీకులు కోరుతున్నారు.627 కిమీ దూరం ప్రయాణించే రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.అదేవిధంగా గుంటూరు నుంచి వికారాబాద్ జంక్షన్ వరకు నడిచే పల్నాడు(12747,12748) ఎక్స్‌ప్రెస్‌ను,తిరుపతి(17261,17262) ఎక్స్‌ప్రెస్ రైలును రేపల్లె నుంచి నడపాలని, ప్రతి రోజూ ఉదయం 7.10 గంటలకు రేపల్లెలో బయల్దేరే సికింద్రాబాద్(17646) ఎక్స్‌ప్రెస్‌ను ఫాస్ట్ ప్యాసింజరు రైలుగా మార్పు చేసి అన్ని రైల్వే స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు.రేపల్లెలో ఉదయం 9.35 గంటలకు గుంటూరు రైలు వెళ్ళిపోతే సాయంత్రం 6గంటల వరకు గుంటూరు వెళ్ళేందుకు రైలు లేదు.గతంలో విజయవాడ-తెనాలి-గుంటూరు మధ్య సర్క్యులర్ రైళ్ళు తిరిగేవి. తెనాలి వరకు వెళ్ళి ఆ రైళ్ళలో గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు ప్రయాణించేవారు.సర్క్యులర్ రైళ్ళు రద్దు చేయటంతో ప్రయాణీకులకు అసౌకర్యం ఏర్పడింది.మార్కాపురం రోడ్-తెనాలి రైలును రేపల్లె వరకు పొడిగించి తిరిగి గుంటూరుకు, విజయవాడ-తెనాలి ప్యాసింజరు రైలును రేపల్లె వరకు పొడిగించి విజయవాడకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గుంటూరులో ఉదయం 11.20 గంటలకు బయల్దేరే ప్యాసింజరు రైలు రేపల్లెకు చేరాక మధ్యాహ్నం1.10 గంటలకు తిరిగి గుంటూరుకు వెళ్ళి మరలా రేపల్లెకు చేరుకుని సాయంత్రం 6 గంటలకు గుంటూరుకు బయల్దేరి వెళ్ళేలా మార్పులు చేస్తే ప్రయాణీకులకు ప్రయోజనం చేకూరుతుంది.బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్ళాలంటే నేరుగా రైలు సౌకర్యం లేనందున రేపల్లె-ఒంగోలు మధ్య ప్యాసింజరు రైలును ప్రవేశపెట్టాలని తీర ప్రాంత ప్రయాణీకులు కోరుతున్నారు.ప్రయాణంలో మురికిగా అపరిశుభ్రంగా మారిన బోగీల కోసం కోచ్ వాషింగ్ ప్లాంటు ఏర్పాటు చేస్తే బోగీల పరిశుభ్రత ఏర్పడుతుంది.ఆటోమేటిక్ వ్యవస్థను రేపల్లెలో ఏర్పాటు చేస్తే సరిపోతుంది.రైలును ఆటోమేటెడ్‌రైల్వే కోచ్ వాషింగ్ ప్లాంట్‌లోకి తీసుకువెళితే రైలు పట్టాలకు పక్కనే అమర్చిన పొడవాటి స్క్రబ్బర్లు బోగీలను శుభ్రం చేస్తాయి.రైళ్ళ కింద భాగాలను పరిశీలించడానికి మరమ్మతులు చేయడానికి అవసరమైన పిట్ సౌకర్యం రేపల్లెలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.రైల్వే ప్రయాణీకులు ఎదురొ్కంటున్న సమస్యలను పరిష్కరించాలని రైళ్ళ సంఖ్యను పెంచాలని రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహనరావు గురువారం గుంటూరు రైల్వే డివిజన్ అధికారికి వినతిపత్రం పంపారు.తెనాలి-రేపల్లె రైలు మార్గంలో ప్రతి గంటకు ఇఎంయు రైలు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు.20701,20702 నెంబర్లతో నడిచే సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందే భారత్ రైలును బాపట్లలో ఆపాలని ఆయన కోరారు.రేపల్లె-తెనాలి మధ్య 2వ లైను ఏర్పాటు చేయాలని,మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.నరసాపురం నుంచి ఎన్నెన్నో రైలు సర్వీసులను ప్రారంభిస్తున్న రైల్వేశాఖ రేపల్లె తీరప్రాంతం నుంచి రైళ్ళ సంఖ్యను పెంచటంలేదని మోహనరావు ఆందోళన వ్యక్తంచేశారు.



## ధర్మరక్షణకు పాటుపడాలి

రేపల్లె,నవంబరు 20,ప్రభాతవార్త:ప్రపంచంలోని సమస్త ధర్మాల్లోనూ హిందూ ధర్మం శ్రేష్టమైనదని జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు.భట్టిప్రోలు మండలంలోని ఐలవరం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం ధర్మదీక్షా దినోత్సవం ముగింపు కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులలో కుల బేధాలు లేకుండా ఐక్యత సాధిస్తూ హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడాలన్నారు. అన్య మతస్తుల కుట్రతో లక్ష్మణస్వామి హతమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్మణస్వామి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు,సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ సిహెచ్.మురళీకృష్ణ,మండల సహకార కన్వీనర్ వి.కోటేశ్వరరావు,ఆర్.సత్య మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వానికి ధాన్యం అమ్మండి...

### ఆరు గంటల లోపు నగదు పొందండి

### ---రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, నవంబరు 20 (ప్రభాతవార్త) : విత్తనం నుండి విక్రయం దాకా రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని డిసెంబర్ 31 టార్గెట్‌గా పెట్టుకున్నామని ప్రభుత్వానికి ధాన్యం విక్రయించాలని రాష్ట్ర పౌరసరఫరాల, మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం దావులూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల



మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. అనంతరం దావులూరులో వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహించిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గతంలో కొల్లిపర మండలంలోని స్థానికంగా ఉన్న వ్యాపారులకు దాన్యం విక్రయించడం జరిగేదని, కూటమి ప్రభుత్వం రైతులు పడుతున్న కష్టాలను గుర్తించిందన్నారు. దానిలో మార్పు తేవడానికి అనేక సంస్కరణలు తెచ్చామన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1674కోట్లను



ఆర్ధిక ఇబ్బందులు ఉన్నప్పటికి చెల్లింపు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ పండే సన్నరకం బియ్యం 41వేల పాఠశాలల మధ్యాహ్న భోజన పథకానికి అందిస్తున్నామని, 25కిలోల రైస్ బ్యాగ్‌ను క్యూఆర్ క్యాడ్‌తో అందిస్తున్నామన్నారు. గత సంవత్సరం 40మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని, ఈ సంవత్సరం 51మెట్రిక్ కన్నుల కొనుగోలుకు నిర్ణయించామని పేర్కొన్నారు. రైతు ధాన్యం ఏ మిల్లరుకు విక్రయించుకోవచ్చునన్నారు. జిల్లాలో 209రైతు సేవా కేంద్రాలు, 49క్లస్టర్లు ఉన్నాయని, అన్నింటిలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. 6కోట్ల54లక్షల గోతాలు ధాన్యం సేకరణకు సిద్ధం చేయడం జరిగిందన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం 48గంటల్లో రైతు ఖాతాలో నిధులు జమ అయ్యాయని, ఇప్పుడు ధాన్యం అందించిన ఆరు గంటల్లోనే నిధులు జమ అయ్యేవిధంగా చూస్తామన్నారు. దళారులకు 75కిలోలల బస్తా రూ.1400నుండి రూ.1430వరకు విక్రయిస్తున్నారని, ప్రభుత్వం సాధారణ రకం క్వింటా రూ.2369, 75కిలోలు రూ.1777లు, గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2329, 75కిలోల బస్తా రూ.1792లు కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టాన్నికి అమ్ముకోకుండా ప్రభుత్వానికి విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో అదనంగా ఆదాయం పొందాలంటే మనం కూడా మన అలవాట్లు మార్చుకుని ఉద్యాన వన పంటలు వేయడానికి పరిశీలించాలన్నారు. వాతావరణం మారుతున్నందున టార్పాలిన్ పట్టాలను రైతులకు ఉచితంగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రతి రైతు సేవా కేంద్రంలో 25టార్పాలిన్ పట్టాలను మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో టెక్నాలజీని ఎక్కువ ఉపయోగించాలని, డ్రోన్లు వాడాలని, యూరియాను ఎక్కువగా వాడవద్దని కొల్లిపర మండలంలో పండించిన ధాన్యం ప్రభుత్వానికి విక్రయించాలని కోరారు. కొల్లిపర మండలంలో 14వేల ఎకరాలు వరిసాగు అవుతుందని, ప్రతి బస్తా, ప్రతి గింజ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సహాయం చేస్తుందని, తేమ 17శాతం ఉండేలాగా చూసుకోవాలన్నారు. 27, 28తేదీల్లో అల్పపీడనం ఉన్నదని, వాతావరణ శాఖ హెచ్చరిక చేసిందని, కోతలకు సిద్ధపడిన వారు రెండు రోజుల్లో కోతలు కోయాలన్నారు. ధాన్యం సేకరణకు 16వేల మందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని, 32వేల లారీలు ట్రాక్టర్లకు జిపిఎస్‌తో సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ గత సంవత్సరం ఏర్పడిన సమస్యలను అధిగమిస్తూ నూరు శాతం ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రైతుల వద్ద సంతృప్తికర స్థాయిలో ధాన్యం సేకరణ చేయడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ తులసీ, జిడిసిఎంఎస్ హరిగోపాల్, బిఎస్‌ఓ కోమలి పద్మ, ఎఎస్‌ఓ మనోహర్, ఎడిఎ విజయబాబు, తహశీల్దార్ సిద్దార్థ, ఇన్‌చార్జి ఎంపిడివో భార్గవ్, దావులూరి సర్పంచ్ అంబటి సంధ్యాదేవి, ఎంపిటిసి బోసుబాబు, తెనాలి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తోటకూర వెంకట రమణరావు, జనసేన నాయకులు అడపా నారాయణరెడ్డి, దివ్వెల వెంకయ్యానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కార్మికులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

కొల్లిపర, నవంబరు 20 (ప్రభాతవార్త) : రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవ స్పూర్తితో కార్మికులు ఐక్యంగా తమ సమస్యలు పరిష్కరించుకోవటానికి ముందుకు రావాలని సిఐటియు జిల్లా నాయకులు ఎన్.భావన్నారాయణ కోరారు. గురువారం కొల్లిపర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సిఐటియు మండల మహాసభలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి ఎం.జయప్రద అధ్యక్షత వహించారు. డిసెంబర్ చివరిలో విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలో కార్మికవర్గ ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కొవటానికి పోరాట రూపాలను రూపొందిస్తారని, ఆ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా సాంబిరెడ్డి మాట్లాడుతూ కార్మికులు వివిధ రంగాలలో కమిటీలు ఏర్పాటు చేసుకుని ఐక్యంగా పని చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో కోటా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం.జయప్రద, కో కన్వీనర్‌గా మల్లోల రమేష్, మరో 9మందితో కన్వీనింగ్ కమిటీ ఎన్నికయింది.




## వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్ధులకు బహుమతులు అందజేత



కొల్లూరు, నవంబరు 20 (ప్రభాతవార్త) : అనంతవరం శాఖా గ్రంధాలయంలో గురువారం 14వ తేది నుండి 20వ తేది వరకు జరిగిన 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్ధులకు బహుమతి బహుమతులను అనంతవరం శాఖ గ్రంధాలయ శాఖ అధికారి జి.కనకదుర్గ, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు టి.షీభారాణి, పంచాయితీ కార్యదర్శి బద్దిగం ఉమామహేశ్వరరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.విజయ, గ్రంధాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బలిజేపల్లి నాగేశ్వరరావు, జాలాది అశ్వనీకుమార్‌లు పాల్గొని బహుమతులను అందజేశారు.

## కొల్లూరు గ్రంధాలయంలో ముగింపు వారోత్సవాలు

కొల్లూరు, నవంబరు 20 (ప్రభాతవార్త) : గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం గ్రంధాలయ అధికారి వై.రాంబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడమైనది. ఈ వేడుకలకు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు మరియు ఉప సర్పంచ్ దూళిపూడి గోపాలకృష్ణమూర్తి, ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వారోత్సవాల ముగింపు సభలో మురాల రాంబాబు మాట్లాడుతూ చిన్నారులు తమ పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంధాలయాలలోని పుస్తకాలను చదవడం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరగడంతో పాటు పోటీ పరీక్షలలో రాణించడం సులభతరం అవుతుందని, విజ్ఞానం కోసం విద్యార్ధులకు గ్రంధాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రంధాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిరోజు విద్యార్ధులు గ్రంధాలయానికి వచ్చి దినపత్రికలు చదవాలని తద్వారా జ్ఞానసముపార్జున చేయాలని గ్రంధాలయ సభ్యత్వం తీసుకుని పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్ళి చదివి జ్ఞానం పెంపొందించుకోవాలని అన్నారు. గోపాలకృష్ణమూర్తి ఈ.నఖిత, వి.ప్రణవి, బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, చైతన్య స్కూల్ ఉపాధ్యాయులు గ్రంధాలయ పాఠకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం గ్రంధాలయ అధికారి యేమినేని రాంబాబు, గ్రంధాలయ వారోత్సవాలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



## మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే పరీక్షా కేంద్రం రద్దు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నవంబరు20, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో జరుగుతున్న పీజీ, బియిడి పరీక్షలలో ఏ కళాశాలలో అయినా మాస్ కాపీయింగ్ జరిగితే ఆ పరిక్షా కేంద్రం రద్దు చేస్తామని పరీక్షల నియంత్రణాధికారి ఆలపాటి శివప్రసాదరావు హెచ్చరించారు. గురువారం డెల్టా ప్రాంతంలోని కళాశాలల్లో మాస్ కాపీయింగ్ జరగుతుందని వచ్చిన పిర్యాదుపై ఆయన స్పందించారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో ఉన్న పరిక్షా కేంద్రం అయినందున ఎంపిక చేయడం జరిగిందని వెల్లడించారు. వర్సిటీ పరిధిలో ఇకపై మాస్ కాపీయింగ్‌కు ఎవరైన ప్రోత్సహించినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే పరీక్షలు సజావుగా జరిగేందుకు క్రమశిక్షణ కలిగిన అబ్జర్వర్‌లు, స్క్వాడ్ బృందాలను నియమించేందుకు అధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

**ప్రింట్‌తో ప్రశ్నా పత్రాలు**

వర్సిటీ పరిధిలో జరుగుతున్న 3వ సెమిస్టర్ పరీక్షలకు ప్రింట్ చేసిన ప్రశ్నాపత్రాలు ఇచ్చారు. తొలిరోజు చేతివ్రాతతో ప్రశ్నాపత్రాలు రాగా పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య యం.సుబ్బారావు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రింట్ చేసిన వాటిని అందజేసినట్లు తెలిసింది.

**రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల**

వర్సిటీ పరిధిలో 5ఏళ్ళ ఎల్ఎల్‌బి కోర్సు 1, 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలకు సంబందించి రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు సిఇ శివప్రసాదరావు తెలిపారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తుళూరు,నవంబర్ 20,ప్రభాతవార్త : ఈనెల 14వ తేది నుంచి నిర్వహించిన 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు ముగిసాయి.వారోత్సవాల్లో పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు



గురువారం బహుమతులు,ప్రశంసాపత్రాలు అందజేశారు.మండల విద్యాశాఖాధికారి అజయ్‌కుమార్ గ్రంధాలయాల ప్రాధాన్యత గురించి వివరించారు.వారోత్సవాల విజయవంతానికి సహకరించిన గ్రంధాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు,గ్రామపెద్దలు,ఉపాధ్యాయులు తదితరులకు గ్రంధాలయాధికారి పి.భాగ్యలత కృతజ్ఞతలు తెలిపారు.

## అలరించిన కృష్ణరాయభారం పద్యనాటకం

గుంటూరు కల్చరల్,నవంబర్ 20,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన న్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస కృతిక శాఖ సౌజన్యంతో శ్రీసర్వేశ్వర నాట్యమండలి అధ్యక్షులు టి.రాజాబాబు(నాన్నగారు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్య నాటకోత్సవాల్లో మొదటిరోజు కార్యక్రమాన్ని అట్ల రామకృష్ణారెడ్డి మయసభ





ఏకపాత్రాభినయంతో ప్రారంభించారు.అనంతరం జరిగిన పురస్కార సభలో ముఖ్యఅతిధిగా మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్,మేకల మోహనరావు,విశ్రాంత డిఎస్పీ రవికుమార్,పురస్కార గ్రహీత డిఎస్పీ సిఐడి గోలి లక్ష్మయ్య,ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు,ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.ముఖ్యఅతిధి మాట్లాడుతూ తెలుగు పద్యానికి రాజబాబు చేసిన సేవలు ప్రశంసనీయం అన్నారు.అనంతరం అతిధులు గోలి లక్ష్యయ్య ని చిత్రవిరించి బిరుదు ప్రధానంతో ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణరాయభారం సన్నివేశంలో శ్రీకృష్ణుడిగా పల్నాటి సుబ్బారావు,అర్జునుడిగా చలువాది ప్రసాద్,దురో ్యధనుడిగా అట్ల రామకృష్ణారెడ్డి లు పౌరాణిక పద్యాలతో నాటక అభిమానులను అలరించారు.కార్యక్రమాలను జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

## ప్రతిభ చాటిన శ్రీ సరస్వతీ శిశువిద్యా మందిర్ విద్యార్థులు.



అమరావతి నవంబర్ 20 ప్రభాతవార్త. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అమరావతి శాఖ గ్రంథాలయం మండల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో శ్రీ సరస్వతిశ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్ విద్యార్థులు వై లక్ష్మి, పి ధృవద్, వి త్రిలోక్, సిహెచ్ మోహన్ నరేష్, కే దినకర్, కె దీక్షి త, కె దీపిక, పి యోగిత.

## ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అమరావతి: నవంబర్20 ప్రభాతవార్త 58గ్రంథాలయ వారోత్సవాలు అమరావతి నందు ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా చిన్నారులకు ఆటల పోటీలు పాటల పోటీలు మ్యూజిక్ చైర్ పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, ఆలోకం సుధాకర్ బాబు చేతుల మీదుగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. లైబ్రరీ యన్ వెంకాయమ్మ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ఎంతో



శ్రద్ధగా వారోత్సవాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని ఆమె అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విజ్ఞానాన్ని పెంచేది గ్రంథాలయాలేనని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. పుస్తక పఠనం ద్వారా తెలియని విషయాలను ఎన్నో తెలుసుకోవచ్చు అని బిజెపి నేత ఆలోకం సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, ఎంఈఓ, సిజెబి అధినేత జాజిబాబు ఎంఈఓ శివ బాబు ప్రసాదు, ప్రదీప్ వెంకయమ్మ పాల్గొన్నారు.

## భాషా పండితులకు పే ప్రొటెక్షన్ సర్వీస్ ప్రొడక్షన్ కల్పించాలి

గుంటూరు విద్య, ప్రభాతవార్త : 2019లో స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది ఆగస్టు 2024లో భాషా పండితులుగా రివర్షన్ ను, తిరిగి డిసెంబర్ 2024 లో కొంతమంది, జూన్ 2025న మరికొంతమంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొంది గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలలో పనిచేస్తున్న తెలుగు మరియు హిందీ భాషా పండితులకు పే ప్రొటెక్షన్ మరియు సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని కోరుతూ ఈరోజు గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి బి హైమారావు నేతృత్వంలో గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుకను కలిసి విన్నవించడం జరిగింది. రివర్షన్ పొందిన సమయంలో ఎంతో మానసిక వేదనను అనుభవించిన తమకు భరోసాని కల్పించి తిరిగి పదోన్నతులు లభించేవరకు అండగా నిలిచిన డీఈవో ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి హైమారావు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల కాలం స్కూల్ అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహించి రివర్షన్ పొందటం బాధాకరమని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులతో ఎన్నడూ జరగని విధంగా మున్సిపల్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు పెద్ద ఎత్తున పోస్టులు మంజూరు చేసిన నేపథ్యంలో తిరిగి భాషా పండితులకు న్యాయం జరిగిందని, వారికి పదోన్నతులు లభించడానికి ఈ నేపథ్యంలో సర్వీస్ ప్రొటెక్షన్, పే ప్రొటెక్షన్ కల్పించడానికి గల అవకాశాలను పరిశీలించి పై అధికారులకు లేఖ రాయాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ పి సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సర్వీస్ ప్రొటెక్షన్ కు గల అవకాశాలను పరిశీలించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి లలిత బాబు, ఉపాధ్యక్షులు టి రవి, కార్యదర్శి ఎ.వినోద్, తెలుగు హిందీ భాషా పండితులు వి త్రివేణి, ఎస్ సిహెచ్ సుధా మైథిలి, జెసిఎల్ అన్నపూర్ణ, వి మాలతి, కే సుజాత, షేక్ జకియా, ఎం లలిత కుమారి, షేక్ మెహబున్నీసా తదితరులు పాల్గొన్నారు...

## ముస్లిం సమాజహితమే వక్ఫ్ లక్ష్యం

గుంటూరు వెస్ట్, నవంబర్ 20,ప్రభాతవార్త: వక్ఫ్ బోర్డులు ఆస్తులు ముస్లిం సమాజహితం కోసం ఉపయోగిస్తామని వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, డైరెక్టర్ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. విజయవాడలోని కాలేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన బుధవారం 8వ బోర్డు సమావేశం నిర్వహించారు. తొలుత సౌదీ అరేబియాలో మృతి చెందిన 42 మందికి సంతాపంగా ప్రత్యేక దువా చేశారు. అనంతరం సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేసి, పలు మ్యానేజింగ్ కమిటీలు, ముతవల్లీలను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల్లో రూ.20 కోట్లకుపైగా చేపట్టనున్న మెగా డెవలప్మెంట్ ప్లాన్స్ ను, వక్ఫ్ ప్రాపర్టీస్ యుటిలైజేషన్ ప్లాన్ ను ఎన్సీపీఈ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు బోర్డ్



సభ్యులకు సమగ్రంగా వివరించారు. అనంతరం చైర్మన్ అజీజ్, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రూ. 20 కోట్లకుపైగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అనుమతి, సహకారంతోనే ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ ప్రణాళికలు అమల్లోకి వస్తే, వక్ఫ్ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, ముస్లిం సమాజానికి మేలు జరుగుతుందని వెల్లడించారు. ఒక వక్ఫ్ సంస్థ నిధులను రుణంగా తీసుకుని, మరొక వక్ఫ్ సంస్థ ఆస్తుల అభివృద్ధికి ఉపయోగించేలా తీర్మానించామని తెలిపారు. సమావేశంలో బోర్డు సభ్యులైన శాసన మండలి సభ్యులు రుహుల్లా, శాసనసభ్యులు ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్ అహమద్ సీఈవో మొహమ్మద్ అలీ వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ మెన్స్ డే సందర్భంగా లలిత ఆసుపత్రి లో పురుషుల ఆరోగ్య శిబిరం

గుంటూరు వెస్ట్, నవంబర్ 20,ప్రభాతవార్త: అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా 2025 నవంబర్ 19 నుంచి 25 వరకు గుంటూరు లలితా ఆసుపత్రిలో పురుషుల ఆరోగ్య స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభించబడింది. ఈ శిబిరాన్ని అడ్వాన్స్డ్ కార్డియోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగం అధిపతి డా. పొలవరపు అనురాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.అనురాగ్ మాట్లాడుతూ, పురుషులు రోజువారీ జీవితంలో ఎదుర్కొనే సవాళ్లు, ఒత్తిడి, అలవాట్లు మరియు జీవనశైలి కారణంగా బీపీ, డయాబెటిస్, గుండె సమస్యలు, పక్షవాతం త్వరగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనికోసం ఈ శిబిరం లో బిపి, బ్లడ్ షుగర్, బిఎంఐ ఈసీజీ, హెచ్ బి ఏ వంశి , లిపిడ్ ప్రొఫైల్,



సీరం క్రియాటినిన్ పరీక్షలు ఉచితంగా చేయబడును. అవసరమైన వారికీ ఇతర పరీక్షలు 50 రాయితీతో అందించబడతాయి. ఎవరు ఈ శిబిరం ఉపయోగించుకోవాలి? 30 సంవత్సరాల పైబడిన పురుషులు, ముఖ్యంగా బీపీ లేదా షుగర్ ఉన్నవారు, కుటుంబంలో బీపీ, షుగర్, గుండెజబ్బులు లేదా పక్షవాతం ఉన్నవారు, ధూమపానం లేదా మద్యం అలవాటు ఉన్నవారు, గురక పెట్టేవారు/నిద్రలో శ్వాస ఆడకపోవడం ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం, గైనీకోమాస్టియా, హెర్నియా, లైంగిక ఆరోగ్య సమస్యలు, వెరికోస్ వీన్స్, ఉన్నవారు ఈ శిబిరం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. శిబిరప్రారంభోత్సవ కార్యక్రమానికి డా.పి.అనురాగ్ (కార్డియాలజీ), యూరాలజిస్ట్ డా. సరవణ కుమార్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా.జయదీప్, ప్లాస్టిక్ సర్జన్ డా.రత్నాకర్, జనరల్ ఫీజిషియన్ డా.ప్రదీప్, పల్మనాలజిస్ట్ డా.ఉజ్వల్ జైన్ తదితరులు హాజరయ్యారు.పురుషుల ఆరోగ్యం గురించి అవగాహన పెంపొందించుకోవడానికి ఈ శిబిరాన్ని ఉపయోగించు కోవాల్సిందిగా లలిత ఆసుపత్రి వారు విజ్ఞప్తి చేసారు.

## పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్

గుంటూరు వెస్ట్, నవంబరు 20, ప్రభాతవార్త : కొల్లిపర మండలం దావులూరు గ్రామంలో పంట పొలాలను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పరిశీలించారు. ధాన్యం విక్రయాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయాలకు ప్రభుత్వం సూచించిన నిబంధనలను పై అవగాహనను పరిశీలించారు. ధాన్యం విక్రయాల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని రైతులను కోరారు. తేమ



శాతం, రవాణా ఖర్చులు, గోనె సంచులు సరఫరా, బ్యాంకు ఖాతాలు పక్కాగా అందించడం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరం అన్నారు.రైతులు ధాన్యం ఆరవేయుటకు టార్పాలిన్ లు అవసరమని కోరగా వాటిని అందజేయుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకు క్రిమిలేయర్ రాజ్యాంగ విరుద్ధం

గుంటూరు విద్య, ప్రభాతవార్త : ఎస్సీ. ఎస్టీ రిజర్వేషన్ లకు క్రిమిలేయర్ విధానం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం కోర్టు అడ్వకేట్.. ఆల్ ఇండియా ఎస్సీ. ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్ : వడ్లమూరి. కృష్ణ స్వరూప్ తెలిపారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్.. ఇతర రెవిన్యూ అధికారులపైన హై కోర్టు లో ఫైల్ చేసిన కోర్టు దిక్కరణ కేసు పైన వాదనలు నిమిత్తం నేడు అమరావతి లోని ఆంధ్రప్రదేశ్ హై కోర్టు కు వచ్చిన సందర్భంగా స్థానిక మీడియా కు ప్రెస్ నోట్ విడుదల చేయడం జరిగింది. క్రిమిలేయర్ అంశం పైన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి. ఆర్. గవాయ్ గారి ఆలోచన రాజ్యాంగ స్ఫూర్తి కి వ్యతిరేకం అన్నారు. క్రిమిలేయర్ అంశం మనువాద దోపిడీ పాలకులు లేవనేత్తిన సామాజిక కుట్రలు అన్నారు. ఇక ఎస్సీ ఉప వర్గీకరణ పైన గత చీఫ్ జస్టిస్ చంద్రచూడ్.. బి. ఆర్. గవాయ్ ఆరుగురు జడ్జి ల బెంచ్ ఇచ్చిన తీర్పు వెనుక ఆర్ఎస్ఎస్. బీజేపీ. మోడీషా మాఫియా పాలకుల హస్తం ఉన్నదన్నారు.. ఇటీవల అమరావతి లోని మంగళ్గిరి లో జరిగిన 75 వసంతాల భారత రాజ్యాంగం అంశం పైన చీఫ్ జస్టిస్ బి. ఆర్. గవాయ్ గారి ప్రసంగం లో బాబాసాహెబ్ డాక్టర్. అంబేద్కర్ గారి పోరాట స్ఫూర్తి కొరవడిందని అన్నారు. సీఎం మనువాద నాయకుడు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు మోడీషా భజన చేయడానికి సరిపోయిందన్నారు. 75 వసంతాల కాలం లో భారత రాజ్యాంగం ను మనువాద పాలకులు సక్రమంగా అమలు చేయలేదని.. అంబేద్కర్ గారు రూపొందించిన సమతా రాజ్యాంగం ను ధ్వంసం చేయడానికి మోడిషా పాలకులు కుట్రలు చేసారన్నారు. ప్రస్తుత రాజ్యాంగం స్థానం లో అసమానతలు. అమానవీయా దోపిడీ మనువాదుల రాజ్యాంగం ను తీసుకొస్తున్నారని.. ఇది అత్యంత ప్రమాదం అన్నారు. దళిత బహుజన ప్రజల మానవ హక్కులను తొలగించడానికి ప్రజాస్వామ్యం. లౌకిక. రిపబ్లిక్ వ్యవస్థ లను ధ్వంసం చేయడమే అజెండా గా బీజేపీ విదీతి పాలకులు ఉన్నారని ఆరోపణలు చేసారు. నవంబర్ 26 న భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని.. పౌర సమాజానికి పిలుపు ఇచ్చారు.. ఈ సందర్భంగా
మనువాద పాలకుల నుండి డాక్టర్. అంబేద్కర్ రాజ్యాంగం ను రక్షి ంచికుందాం : దేశాన్ని కాపాడుకుందాం అంటూ.. మరో స్వాతంత్ర పోరాటానికి దళిత బహుజన సమాజం కేంద్ర. రాష్ట్ర పాలకుల పైన పోరాటం.. తిరుగుబాటు చేయాలని కృష్ణ స్వరూప్ ప్రకటించారు.
భారత రాజ్యాంగం రక్షణ కోసం పౌర సమాజం ఆందోళన చేయకపోతే.. దళిత బహుజన సమాజానికి సామాజిక బానిసత్వం తప్పదని కృష్ణ స్వరూప్ పిలుపు ఇచ్చారు

## పుస్తకమే విద్యార్థులకు గురువు

గుంటూరు వెస్ట్, నవంబర్ 20,ప్రభాతవార్త: రాష్ట్రంలో గ్రంథాలయాలకు జీవం పోస్తున్నామని, పుస్తక పఠనం ఒక మంచి గురువుతో సమానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం గుంటూరు జిల్లా లైబ్రరీలో గ్రంథాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమరావతిలో రూ.150 కోట్లతో ప్రపంచ స్థాయి సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి గ్రంథాలయాలను రెట్టింపు చేయబోతున్నామని తెలిపారు. గుంటూరు నగరంలోని సెంట్రల్ లైబ్రరీని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సహకారంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ వ్యవస్థ తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజూ గంట సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. లైబ్రరీ వ్యవస్థను గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం 10,960 డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు చేయనుందని వెల్లడించారు.

## చిప్స్‌లో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుంటూరు విద్య ప్రభాతవార్త : నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ వారి చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ నందు ఈ నెల 14 వ తేదీ నుండి 20 వరకు గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సూర్యదేవర విద్యాధర తెలిపారు. కళాశాలలోని గ్రంధాలయ విభాగము, ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నివహించినట్లు అయన పేర్కొన్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఇన్ఫర్మాటిక్స్ ఇండియా లిమిటెడ్ వారి"జె గేట్" ఎలక్ట్రానిక్ రిసోర్స్ యొక్క వినియోగం పై అవగాహన కార్యక్రమం,"ఇంపార్టెన్స్ అఫ్ బుక్ రీడింగ్ ఇన్ ది డిజిటల్ ఎరా"అనే అంశము పై వక్తృత్వ పోటీ, బుక్ రివ్యూ రైటింగ్, లైబ్రరీ ట్రెజర్ హంట్ పోటీల తో పాటు లైబ్రరీ ఎక్సటెన్షన్ సర్వీసెస్ లో భాగంగా బుక్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించినట్లు డా, విద్యాధర తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బెస్ట్ లైబ్రరీ యూజర్స్ కు మరియు రచన,వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంశా పత్రల తో పాటు బహుమతులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఈ వారోత్సవ నిర్వాహకులను మరియు పోటీలలో పతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

## పాఠశాలల నాణ్యత, ఉపాధ్యాయుల పనితీరు.. విద్యార్థుల ప్రగతిపై పర్యవేక్షణ మరింత కఠిన తరం

గుంటూరు విద్య, ప్రభాతవార్త : పాఠశాలల నాణ్యత ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థుల ప్రగతి పైన రానున్న రోజులలో పర్యవేక్షణ మరింత కఠిన తరము కానున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా మండల అకాడమిక్ ఫోరమ్ విజిట్లు ను త్వరలో ప్రారంభించ నున్నది . రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మండల అకాడమిక్ ఫోరమ్స్ ఏర్పాటు చేయబడ్డాయి.
ఈ ఫోరమ్ లో ఇద్దరూ మండల విద్యాశాఖాధికారులు ,నాలుగు కాంప్లెక్స్ ల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు,ఏడుగురు హై స్కూల్ సబ్జెక్ట్ వైస్ ఎక్స్పర్ట్ టీచర్లు ,ఐదు మంది ప్రైమరీ ఎక్స్పర్ట్ టీచర్లు ఉంటారు. వీరందరూ వారానికి రెండు సార్లు మండలం ప్రాతిపదికగా స్కూల్ విజిట్లు చేస్తారు.
**విజిట్ విధానం:**ఎంఈఓ ఒకరు , 2 కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు , హైస్కూల్ ఎక్స్పర్ట్ టీచర్లు , హైస్కూల్ లను విజిట్ చేస్తారు.మరొక ఎంఈఓ , 2 క్లస్టర్ హెడ్ మాస్టర్లు , 5 ప్రైమరీ ఎక్స్పర్ట్ టీచర్లు మోడల్ ప్రాథమిక పాఠశాలలను విజిట్ చేస్తారు.విజిట్ ముందు రోజు సంబంధిత హెడ్ మాస్టర్లకు ఎంఈఓ సమాచారం అందిస్తారు.ఆ రోజు ఏ ఉపాధ్యాయుడు సెలవు పెట్టరాదు .

**అందరూ తప్పనిసరిగా హాజరు కావాలి.**

విజిట్ జరిగే సమయంలో విద్యార్థి ఉపాధ్యాయుల హాజరు,సిలబస్ స్థితి,టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ కరెక్షన్లు,నో బ్యాగ్ డే. లో చేసిన కృత్యాలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలు ఎంతవరకు చేరుకున్నాయి.

**అసెస్మెంట్ బుక్స్ ఆన్‌లైన్ ఎంట్రీ స్కూల్ ఎన్రోల్మెంట్ పెంపు పై చర్యలు,**

అపార్ ఐడి జనరేషన్ (ఎంతమందికీ పూర్తయింది),విద్యార్థుల గైర్హాజరు కారణాలు,
హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పరిశీలన, మధ్యాహ్న భోజనం తనిఖీ, పాఠశాల సంబంధిత రికార్డులు తనిఖీ,విద్యార్థుల యూనిఫామ్, బెల్ట్, షూ అంశాలు, ప్రతి తరగతి విద్యార్థుల సబ్జెక్ట్ స్థాయి లను విజిటింగ్ రిజిస్టర్లో నమోదు చేయాల్సి ఉంది. ఎఫ్ ఏ 1 మార్కుల ఎంట్రీ విద్యా ప్రవేశ (1 2 తరగతులు) ఎఫ్ ఎల్ ఎన్. (3,4,5 తరగతులు) టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ తదితరవాటిని పరిశీలిస్తారు. ఈ నెలలో మండల అకాడమిక్ ఫోరమ్ విజిట్లు పూర్తయ్యాక డైట్ లెక్చరర్లు, డైట్ స్టూడెంట్స్, ఎస్ సి ఈ ఆర్ టి రాష్ట్ర సిబ్బంది మళ్ళీ పాఠశాలలను విజిట్ చేసి, ఫోరమ్ రిపోర్టుతో పోల్చి రాష్ట్రానికి సమగ్ర రిపోర్టు పంపిస్తారు. ఏది ఏమైనా రానున్న రోజులలో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాములా మారనుంది. జిల్లా/మండల స్థాయిలో పాఠశాలల నాణ్యత, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రగతి పైన పర్యవేక్షణ మరింత కఠినతరం కానున్నది .

## శ్రీ మేధాలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం పై పరీక్ష

గుంటూరు విద్య, ప్రభాతవార్త: నవంబర్ 26న నిర్వహించనున్న జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శ్రీ మేధా కాలేజీలో భారత రాజ్యాంగం పై గురువారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో రాజ్యాంగ చరిత్ర, మూలాధికారాలు, విధులు, కేంద్ర రాష్ట్ర నిర్మాణం, రాజ్యాంగ ప్రత్యేకతలు వంటి వివిధ అంశాలపై పరీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా రెవెన్యూ



అధికారి ఖాజావలి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో సుమారు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు రాజ్యాంగ రచన అనేక చర్చలు మార్పులు తర్వాత పూర్తయిందన్నారు. అలా తయారైన భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ అంగీకరించిందని తెలియజేశారు .మన రాజ్యాంగం సమాజంలో అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేందుకు మార్గం చూపిందని ఖాజావళి తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు కే. దేవి భార్గవి, ఎస్ .కే .సలీమా, ఎస్డి. ఆర్షియా, ఎస్కే మహిమ, కె శకిలాలను ప్రశంస పత్రాలతో అభినందించారు. మెమొంటోళ్లను బహుకరించారు. కార్యక్రమంలో శ్రీ మేధా విద్యాసంస్థల డైరెక్టర్ సిఏ అన్న నందకిషోర్, సముద్రాల కోటేశ్వరరావు , విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించాలి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్, నవంబర్ 20,ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి 39వ డివిజన్‌లో పర్యటించారు. బుధవారం ప్రజా గ్రీవెన్స్‌లో నమోదైన సమస్యలను, డివిజన్ కు నేరుగా వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. మారుతీ నగర్, నాయీ బ్రాహ్మణ కాలనీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఆక్రమణలు వంటి పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మారుతీ నగర్ 5వ లైన్‌లో రోడ్డుకు సంబంధించిన ఆక్రమణల పై స్థానిక ప్రజలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకొని వచ్చారు.. అలాగే మారుతీ నగర్ తీది కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి, హాల్‌కు సంబంధించిన టెండర్ వివరాలను సేకరించి తనకు అందించాలని అధికారులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.



ముస్లింల స్మశాన వాటిక వద్ద జంగిల్ క్లియరెన్స్‌ను ఒక వారంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైల్వే ట్రాక్ రోడ్‌కు 3 మీటర్ల రోడ్ మంజూరు పై అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దూళిపాళ్ల ఆర్చి వద్ద రెండు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించడమే కాకుండా, మారుతీ నగర్‌లో కొన్నిచోట్ల వీధి దీపాలు లేకపోవడంతో అవి వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి వీరయ్య,రుస్తుం బాబు,రఫీ, ఈశ్వరు, కొండబోయిన శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్ బుడే, మస్తాను, మేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల అవశ్యకత తెలియజేయాలి

గుంటూరు వెస్ట్, నవంబరు 20, ప్రభాతవార్త : మరుగుదొడ్ల అవశ్యకతను ప్రతీ ఒక్కరికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా జిల్లా పారిశుధ్య కమిటీ రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల విశిష్టతను, ఆవశ్యకతను వివరించాలన్నారు. ఎక్కడా బహిరంగ మలవిసర్జన జరగరాదని చెప్పారు.గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ నవంబర్ 21 నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ కార్యక్రమాలు చేపట్టుటకు, డిసెంబర్ 6 నుండి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల సుందరీకరణ అవశ్యకత సర్వే చేపట్టడం, డిసెంబర్ 10వ తేదీన కార్యక్రమం ముగింపు మరియు మరుగుదొడ్ల చక్కటి నిర్వహణ, సుందరీకరణకు అవార్డుల బహుకరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకమైన గ్రీన్ ప్రో సర్టిఫికేషన్

గుంటూరు విద్య , ప్రభాతవార్త: పాలీ క్యాబ్ గ్రీన్ వైర్ ప్లస్ కోసం కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రీన్ ప్రో సర్టిఫికేషన్ పొందటం జరిగిందని పాలీ క్యాబ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ బి టు సి ఇష్వంధర్ సింగ్ కురాన తెలిపారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు పరిశ్రమలో గ్రీన్ ఆవిష్కరణలను ముందుకు నడిపించడంలో పాలీ క్యాబ్ నాయకత్వాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందన్నారు. గ్రీన్ ప్రో సర్టిఫికేషన్ అనేది పర్యావరణ పని తీరు ఆధారంగా ఉత్పత్తులను అంచనా వేసి ప్రతిష్టాత్మక పర్యావరణ లేబులని ఆయన పేర్కొన్నారు. భద్రత మన్నిక పర్యావరణ ప్రభావం కోసం కఠినమైన ప్రమాణాలను పాలి క్యాప్ గ్రీన్ వైర్ ప్లస్ కలిగి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

21-11Pg5 9_21-11Pg5.qxd 20/Nov/25 10:30 PM Page 1



### విదేశీ ఉద్యోగులు లేకపోతే

# విజయం సాధించలేం

## డొనాల్డ్ ట్రంప్ తాజా వ్యాఖ్యలు




**వాషింగ్టన్, నవంబరు 20:** హెచ్-1బి వీసా ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ ఉద్యోగుల అవసరం అమెరికాకు ఉందని అంగీకరించారు. ఈ విషయాన్ని 'మాగా' మద్దతుదారులు అర్థం చేసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరమ్‌లో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో చాలా పెద్ద సంఖ్యలో ప్లాంట్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇవి దేశ ఆర్థికవృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ ప్లాంట్లలో పనిచేసేందుకు నైపుణ్యం కలిగిన విదేశీయులను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వారు అమెరికన్లకు కూడా ఆ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. యుఎస్‌లోని కంపెనీల్లో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడులు పెట్టే వారిని అనుమతించకపోతే.. తాము విజయం సాధించలేమని ట్రంప్ వ్యాఖ్యానించారు. విదేశీ ఉద్యోగులు అమెరికన్లకు నైపుణ్యాలు నేర్పించి తిరిగి స్వదేశాలకు వెళ్లొచ్చన్నారు. విదేశీ వృత్తి నిపుణులు వేలాది మందిని తమతో తీసుకురావాలని.. వారిని తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. యుఎస్‌లో అధిక నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇది మాగా సభ్యులకు అర్థం కాలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. విదేశీ ఉద్యోగులను అనుమతించకపోతే తాము విజయం సాధించలేమని అంగీకరించారు. ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి వలసలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. ఇటీవల హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విదేశీ వృత్తి నిపుణుల కారణంగా అమెరికన్లకు ఉద్యోగావకాశాలు లభించడం లేదని మొన్నటి వరకు ట్రంప్ వాదించారు. అయితే, దీనిపై ఇటీవల ఆయన స్వరం మార్చారు. హెచ్-1బి వీసా కార్యక్రమాన్ని ట్రంప్ సమర్థించారు. ప్రపంచంలోని ప్రతిభావంతులను అమెరికాకు తీసుకువచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. విదేశీ ఉద్యోగుల అవసరం తమకు ఉందని.. వారు యుఎస్‌కు వచ్చి స్థానికులకు నైపుణ్యాలు నేర్పించి వెళ్లాలంటూ సూచనలు చేశారు. అయితే ట్రంప్ నిర్ణయాలను మాగా సభ్యులు వ్యతిరేకిస్తున్నారు.

# కొలువుదీరిన నితీష్ సర్కార్



**పాట్నా, నవంబరు 20:** బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం కొలువుదీరింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి 202 స్థానాలను కైవసం చేసుకుని అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రికార్డు స్థాయిలో నితీష్ కుమార్ పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని పాట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్‌లో గురువారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. రికార్డు స్థాయిలో 10వసారి ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈసారి పదవీ కాలాన్ని పూర్తి చేస్తే.. సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ (24 సంవత్సరాలు) రికార్డును అధిగమించి.. దేశంలోనే అత్యధిక కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీష్ కుమార్ సిఎంగా, 26 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాలకు గానూ ఎన్‌డిఏ కూటమి 202 సీట్లను సాధించింది. ఇందులో బిజెపి 89 స్థానాల్లో విజయం సాధించగా.. ఆ పార్టీకి 14 మందికి మంత్రి పదవులు దక్కాయి. ఇక 85 సీట్లు గెలిచిన జెడియుకి 9 మంత్రి పదవులు దక్కాయి. మరోవైపు.. ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సిఎంలుగా ఉంటారని పేర్కొన్నారు. బీజేపీ తరఫు నుంచి సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హాలు మరోసారి బిహార్ ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. బిజెపి నుంచి దిలీప్ జైస్వాల్ వంటి అనుభవజ్ఞులతో పాటు.. కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్, షూటర్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 34 ఏళ్ల శ్రేయసి సింగ్ కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. జెడియు నుంచి బిజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రవణ్ కుమార్, విజయ్ కుమార్ చౌదరి, అశోక్ చౌదరి వంటి సీనియర్ నేతలకు మళ్లీ మంత్రి పదవులు దక్కాయి. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి)కి రెండు, జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తాన్ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మంచ్ నుంచి నితీష్ కుమార్ మంత్రివర్గంలో ఒక్కొక్కరికి మంత్రి పదవి దక్కింది. ప్రధాని మోడీ శుభాకాంక్షలు బీహార్‌లో మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం వేళ.. ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బీహార్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. ఇది అద్భుతమైన టీమ్ అని.. అంకితభావం కలిగిన నాయకులు బిహార్ రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తారుని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రశాంత్ కిషోర్ మౌనదీక్ష అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రకటించి.. బీహార్‌లో కొత్త సర్కారు కొలువుదీరిన వేళ మౌన వ్రతం పాటించారు. ముఖ్యంగా బీహార్‌లోని చారిత్రక భిత్తిహర్వా గాంధీ ఆశ్రమంలో గురువారం రోజు మొత్తం మౌన దీక్ష చేశారు. మహాత్మా గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించిన ఈ పవిత్ర స్థలంలో మౌనంగా ఆత్మపరిశీలన చేసుకోవడం ద్వారా.. ఎన్నికల్లో వైఫల్యానికి దారితీసిన కారణాలను అన్వేషించాలని ఆయన నిర్ణయించుకున్నారు. తప్పులను సరిచేసుకుని.. మరింత బలంగా ప్రజల ముందుకు వస్తామని ఆయన ధృడంగా తెలిపారు. అందులో భాగంగానే లోపాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించేందుకు, ఒకరోజు మౌన వ్రతాన్ని ఆత్మపరిశీలనగా పాటిస్తున్నానని ప్రకటించారు. ప్రశాంత్ కిషోర్ మౌన దీక్ష బీహార్ రాజకీయ వర్గాలలో మరియు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన తదుపరి వ్యూహం ఎలా ఉంటుందనే ఉత్కంఠను పెంచింది.

బీహార్ సిఎంగా 10వ సారి ప్రమాణం చేసిన జెడియు అధినేత

26 మంది మంత్రులతో కొత్త కేబినెట్

హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయె పాలిత రాష్ట్రాల సిఎంలు

నితీష్‌కు శుభాకాంక్షలు చెప్పిన తేజస్వి యాదవ్

# మేధావులు ఉగ్రవాదులుగా మారితే ప్రమాదకరం

## సుప్రీంకోర్టులో వెల్లడించిన ఢిల్లీ పోలీసులు



**న్యూఢిల్లీ, నవంబరు20:** మేధావులు ఉగ్రవాదులుగా మారితే క్షేత్రస్థాయిలోని వారి కన్నా మరింత ప్రమాదకరంగా తయారవుతారని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టులో వాదించారు. డాక్టర్లు, ఇంజినీర్లు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం ఇప్పుడు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించి నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితరుల బెయిల్ పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకించారు. వారికి బెయిల్ ఇవ్వవద్దని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన సుప్రీం ధర్మాసనాన్ని కోరారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరసత్వ పట్టికలకు వ్యతిరేకంగా 2020లో ఢిల్లీలో జరిగిన నిరసనలు హింసాత్మకం కావడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లకు సూత్రధారులుగా పేర్కొంటూ ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, రహమాన్ తదితరులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద, అప్పటి ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అయిదేళ్లుగా నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. నిందితుల వల్లే ఈ కేసులో జాప్యం జరిగిందని, దీన్ని వారు తమకు అనుకూలంగా మలుచుకోలేరని ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌విరాజు సుప్రీం ధర్మాసనం ఎదుట వాదించారు. సిఏఏకు వ్యతిరేకంగా ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ సంబంధిత వీడియోలను చూపించారు. ఇమామ్ ఓ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అని పేర్కొంటూ ఈ రోజుల్లో ఓ ట్రెండ్ నడుస్తోంది. వైద్యులు, ఇంజినీర్లు తమ పనులు చేయడం లేదు. దేశ వ్యతిరేక కార్య కలాపాల్లో పాల్గొంటున్నారు అని వ్యాఖ్యా నించారు. ఇవి సాధారణ నిరసనలు కావు. హింసతో కూడుకున్నవి. అంతర్జాతీయ మీడియాలో కవరేజీ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను వాడుకున్నారు. ఆందోళనల మాటున ప్రభుత్వాన్ని మార్చడమే వారి అంతిమ ఉద్దేశం. ఆర్థిక విధ్వంసం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వారి లక్ష్యం. మేధావులు అనిపించుకునే వాళ్ల క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కన్నా ప్రమాదకరమైనవారు అని రాజు అన్నారు. ఇది కేవలం సిఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాదని, సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించే ప్రయత్నమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

### తల్లినే హనీట్రాప్‌కు ఎరగావేసి

# కటకటాల్లోకి కొడుకు!

**విజయపుర, నవంబరు 20:** ఈజీ మనీ కోసం ఓ ప్రబుద్ధుడు తల్లినే ఎరగా వేశాడు. ఓ బ్యాంకు మేనేజర్ ను హనీట్రాప్ లో ఇరికించి, లక్షలు వసూలు చేయాలని ప్లాన్ వేశాడు. తన తల్లితో ఆ మేనేజర్ ఏకాంతంగా గడిపినపుడు సెల్ ఫోన్ తో రికార్డు చేసి బెదిరింపులకు దిగాడు. అయితే, బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో తల్లీకొడుకుల నిర్వాకం బయటపడింది. కర్ణాటకలోని విజయపుర జిల్లా ఇండి పట్టణంలో ఈ సంఘటన జరిగింది. ఇండి పట్టణంలోని ఒక బ్యాంకు మేనేజరుకు కొంతకాలం క్రితం కొబ్బరి బొండాలు అమ్మే మహిళ (44)తో పరిచయమైంది. బ్యాంకు పక్కనే కొబ్బరి బొండాలు అమ్ముతుండడంతో సదరు మహిళతో మాటామాటా పెరిగింది. ఈ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని మేనేజర్ ను హనీట్రాప్ లో ఇరికించేందుకు ఆ మహిళ కొడుకు (24) కుట్ర చేశాడు. ఇందుకు తల్లి కూడా సహకరించడం గమనార్హం. తల్లీకొడుకుల పథకం ప్రకారం ఈ నెల 1న ఆ మహిళ బ్యాంక్ మేనేజర్ ను తన ఇంటికి ఆహ్వానించింది. ఇంట్లో తాను మాత్రమే ఉంటానని, సరదాగా గడుపుదామని పిలిచింది. ఇంటికి వచ్చిన మేనేజర్ తో ఆమె సన్నిహితంగా ఉన్న సమయంలో కిటికీలో సెల్ ఫోన్ పెట్టి వీడియో తీసింది. ఆ ఫోన్ ను గమనించిన మేనేజర్ ప్రశ్నించగా ఆ ఫోన్ పాడైపోయిందని జవాబిచ్చింది. ఆ తర్వాత నాలుగు రోజులకు మేనేజర్ కు ఫోన్ చేసి తామిద్దరూ ఏకాంతంగా గడిపిన సంఘటనను గుర్తుతెలియని వ్యక్తులు రికార్డు చేశారని, ఆ వీడియో పంపించి బెదిరిస్తున్నారని నాటకమాడింది. వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఆ మహిళ కొడుకు, అల్లుడు, ఓ పత్రిక విలేకరి ముగ్గురూ కలిసి బ్యాంకు మేనేజర్ కు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అడిగిన సొమ్ము వెంటనే ఇవ్వకుంటే ఆయన రాసలీలల వీడియోను టీవీలో ప్రసారం చేస్తామని బెదిరించారు.

దీంతో కంగుతిన్న బ్యాంకు మేనేజర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు జరిపి కొబ్బరి బొండాలు అమ్మే మహిళ కొడుకును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తల్లితో కలిసి తాను చేసిన కుట్రను నిందితుడు వెల్లడించాడు. ప్రస్తుతం తల్లి, మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ తల్లీకొడుకులు గతంలో కూడా ఇదే తరహాలో పలువురిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

# భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నేనే ఆపా!

## 60వ సారి ట్రంప్‌నోట అదే మాట..



**వాషింగ్టన్, నవంబరు 20:** అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పాకిస్థాన్ సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అణుయుద్ధం జరగకుండా తానే అడ్డుకున్నానని, 350 శాతం భారీ సుంకాలు విధిస్తానని బెదిరించడంతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. యుద్ధానికి వెళ్లడం లేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా తనకు ఫోన్ చేసి చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ హాజరైన యూఎస్ సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడారు. వివాదాలను పరిష్కరించడంలో నేను నిపుణుడిని. భారత్, పాకిస్థాన్ అణ్వాయుధాలతో యుద్ధానికి సిద్ధమయ్యాయి. మీరు యుద్ధం చేసుకోవచ్చు, కానీ రెండు దేశాలపై 350 శాతం సుంకాలు విధిస్తానని చెప్పాను. అణు ధూళి లాస్ ఏంజిల్స్‌పై తేలియాడటాన్ని నేను చూడలేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడినందుకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా తనకు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపారని ట్రంప్ చెప్పారు. ఈ ఏడాది మే నెల నుంచి ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది 60 సార్లకుపైనే. అయితే, ఈ విషయంలో మూడో వ్యక్తి మధ్యవర్తిత్వాన్ని భారత్ మొదటి నుంచి ఖండిస్తూ వస్తోంది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా, పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలపై భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆ తర్వాత మే 10న ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని భారత్ స్పష్టం చేసింది. ఇందులో మరెవరి ప్రమేయం లేదని తేల్చిచెప్పింది.

### ప్రతి ముగ్గురిలో ఒకరిపై లైంగిక హింస

### ప్రపంచంలో సుమారు 84 కోట్లమంది బాధితులే

### ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక

**జెనీవా, నవంబరు 20:** మహిళలపై హింస ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా కొనసాగుతోందని, ఈ సమస్య పరిష్కారంలో గత రెండు దశాబ్దాలుగా చెప్పుకోదగ్గ పురోగతి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ఈనెల 25న అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడుదల చేసిన నివేదికలో అనేక దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది. గడిచిన 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 31.6 కోట్ల మంది మహిళలు, 1.25 కోట్ల మంది కౌమార బాలికలు లైంగిక హింసకు గురయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు (దాదాపు 84 కోట్ల మంది) తమ జీవితకాలంలో భాగస్వామి ద్వారా గానీ, ఇతరుల వల్ల గానీ హింసను ఎదుర్కొన్నారని, 2000 సంవత్సరం నుంచి ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదని నివేదిక పేర్కొంది. 15-19 ఏళ్ల వయసున్న బాలికల్లో 16 శాతం మంది (1.25 కోట్లు) తమ భాగస్వామి చేతిలో శారీరక లేదా లైంగిక హింసకు గురైనట్లు తేలింది. భాగస్వామి ద్వారా జరిగే హింసను తగ్గించడంలో పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, గత 20 ఏళ్లలో ఏటా కేవలం 0.2 శాతం మాత్రమే తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. భాగస్వాములు కాకుండా ఇతరుల వల్ల 15 ఏళ్ల వయసు నుంచి 26.3 కోట్ల మంది మహిళలు లైంగిక హింసకు గురయ్యారని, అయితే సామాజిక అపవాదు, భయం కారణంగా కొందరు వెల్లడించరని, దాని వల్ల ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మహిళలపై హింస మానవాళి ఎదుర్కొంటున్న పురాతన, విస్తృతమైన అన్యాయాలలో ఒకటి. అయినా దీనిపై చర్యలు చాలా తక్కువగా ఉన్నాయి.

# సంక్షిప్తంగా..

## పోక్సో కేసులో యడియూరప్పకు సమన్లు

**బెంగళూరు, నవంబరు 20**: కర్ణాటక మాజీ సిఎం యడియూరప్పకు పోక్సో కేసులో ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. డిసెంబర్ 2వ తేదీన వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సహాయం కోరేందుకు తన నివాసానికి వచ్చిన ఓ బాలికను యడియూరప్ప లైంగికంగా వేధించారని ఆయనపై ఆరోపణలు నమోద య్యాయి. 2024 ఫిబ్రవరి 2న ఈ ఘటన జరగ్గా, బాధితురాలి తల్లి సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో యడియూరప్పతో పాటు అరుణ, ఎం. రుద్రేశ్, మరిస్వామి అనే మరో ముగ్గురిని కూడా నిందితులుగా చేర్చారు. వారికి సైతం కోర్టు సమన్లు పంపింది. విచారణలో ఫిర్యాదిదారుల తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్ అశోక్ ఎస్. నాయక్ వాదనలు వినిపించారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి సుజాత, 30 రోజుల్లోగా సాక్షుల విచారణ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశిస్తూ ఈ సమన్లు జారీ చేశారు. కాగా, తనపై నమోదైన పోక్సో కేసును, సమన్లను రద్దు చేయాలని కోరుతూ యడి యూరప్ప దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రత్యేక కోర్టు తాజా ఆదేశాలు జారీ చేశారు.

## నేపాల్‌లో మళ్లీ జెన్ జెడ్ ఆందోళనలు!

**ఖాట్మండ్, నవంబర్ 20:** నేపాల్‌లో మళ్లీ జెన్ జడ్ ఆందోళనలు చెలరేగాయి. గతంలో అధికారంలో ఉన్న పార్టీ మద్దతుదారులు, యువ నిరసనకారుల మధ్య పలు ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం కర్ఫ్యూ అమల్లోకి తెచ్చింది. ఎక్కువ మంది ఒకచోట చేరడంపై నిషేధం విధించింది. ఇటీవల నేపాల్‌లో జనరేషన్ జెడ్ నిరసనలు కెపి శర్మ ఓలీ ప్రభుత్వాన్ని గద్దెదించిన విషయం తెలిసిందే. బారా జిల్లాలో జెన్‌జడ్ నిరసనకారులు, ఓలీ మద్దతుదారులుర్యాలీలు నిర్వహించారు. కొద్దిసేపటికే రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో కూడా పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాంతో ఈ రాత్రి వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందని వెల్లడించారు. శాంతియుత పరిస్థితులను నెలకొల్పేందుకు భద్రతా బలగాలు సన్నద్ధతతో ఉండాలని నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కి ఆదేశించారు.

## జమ్మూలోని కాశ్మీర్‌టైమ్స్ ఆఫీసులో ఎకె47 బుల్లెట్లు




**న్యూఢిల్లీ, నవంబర్ 20**: జమ్మూకశ్మీర్‌లోని ఓ మీడియా సంస్థ కార్యాలయంలో తూటాలు లభ్యం కావడం కలకలం సృష్టిస్తోంది. పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జరిపిన సోదాల్లో జమ్మూలోని కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో ఎకె 47బుల్లెట్లు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం ఈ తనిఖీలు జరిగాయి. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చిన ట్రంప్!



**వాషింగ్టన్, నవంబరు 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చారు. పుతిన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను చడీచప్పుడు లేకుండా ఆమోదించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మూడేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 28 పాయింట్లతో ఒక ప్లాన్ సిద్ధం చేశారు. అందులో ఎక్కువ పాయింట్లు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను అమెరికా, రష్యా అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ఇటీవల దానిని జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అందించారు. దీనిపై ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య సమావేశం జరిగింది. ఈ ప్రణాళికకు అంగీకారం తెలపాలని అమెరికా కోరుకుంటుందని ఆ సందర్భంగా విట్కాఫ్ స్పష్టం చేశారు.



### అల్‌ఫలా ఛైర్మన్‌పై

# మరో కేసు!

## బోగస్ అక్రెడిటేషన్లతో టోకరా

**ఫరీదాబాద్, నవంబరు 20:** టెర్రర్ ఫండింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే 13 రోజుల ఈడీ కస్టడీలో ఉన్న ఆయనపై తాజాగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రూ.2 కోట్ల మోసం కేసు నమోదైంది. దీంతో ఆయన అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయటపడు తోంది. వర్సిటీకి నకిలీ అక్రిడిటేషన్లు ఉన్నాయని, చట్టబద్ధమైన గుర్తింపు పొందినట్లు తప్పుడు ప్రచారాలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసగించారని సిద్ధిఖీపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసం ద్వారా ఆయన సుమారు రూ.415.10 కోట్లు అక్రమంగా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఢిల్లీ బ్లాస్ట్ కేసుతో ఆయనకు సంబంధాలు ఉన్నాయనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది.

# తలాక్ ఎహసన్‌పై సుప్రీం తీవ్ర ఆగ్రహం!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** ముస్లింలలో అమల్లో ఉన్న మరో విడాకుల పద్ధతి 'తలాక్‌ఎహసన్'పై సుప్రీంకోర్టు తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. మూడు నెలల పాటు ప్రతినెలా ఒకసారి తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే ఈ విధానం చెల్లుబాటును ధర్మాసనం ప్రశ్నించింది. ఆధునిక సమాజంలో ఇలాంటి పద్ధతులను ఎలా అనుమతిస్తారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎనిమిదేళ్ల క్రితం ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ (తలాక్‌ఎ బిద్దత్) రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు, ఇప్పుడు మరో విడాకుల పద్ధతిపై దృష్టి సారించింది. ఓ ముస్లిం మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. బెనజీర్ హీనా అనే మహిళకు ఆమె భర్త గులాం అక్తర్ తన న్యాయవాది ద్వారా విడాకుల నోటీసు పంపించాడు. ఆ తర్వాత అతను మరో వివాహం చేసుకున్నాడు. అయితే, 11 పేజీల తలాక్ నోటీసుపై భర్త సంతకం లేకపోవడంతో తన బిడ్డకు స్కూల్‌లో అడ్మిషన్ ఇప్పించడానికి ఇబ్బందులు పడుతున్నానని ఆమె కోర్టుకు తెలిపారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇస్లాంలో ఇది సాధారణ పద్ధతేనని భర్త తరఫు న్యాయవాది వాదించగా ఇదొక పద్ధతి ఎలా అవుతుంది, ఇలాంటి కొత్త కొత్త ఆలోచనలు ఎలా పుట్టుకొస్తున్నాయని కోర్టు ప్రశ్నించింది. విడాకుల విషయంలో భార్యతో నేరుగా మాట్లాడటానికి భర్తకు ఉన్న అహంకారం ఏంటి ఇది ఒక మహిళ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. ఆధునిక సమాజంలో ఇలాంటి వాటిని ఎలా ప్రోత్సహిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించింది. మతపరమైన పద్ధతుల ప్రకారం విడాకులు తీసుకోవాలనుకుంటే, నిర్దేశించిన పూర్తి విధానాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. తన హక్కుల కోసం పోరాడుతున్న పిటిషనర్‌ను అభినందించిన ధర్మాసనం, వనరులు లేని పేద మహిళల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేసింది.

# భారత్‌కు అమెరికా జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణుల సరఫరా

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్, అమెరికా మధ్య రక్షణ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుతున్నాయి. ఇరుదేశాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి నిదర్శనంగా, భారత్‌కు సుమారు 93 మిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాల విక్రయానికి ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక జావెలిన్ యాంటీట్యాంక్ క్షిపణులు, ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్‌ను అమెరికా సరఫరా చేయనుంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ అమ్మకానికి ఆమోదం తెలిపిందని, ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ వ్యవస్థలు, 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ ఉన్నాయని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ వెల్లడించింది. భారత్ మొత్తం 148 జావెలిన్ క్షిపణులు, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, 216 ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ కోసం అభ్యర్థించినట్లు తెలిపింది. ఈ ప్రతిపాదిత విక్రయం అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. మా కీలక రక్షణ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపరచడం ద్వారా ఇండో పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది" అని డీఎస్‌సీఏ పేర్కొంది. ఈ ఒప్పందంతో భారత్ తన దేశీయ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోగలదని వివరించింది.



21-11pg6exHMNWJQE 10_21-11pg6exHMNWJQE.qxd 20/Nov/25 10:27 PM Page 1



# విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్



## కష్టపడితేనే విజయం

- విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు
- 2వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి
- కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన భువనేశ్వరి
- విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణం

కుప్పం, నవంబరు 20 ప్రభాతవార్త: క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమైందని, చిన్నతనం నుంచే పిల్లలకు విలువలు నేర్పించాలని అన్నారు. 2వ రోజు కుప్పం నియోజక వర్గం పర్యటనలో భాగంగా పరమ సముద్రం గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలను సందర్శించారు. కెజిబివి నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

### విజయానికి షార్ట్ కట్ లేదు

"పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. ఆటపాటతో పాటు కెరీర్ పైనా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కష్టపడకుండా విజయం రాదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎన్టీఆర్, అబ్దుల్ కలామ్, ధీరూ భాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు చిన్నతనంలో 6 కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు. నాకు తల్లిదండ్రులే స్ఫూర్తి. మా నాన్న ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్‌కి వెళ్లి చదువుకునే వారు. ఎంతోమంది తల్లిదండ్రులు స్తోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని విద్యార్థులకు భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పైనా దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కస్తూర్బా విద్యాలయానికి 20కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా

### పిల్లలను విలువలతో పెంచాలి

"విలువల బడి వ్యవస్థాపకులు లెనిల్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా ఉండేది. ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేష్‌కు నా అభినందనలు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్లోజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం. నేటి సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయి. టెక్నాలజీని చెడు కోసం ఉపయోగిస్తున్నారు. పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమైంది. చిన్నతనంలోనే విలువలు, సంస్కారం నేర్పాలి. పిల్లల ఆసక్తి గమనించి అందులో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. నారా లోకేష్ ప్రజాసేవలో బిజీగా ఉండటంలో మా మనుమడు దేవాన్ష్ చదువు, క్రీడల విషయాలు బ్రాహ్మణినే స్వయంగా చూసుకుంటుంది. అప్పట్లో చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో లోకేష్ పెంపకం బాధ్యత తానే తీసుకున్నా" అని నారా భువనేశ్వరి తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలి

## పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సచివాలయం, నవంబరు 20 ప్రభాతవార్త: ప్రతి కుటుంబం నుంచి ఒక్కో పారిశ్రామిక వేత్తను తయారుచేసే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని, ప్రజలను చైతన్య పరిచి, పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో ఉన్న సమావేశ మందిరంలో, పరిశ్రమల శాఖ అధికారులు, 26 జిల్లాల జెనరల్ మేనేజర్ లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు తగ్గట్టుగా, వారి లక్ష్యానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పని చేయాలని సూచించారు. ప్రతీ కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని కోరారు. క్షేత్ర స్థాయిలో రీజనల్ మీటింగ్స్ పెట్టి, అవగాహన పెంచే విధంగా చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన శిక్షణ కూడా ఇచ్చే విధంగా, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు అనుసంధానం చేసి పరిశ్రమల ఏర్పాటు కు కావాల్సిన చేయూతను ఇచ్చి, ఆలోచన నుంచి ఆచరణ వరకు పెట్టుబడి దారులకు సహకరించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన విషయాలపై అధికారులు అందరికి స్పష్టమైన అవగాహన ఉండాలని, అలా ఉన్నప్పుడే, పెట్టుబడులు పెట్టాలని ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సమాచారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రోత్సాహం అందు తుందని మంత్రి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వారానికి ఒక రోజు.. ఖచ్చితంగా సిబ్బంది అందరూ ఆఫీస్‌లో ఉండాల్సి ఉంటుందని, ఫీల్డ్ వర్క్ పైనే కాదు ఆఫీసుల్లో జరిగే కార్యకలాపాల మీద దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీ రోజు ఎవరో ఒక అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండి, ఔత్సాహికులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు కాబోయే పరిశ్రమలపై అందరూ దృష్టి సారించాలన్నారు. ప్రతీ వారంలో, శనివారం అధికారులు అందరూ అందుబాటులో ఉండాల్సిందేనని, రెండవ శనివారం మినహాయింపు ఉంటుందన్నారు. ఆచరణలో ప్రభుత్వానికి ఎదురయ్యే సవాళ్ళను పరిష్కరించేందుకు అవసరమైన మౌలిక వసతులు, మానవ వనరులను ఇచ్చేందుకు ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించి ముందుకు తీసుకు వెళ్లాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్, డైరెక్టర్ శుభమ్ బన్సాల్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొనగా, 26 జిల్లాల ఉన్నతాధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# బిసిలకు జనాభా దామాషా మేర చట్టబద్ధ రిజర్వేషన్లు ఇవ్వాలి



విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, ఎబిసిడిలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు జరపాలంటూ, తమ సంఘం అన్ని జిల్లాల అధ్యక్షులు ఈనెల 24 గ్రీవెన్స్ డే రోజున అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా పీఎం, సీఎంలకు బీసీల రిజర్వేషన్ల గురించి విజ్ఞాపన పత్రాలను సమర్పిస్తారని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. గురువారం మంగళగిరి సంఘ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో కేసన శంకరరావు మాట్లాడుతూ 33 శాతం చట్టసభల్లో, 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వటానికి వీలుగా కులగణన జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిల రిజర్వేషన్లను న్యాయ, రాజ్యాంగపర అవరోధాలు రాకుండా రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకునేలా, పార్లమెంటు చట్టబద్ధత కల్పించి బిసిలకు సామాజిక న్యాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, సంఘ నేతలు మేకా వెంకటేశ్వరరావు, చిప్పాడ చందు, వాకా వెంకటేశ్వరరావు, ఆలా శివాజీ, వాడల నాగరాజు, వెంకటసుబ్బయ్య, ఉమామహేశ్వర రావు, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజారులో కలెక్టర్ తనిఖీలు

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ పటమట రైతు బజార్‌ను కలెక్టర్ లక్ష్మీశా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రతపై ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. రైతు బజార్‌లో బాగానే పరిశుభ్రత పాటిస్తున్నారని, ఇంకా బాగా చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం చాలా వరకు తగ్గించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లక్ష్మీశా మీడియాతో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా రైతు బజార్‌లు, మార్కెట్‌లు తనిఖీ చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, ధరలను పరిశీలించామని తెలిపారు. పటమట రైతు బజార్‌లో శుభ్రతను పాటిస్తున్నారని చెప్పారు. షాపుల్లో రైతులే ఉంటున్నారా, దళారులు ఉంటున్నారా అని చెక్ చేశామన్నారు. డ్వాక్రా మహిళలు ఎక్కడ నుంచి కూరగాయలు తెస్తున్నారనేది పరిశీలించామని అన్నారు. ధరల విషయంలో ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నామన్నారు. పాలిథిన్ కవర్లు వాడకూడదని చెబుతున్నామని.. పూర్తిగా ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలని వెల్లడించారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ వాడకూడదని చెప్పామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. పాలిథిన్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షాపు ఎదుట ధరల పట్టిక, కూరగాయల వివరాలు ఉంచాలని ఆదేశించారు. వినియోగదారులు కూరగాయల కోసం రైతు బజార్లకు వస్తారన్నారు. ఇక్కడ నుంచే ప్రజల్లో అవగాహన కలిగించి, ఎకో ఫ్రెండ్లీ రైతు బజార్లుగా మారుస్తామని

# చట్టబద్ధ భూమి కబ్జాకు యత్నం...
# న్యాయం చేయండి

- మోసపూరిత భూమి రిజిస్ట్రేషన్‌పై టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- కొడుకుల క్రూరత్వం.. ఇంట్లో బంధించి దాడులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డ్ చైర్మన్ వలవల బాజ్జీ



విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా పుత్తూరు మండలం భవాని నగర్ గ్రామానికి చెందిన బంగారయ్య నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ..తమ గ్రామంలో సర్వే నెంబర్ 245/3బి2కి సంబంధించిన భూమి చాల సంవత్సరాలుగా తమ కుటుంబ ఆధీనంలో ఉంది. భూమిపై చట్టపరమైన హక్కులు కలిగి ఉన్నాం. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారి కూడా నిర్ధారించారు. అయితే తాయిమాంబపురం గ్రామానికి చెందిన యం.బాలకృష్ణ తన ప్రమేయం లేకుండా అక్రమంగా మోసపూరితంగా పత్రాలు సిద్ధం చేసుకుని భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని నేతలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డ్ చైర్మన్ వలవల బాజ్జీలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

చిత్తూరు జిల్లా కుప్పం మండలం అడవి బూదుగురు గ్రామానికి చెందిన రాణి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్లు 109/43లో 0.09 సెంట్లు, 109/4తిలో 0.0825 సెంట్లు మొత్తం 0.17 సెంట్లు భూమి తమ పేరుమీద రిజిస్ట్రేషన్ పత్రాలతో చట్టబద్ధంగా ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన చిన్నయ్య భార్య శాంత, కుమారులు చంద్రయ్య, చిన్నయ్య, పాపయ్య అనే వారు తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ.. కర్రలతో దాడి చేయడానికి యత్నించారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన రామలక్ష్మీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 205/1, చ.గ. 239, డోర్ నెం. 470 వద్ద ఉన్న పూరి ఇల్లు తమ భర్తతో కలిసి కష్టపడి నిర్మించుకున్నాం. అయితే ఇద్దరు కుమారులు ఇందిరాసి ప్రేమ్ కుమార్, ఇందిరాసి పవన్ కుమార్ బెదిరింపులతో కలిసి ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం. 161/2021గా ఇంటిని ఉచిత సెటిల్ మెంట్ పేరుతో చిన్న కుమారుని పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంటి రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత నుంచే ఇద్దరు కుమారులు ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి వారితో పాటు వాళ్ల భార్యలు తమని కొట్టడం, అవమానించడం బూతులు తిట్టడుతూ సంరక్షణ లేకుండా వేధిస్తున్నారు. అంతేకాకుండా, ప్రతిరోజూ 56 మంది తాగుబోతులను ఇంటికి తీసుకువచ్చి త్రాగుబోతు వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనిపై ప్రశ్నించగానే ఇది మా ఇల్లు - మీకు ఉండటానికి హక్కు లేదు అంటూ తీవ్రంగా బెదిరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లో బంధించి దారుణంగా కొట్టి ఇంట్లో ఉంటే చంపేస్తామంటున్నారు. కావునా తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరిష్కరించాలని కోరారు.

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 2018లో టీడీపీ ప్రభుత్వంలో మెయిన్ రోడ్డుకు సిమెంట్ రోడ్ వేయడానికి తమ బిల్డింగ్‌ను కూల్చివేశారు. పంచాయతీ అధ్యక్షుడు టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు నష్టపరిహారం, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ సమస్యను పట్టించుకోలేదు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసాక కూడా తాము టీడీపీ వారికి మద్దతిచ్చారు అంటూ తమకు స్థలం ఇవ్వడాన్ని తిరస్కరించారు. గ్రామంలో 120 మందికి స్థలాలు ఇచ్చినా తమకు మాత్రం ఇవ్వలేదు. రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఇంటి స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్, వీఆర్వోలకు ఆదేశించారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ తమ సమస్యకు పరిష్కారం రాలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమకు ఇంటి స్థలం మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# కుష్టు వ్యాధుల గుర్తింపు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

## డిహెచ్ డాక్టర్ పద్మావతి

సచివాలయం, నవంబరు 20 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో గురువారంనాటికి 66,52,563 మందిని స్క్రీనింగ్ చేయగా, వీరిలో తదుపరి పరీక్షల కోసం (రీఎగ్జామినేషన్) 5,085 మందిని మెడికల్ ఆఫీసర్లకు పంపామని ప్రజా ఆరోగ్య సంచాలకులు(డిపిహెచ్) డాక్టర్ కె. పద్మావతి నేడొక ప్రకటనలో తెలిపారు. 30 వరకు జరిగే ఇంటింటి సర్వేలో ఆశా వర్కర్, మేల్ వాలంటీర్ తప్పనిసరిగా ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్క్రీనింగ్ కోసం ఇంటింటికీ వచ్చే ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. అనుమానిత కేసుల వివరాల్ని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పిహెచ్‌సి) వైద్య అధికారులకు పంపుతారని ఆమె తెలిపారు. లక్షణాలు బయటపడగానే ఆ వ్యక్తి చుట్టుపక్కల ఉన్న 300 ఇళ్లను మరల ఫోకల్ లెప్రసీ సర్వే (ఎఫ్ఎల్‌సి) చేస్తారని, అలాగే ఆ వ్యక్తి ఇంట్లో ఉన్న వారికి, చుట్టుపక్కల ఉన్న కనీసం 30 నుండి 40 మందికి సింగిల్ డ్రగ్ రెజిమన్ (ఎస్‌డిఆర్) లేదా పెప్ (పిఇపి) మందులివ్వాలిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు మల్టీ డ్రగ్ ట్రీట్మెంట్(ఎండిటి)ను ఉచితంగా ఇవ్వడం ద్వారా నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల్ని ప్రతి ఇంటికీ పంపిణీ చేయడం, ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లను ప్రదర్శించడం ద్వారా పెద్దఎత్తున అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతినెలా 10వ తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో, లెప్రసి కాలనీల్లో డిజెబిలిటీ ప్రివెన్షన్ అండ్ మెడికల్ రిహాబిలిటేషన్ (డిపిఎంఆర్) క్యాంప్ నిర్వహిస్తారు. ఈ క్యాంపుల ద్వారా అంగవైకల్యం ఉన్నవారికి ఫిజియోథెరపీ చేస్తారు. నయంచేయడానికి వీలుపడని సమస్యని రికన్స్ట్రక్టివ్ సర్జరీ (ఆర్‌సిఎస్)ద్వారా సరిచేస్తారు. ఈ సర్జరీ చేసిన వారికి రూ.12వేలు ప్రభుత్వం అందజేస్తోంది. చికిత్స సమయంలో రూ.6వేలు, ఫస్ట్ ఫాలోఅప్, సెకండ్ ఫాలోఅప్‌లకు రూ.3వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది.

# వాయుసేనలో అవకాశాలపై నేడు అవగాహన సదస్సు

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం విజయవాడ లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఏపీఎస్ రెడ్డి కాన్ఫరెన్స్ హాల్ లో భారత వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... ఇంటర్, తత్సమాన విద్యార్హతలు (పాలిటెక్నిక్, ఐటిఐ) గల విద్యార్థిని, విద్యార్థులు "అగ్నివీర్ వాయు"గా భారత వాయుసేనలో చేరవచ్చని చెప్పారు. 17 సంవత్సరాల దాటిన దగ్గర నుంచి ఇరవై ఒక్క సంవత్సరాల వయసుగల యువతీ, యువకులు దీనికి అర్హులన్నారు. చిన్న వయసులోనే దేశానికి సేవచేసే అవకాశం లభిస్తుందని, దీనిని యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల భర్తీ అధికారి, సికింద్రాబాద్ 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని కరీంనగర్, పెద్దపల్లి, గుంటూరు, పల్నాడు జిల్లాలలో "అగ్నివీర్ వాయు" పై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఇంటర్, తత్సమాన కోర్సుల్లో కనీసం 50 మార్కులతో పాటు, ఇంగ్లీష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు పొందిన విద్యార్థిని, విద్యార్థులు "అగ్నివీర్ వాయు"కు అర్హులన్నారు. యువత, తల్లిదండ్రులు ఈ అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు. శనివారం తిరువూరు డివిజన్లో మరో అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సాచర్‌ను కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశకు షేక్ యాకూబ్ అలీ

# ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా పనిచేద్దాం



## ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఆధునిక సాంకేతికతతో వినూత్న ఆడిట్ పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసేలా మానవవనరులను తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ అండ్ ఈ) ఎస్.శాంతి ప్రియ తెలిపారు. గురువారం స్థానిక స్టాలిన్ బిల్డింగ్ 8వ అంతస్తులోని మల్టీపర్పస్ హాల్‌లో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ చేతుల మీదుగా 5వ ఆడిట్ దివస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ మాట్లాడుతూ అధునాతన సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సేవలను పరిపాలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా ప్రజా వనరులను సక్రమంగా వినియోగిస్తూ పనిచేయాలన్నారు. సమాజంలో సమున్నత మార్పులకు నాయకత్వం వహించడం, విలువలు పునరుద్ధాటించడం, విశ్వాసం, ఆవిష్కరణ, సుస్థిరత, జవాబుదారీతనం లక్ష్యంగా పనిచేయాలన్నారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించిన తర్వాత పరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) పాత్ర ను, చేస్తున్న కృషిని వివరించారు. కాగ్ నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా సాధించాలని ఉద్యోగులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఏఎంజీ3) సుష్మా, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఆర్.శ్యామ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అడ్మిన్) వి.లలిత్ కుమార్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుశాల్, నాబార్డ్ జీఎం మహేష్ సింగ్, ఆర్బీఐ డీజీఎం అనంతీ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్స్ విజయవాడ డైరెక్టర్ రమేష్ కొండా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ

# కల్పవృక్ష వాహనంపై పద్మావతి అమ్మవారు
## మురళీకృష్ణ అలంకారంలో తేజస్వరూపిణి



తిరుచానూరు, నవంబరు 20 ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు గురువారం ఉదయం మురళీకృష్ణ అలంకారంలో తేజోమయి అయిన పద్మావతి అమ్మవారు కల్పవృక్ష వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. తర్వాత అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి మురళీకృష్ణ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం తిరుమాడ వీధులలో భజనలు కోలాటాల నడుమ తేజోమయి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, యుఓ అనిల్ కుమార్ సింగల్, జేఈఓ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఆర్జిత ఇన్‌స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగన్.. జైలుకెళ్లడం ఖాయం

## పెయిడ్ ఆర్టిస్టులతో కోర్టులను మభ్యపెట్టలేరు

### మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అనంతపురం, నవంబరు 20 ప్రభాతవార్త బ్యూరో: అక్రమాస్తుల కేసుల్లో వైకాపా అధ్యక్షుడు జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆరేళ్ల అనంతరం తప్పని పరిస్థితుల్లో విచారణ నిమిత్తం కోర్టుకు వెళ్తూ కూడా నిసిగ్గుగా బలప్రదర్శనకు దిగడం జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండి పడ్డారు. తాను కోర్టుకు హాజరైతే సమస్యలు ఎదురవుతాయని కోర్టులను నమ్మబలికే ప్రయత్నంలో భాగంగానే హైదరాబాదులో గురువారం నానా హంగామా సృష్టించారని ఓ ప్రకటన లో మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. ముందస్తు పకడ్బందీ ప్రణాళికతో ప్రజాబలం ఉందని చెప్పుకోవడానికి పెయిడ్ ఆర్టిస్టులతో ర్యాలీ నిర్వహించి హైదరాబాద్ వాసులను నానా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. విచారణలో భాగంగా కోర్టులకు హాజరయ్యే వారు వినయంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కానీ జగన్ రెడ్డిలో ఎటువంటి పశ్చాతాపం కనిపించడంలేదని తెలిపారు. సీఎంగా తండ్రి ఉండడాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలతో అక్రమ ఆస్తులు అర్జించిన జగన్ కోర్టు కేసుల నుంచి తప్పించుకుని ఎంతోకాలం బయట తిరగలేరని పేర్కొన్నారు.

# అలరాజు రాయబారం వికటించుటయే.. పల్నాటి యుద్ధానికి బీజం

## నాటి కల్యాణపురమే నేటి కారంపూడి

కారంపూడి, నవంబరు 20 ప్రభాతవార్త: బ్రహ్మనాయుడు నేతృత్వంలో మాచర్లను పాలిస్తున్న మలిదేవాదుల వనవాసం అనంతరం తన రాజ్యం అప్పగించాలంటూ గురజాలను పాలిస్తున్న నలగామరాజు వద్దకు అలరాజును రాయబారిగా పంపగా అది వికటించడంతోనే పల్నాటి యుద్ధానికి బీజం పడిందని చారిత్రక కథనం. పల్నాటి వీరారాధనోత్సవాల్లో రెండో రోజు రాయబారం ఘట్టాన్ని గురువారం అత్యంత రసవత్తరంగా నిర్వహించారు. వీర్ల దేవాలయంలో అలనాటి చారిత్రక సన్నివేశాలు ఇతివృత్తంగా మలిదేవాదులు కోడిపందెంలో ఓడిపోవడంతో ముందస్తుగా జరిగిన ఒప్పందం మేరకు



బ్రహ్మనాయుడు, మలిదేవాదులు వారి అనుచరులు రాజ్యం వదిలి ఏడు సంవత్సరాలు వనవాసం పూర్తి చేసుకొని మేడపి (నేడు ప్రకాశం జిల్లా)లో ఉంటున్నారు. ఒప్పంద గడువు తీరి ఆరు నెలలు కావడంతో తమ రాజ్యాన్ని తిరిగి పొందేందుకుగాను ఆ సమయంలో నలగామరాజు అల్లుడు పేరిందేవి భర్త అలరాజును రాయబారం కోసం బ్రహ్మనాయుడు గురజాల పంపుతాడు. గురజాల రాజ్య మంత్రిణి



నాగమ్మ దౌత్యానికి సహకరించకపోగా సూదిమోపినంత నేల కూడా ఇవ్వమని పేర్కొనగా రాజు అయిన నలగామరాజు కోపోద్రేకమును అలరాజుపై వ్యక్తం చేస్తాడు. దీంతో సహనానికి విలువలేకుండా పోయింది పల్నాట రక్తం ఏరులై పారవలసిందే అంటూ అలరాజు యుద్ధ ప్రకటన చేస్తున్నారు. సిద్ధంకండి. విజయమో, వీరస్వర్గమో రణరంగంలో తేల్చుకుందాం అని తన సూర్యభేతాళమనే ఖడ్గమును తీసి వీరావేశం ప్రదర్శిస్తాడు. తిరుగు ప్రయాణ మార్గమధ్యంలో చర్లగుడిపాడు వద్ద పాపిష్టి మంత్రి నాయకురాలు నాగమ్మ కుతంత్రంతో తంబ్లబియ్యర్ సహకారంతో అలరాజుపై విషప్రయోగం చేయించి చంపిస్తుంది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బ్రహ్మనాయుడు యుద్ధం ఆసన్నమైందని ప్రకటించడం చారిత్రక కథనం. అలనాటి కథా సన్నివేశాలను బ్రహ్మనాయుడు వంశధారులో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ వీరాచారవంతులు తమ తమ కొణతాలతో పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సాగు బాగు: ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, నవంబరు 20 ప్రభాతవార్త: ప్రకృతి వ్యవసాయంతో సాగు బాగుంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభిప్రాయపడ్డారు. కారంపూడి మండల పరిధిలోని కాకానివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కోదాటి వరప్రసాదరావు, డాక్టర్ సరళాదేవిలకు చెందిన పండ్ల తోటలను



గురువారం ఆయన పరిశీలించారు. ప్రకృతి సేద్యంలో వారు అవలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. రైతులందరూ ప్రకృతి సేద్యంవైపు మరలిన నాడే అధిక దిగుబడులు సాధ్యపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగ కార్యదర్శి వంగులూరి పుల్లయ్య, మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ల సురేష్‌యాదవ్, బొల్లినేని శ్రీనివాసరావు, మునుగోటి సత్యం, కోదాటి ప్రభాకర్, సీతయ్య, కందిమళ్ల లక్ష్మయ్య, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## చాపకూడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: ఎమ్మెల్యే



కారంపూడి, నవంబరు 20 ప్రభాతవార్త: వీరుల మహోత్సవం సందర్భంగా మూడోరోజు శుక్రవారం నిర్వహించే సహపంక్తి భోజనం చాపకూడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక వీర్ల దేవాలయం ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వీరాచారవంతులు, ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


## శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

మంగళగిరి నవంబర్ 20, ప్రభాతవార్త: మంగళగిరి శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మాట్లాడుతూ మంగళగిరి పానకాల స్వామి ఆలయ మెట్ల మార్గంలో సాగే ఈ అన్నదాన కార్యక్రమం పరమశివులు ఆశీస్సులతో భక్తుల సహకారంతో ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతూనే ఉందని అన్నారు. ప్రతి అమావాస్య రోజున 4వేల మందికి అన్న ప్రసాదం



అందజేస్తున్న ఈ సేవ కార్యక్రమం నిరంతరంగా కొనసాగించేందుకు ట్రస్ట్ సభ్యులు భక్తులు దాతలు ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. 'భక్తుల సేవే పరమార్థం. ఆకలితో వచ్చే వారు అన్నప్రసాదం స్వీకరించి సంతృప్తిగా వెళ్లడం మాకు ఆనందాన్నిస్తుంది" అని సాంబశివరావు పేర్కొన్నారు. వాకర్స్ గౌరవ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, జి.మురహరి, కగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, మారం మల్లికార్జునరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, కోదాడ శ్రీనివాసరావు, భోజనపల్లి తాండవ, ఆలూరి ఉమామహేశ్వరరావు, గండికోట అచ్చయ్య, కటారి విష్ణుమూర్తి, ముద్రబోయిన శ్రీనివాసరావు, రెడ్డి వీర రాఘవులు, చిరుమామిళ్ల రంగారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పేరు బోయిన వెంకటేశ్వరరావు, పందేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా పీఎంసీఎం లకు బీసీల రిజర్వేషన్ల విన్నపం



మంగళగిరి, నవంబర్ 20, ప్రభాతవార్త : రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, ఏ బి సి డి లుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు జరపాలంటూ, తమ సంఘం అన్ని జిల్లాల అధ్యక్షులు ఈనెల 24 గ్రీవెన్స్ డే రోజున అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా పీఎం సీఎంలకు బీసీల రిజర్వేషన్ల గురించి విజ్ఞాపన పత్రాలను సమర్పిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలియజేశారు. గురువారం స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు చిప్పాడ చందు, సీనియర్ బీసీ నాయకులు వాకా వెంకటేశ్వరరావు, ఆలా శివాజీ, వాడల నాగరాజు, వెంకటసుబ్బయ్య, ఉమామహేశ్వరరావు పలువురు బీసీ నాయకులు పాల్గొని ఈనెల 24 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## కాపులు రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించుకోవాలి: మాజీ మంత్రి అంబటి

రేపల్లె, నవంబరు 20, ప్రభాతవార్త: కాపు నాయకులు రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించుకుని ముందుకు సాగాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అరవపల్లిలో కార్తీకవన సమారాధనలో భాగంగా కాపుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ నాడు మహానాడులో కాపులను విస్మరించిన కారణంగా కాపులు ఐకమత్యంతో భారీగా కాపునాడు నిర్వహించి అప్పటి ప్రభుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఆరు సార్లు పోటీ చేస్తే రేపల్లెలో ఒకసారి సత్తెనపల్లిలో ఒకసారి మాత్రమే శాసనసభ్యునిగా విజయం సాధించానని రాజకీయాలలోనే కొనసాగుతున్నానని గెలుపు ఓటములు సహజమని తనకు ఎటువంటి వ్యాపారాలు లేవని ఆయన వివరించారు. కాపు నాయకులు రాజకీయాలు మాత్రమే చేస్తూ ఒకే రాజకీయ పార్టీని అంటిపెట్టుకుని ఉండాలని కార్యకర్తలు మాత్రం పార్టీకి కృషి చేస్తూనే వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తుండాలని ఆయన సూచించారు. కాపుల ఆత్మీయ సమావేశాలకు వేరే కులాల నాయకులు, వేరే పార్టీల రాజకీయ నాయకులను ఆహ్వానించటం వలన కాపుల మనో భావాలను, బాధలను వ్యక్తం చేసుకోలేని పరిస్థితి ఉంటుందని ఆయన సూచించారు. కాపుల సమస్యలు పరిష్కారమయ్యే దిశగా కాపు పెద్దలు, నాయకులు కృషి చేయాలని అంబటి తెలిపారు. కాపు నేతలను ముఖ్యమంత్రిగా చూడాలనే బలమైన కోరిక కాపుల్లో ఉన్నప్పటికీ కొన్ని సమీకరణల కాణంగా సాధ్యపడటం లేదన్నారు. అందరూ సంఘటితంగా ముందుకు సాగితే భవిష్యత్‌లో ఆ బలమైన కోరిక నెరవేరుతుందని అంబటి స్పష్టం చేశారు. కాపులు గొప్ప చరిత్ర కలిగిన వారని గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. రేపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివంగత వంగవీటి మోహన రంగా బడుగు బలహీన వర్గాల ప్రోద్భలంతోనే రాజకీయ నాయకునిగా ఉన్నత స్థాయికి ఎదిగిన మహానుభావుడన్నారు. ఆయన కాపు కులానికే పరిమితం కాలేదని శ్రీనివాసరావు గుర్తుచేశారు. కాపు సంఘీయులే వంగవీటి మోహన రంగాను తమకు చెందిన నాయకునిగా గుర్తింపులోకి తీసుకున్నారని ఆయన చెప్పారు. తుది శ్వాస విడిచే వరకు పేద ప్రజల సంక్షేమం కోసం రంగా శక్తివంచన లేకుండా పనిచేశారని ఆయన సేవలు చిరస్మరణీయమని మోపిదేవి శ్రీనివాసరావు కొనియాడారు. తొలుత వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబటి రాంబాబును కాపు సంఘీయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంగవీటి రంగా కుమార్తె ఆషా కిరణ్, బచ్చు హనుమంతరావు, దామెర్ల రాజారావు, గూడవల్లి బాబూరావు, రాసంసెట్టి మహేష్, గూడపాటి శ్రీనివాసరావు, కమతం సాంబశివరావు, గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## గ్రంధాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం

తాడేపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త : మంగళగిరి శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ ఉషకుమారి మంగళగిరి ఎంఈవో-1 ఎన్.ఉషాకుమారి హాజరయ్యారు కాగా గ్రంధాలయాధికారి ఎన్.ఆరోగ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఈఓ మాట్లాడుతూ 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల కార్యక్రమాలు వాటి అవశ్యకతను సభకు వివరించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంధాలయంలో ఉన్న పుస్తకాలను చదువుకొని ఉన్నత స్థితికి రావాలని తెలిపారు. సిహెచ్ జార్జి విశ్రాంత ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సెల్ ఫోన్లకు దూరంగా ఉండి గ్రంధాలయ పుస్తకాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రంధాలయ సిబ్బంది పి.కృష్ణ, కే.సుబ్బారావు, ఎస్‌కె గఫూర్, గ్రంధాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తాడేపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త : స్థానిక శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు వివిధ పోటీల్లో విజేతైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లి ఎంఈఓ డి.నాగేశ్వరరావు, మాచవరం ఎంఈఓ నరేంద్ర, ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు ఉన్నత పాఠశాల నుంచి డి.సునీత, రవీంధ్ర భారత పాఠశాల కరస్పాండెంట్ ఖమర్ హుస్సేన్, శ్రీభగవాన్ పాఠశాల నుంచి శ్రీనివాస రావు, జయశారద లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్లుగా చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అని కొనియాడారు. ప్రతి విద్యార్థి గ్రంధాలయాలన్ని సద్వినియోగం చేసుకోని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మాచవరం ఎంఈఓ నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్కసారైనా గ్రంధాలయానికి వచ్చి ఇక్కడున్న పుస్తకాలను చదివి తమ జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడంతో గ్రంధాలయ వారోత్సవాలు నేటితో ముగిసినట్లు గ్రంధాలయాధికారి షేక్ నాగూర్ భాషా తెలిపారు.



## కెఎల్‌యులో ముగిసిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తాడేపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త : కెఎల్‌యూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు కార్య క్రమం నవంబర్ 20న ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపి గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ తెలుగు బాషా ప్రాముఖ్యత, గ్రంధాలయాల అభివృద్ధి, పౌర గ్రంధాలయాల వినియోగం ద్వారా




విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించగలరని వివరించారు. అమరావతిలో రూ.150కోట్లతో జాతీయ గ్రంధాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టబోతుందని, 24నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఐక్యూ ఏసి డీన్ డాక్టర్ కె.రామకృష్ణ, అసోసియేట్ డీన్ డాక్టర్ జీఆర్‌కె ప్రసాద్, సెంట్రల్ లైబ్రరీ ఆచార్య ఇన్‌చార్జ్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎం.ధనలక్ష్మి, లైబ్రరీ సిబ్బంది, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏఈఎల్‌సీ కబంధ హస్తాల నుండి పాఠశాలను కాపాడండి.

## ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత చేపట్టాలి

యడ్లపాడు, నవంబర్ 20, ప్రభాతవార్త : ప్రభుత్వం ఏఈఎల్‌సీ కబంధహస్తాల నుండి హైస్కూల్‌ని విముక్తి చేసి నాటి పెద్దల అశయాలను ఫలించేలా ఇక్కడ విద్యాక్షేత్రాన్ని నెలకొల్పాటానికి, దీనికి ప్రభుత్వమే ప్రత్యేక దృష్టి సారించి దాతల దాతృత్వానికి విలువలను పెంచేలా చర్యలు చేపట్టాలని పాఠశాల కమిటీ మరియు దాతల వారసులు, గ్రామస్థులు ముక్తకంఠంగా తమ కోరికను వెలుబుచ్చారు. కార్యక్రమానికి కమిటీ కార్యదర్శి ముత్తవరపు రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు నూతలపాటి కాళాదాసు వివరిస్తూ 1952లో పాఠశాల నిర్మాణానికి శ్రీకారం జరిగిందని, 1956లో ఎఈఎల్‌సి నిర్వహణ బాధ్యత మాత్రమే అప్పగిస్తున్నట్లు లిఖితపూర్వకంగా నాటి పెద్దలు ఇచ్చినట్లు తెలిపారు. విద్యా సంస్ధ నిర్మాణం తర్వాత నిర్వహణ బాధ్యత అప్పగించాల్సిన పరిస్థితి వివరాలు తెలిపారు. బాధ్యతలను స్వీకరించిన ఏఈఎల్‌సీ తొలుత విద్యాన సంస్ధను బాగానే నిర్వహించటం జరిగిందని, తదుపరి సుమారు 20సంవత్సరాల నుండి నిర్వహణ బాధ్యతను పూర్తిగా విస్మరించిందన్నారు. వారికి అస్తులపై ఉన్న ప్రేమ పాఠశాల అభివృద్ధిపై నేటికి లేదన్నారు. శిధిలావస్థకు చేరిన పాఠశాలను అభివృద్ధి చేసేందుకు కమిటీ ఏర్పాటు చేయాల్సిన దుస్తితి వచ్చిందన్నారు. కమిటీ ఏర్పడిన తరువాత ప్రభుత్వం, దాతల సహకారంతో నిదులు సేకరించి వినియోగించటం జరిగిందన్నారు. 2011లో కమిటీ సంస్ధకు పాఠశాల పరిస్తితి తెలపటం జరిగిదని, అయినా వారి నిర్యక్ష్య వైఖరి స్పష్టంగా తెల్సిందన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీపై సంస్ధ అంబాండాలు వేస్తూ అసత్య అరోపణలకు పూనుకోవటం దారుణమన్నారు. పాఠశాలకు దాతలు ఇచ్చిన భూమిని కాపాడలేక గాలికి వదిలేసి నేడు కమిటీ వాటిని వ్యయప్రయాసలకు ఓడ్చి తిరిగి స్వాదీన పర్చుకుంటే దానిపై తప్పుడు ప్రచారాలు చేయటం తప్పా అస్తులను కాపాడుదామన్న అత్మృత వీరిలో నాడు కనపడలేదన్నారు. చివరికి విద్యార్దుల చేరికలు లేక పోవటంతో విద్యాశాఖ మూసివేతకు చర్యలు చేపడితే నేడు వారి స్వప్రయోజనాల కోసం సంస్ధ ప్రతినిదులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, గడచిన పది సంవత్సరాల నుండి ఉపాధ్యాయుల భర్తీ లేకపోవటంతో కాల క్రమేణా విద్యార్దుల సంఖ్య తగ్గిన విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. అస్తులపై ఉన్న ప్రేమ వీరికి ఏనాడు పాఠశాల అభివృద్ధి, విద్యార్దుల భవిష్యత్తుపై లేదని అగ్రహించారు. అందుకే దాతల దాతృత్వం చూపి నాడు స్దలాలు ఇచ్చి గదులు కట్టి ఇచ్చిన పాఠశాలను ప్రభుత్వం స్వాధీన పర్చుకోని కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, అప్పుడే దాతల దాతృత్వం విలువ ఉంటుందని కోరుతున్నామన్నారు. ఇది ఎన్నటికి ఏఈఎల్‌సి అస్తికాదని, దీనికి సంబంధించిన ఒక్క రికార్డు వారి వద్ద లేదని, ఇది పూర్తిగా దాతల దాతృత్వంతో ఏర్పడిన పాఠశాల మాత్రమేనని కార్యక్రమానికి విచ్చేసిన కమిటీ సభ్యులు ముక్తకఠంగా వెలువరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, డాక్టర్ పోపూరి రమేష్, దాసరి వరహాలు, బెజ్జం రాజశేఖర్, పోపూరి వెంకయ్య, కారుచోల రోశయ్య, డి సూర్యప్రకాష్‌రావు, చెరుకూరి సృజన, జరుగుల శంకరరావు, తాడిపత్రి చెంచారెడ్డి, కల్లూరి విజయకుమార్, పోపూరి రాఘవయ్య, వెంకటరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





## న్యాయస్దానం, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అధారంగా పాఠశాల కొనసాగుతుంది : జాషువా డానియల్

యడ్లపాడు, నవంబర్ 20, ప్రభాతవార్త : లూధరన్ పాఠశాల భవిష్యత్ కార్యాచరణ ప్రక్రియ న్యాయస్దానం, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అధారంగా కొనసాగుతుందని రాష్ట్ర మైనార్టీ కమీషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా డానియల్ పేర్కొన్నారు. గురువారం యడ్లపాడు గ్రామంలోని లూధరన్ పాఠశాలను అయన సందర్శించారు. ఈ సంధ్భంగా విద్యాశాఖ, రెవిన్యూ, పాఠశాల ఉపాధ్యాయులతో పాఠశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం, అటస్దలం, వెనుకవైపు ఉన్న ఖాళీ స్దలాలను పరిశీలించారు. వాటి వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై అలోచన చేయాలని సూచించారు. పాఠశాల బలోపేతానికి విద్యార్దుల సమీకరణ అవసరమన్నారు. తాను కూడా లూధరన్ పాఠశాల విద్యార్దినేనని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. విద్యార్దుల సంఖ్య లేకుండా చట్టపరంగా ఏమీ చేయలేమని విద్యాశాఖ కూడా ఎలాంటి సహకారం అందించే అవకాశం ఉండదన్నారు. ఈ సందర్భంగా పాఠాశాల ఉపాధ్యాయులు విద్యార్దుల చేరిక ప్రక్రియను వేగవంతంగా చేసుకోవాలని సూచించారు. అలాగే కమిషన్ ద్వారా ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైన అందించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. తిరిగి పాఠశాల పునర్ వైభవాన్ని సంతరించుకుంటుందని అకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి జస్టిస్, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ జోసఫ్ పిఎస్, విశ్రాంత జడ్జి జస్టిస్, ఏఈఎల్‌సి సెక్రటరీ కంట్రోల్ కె రత్నకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్ చంద్రకళ, ఉపవిద్యాశాఖాధికారి షేక్ సుభాని, పాఠశాల ఏడి ఉదయభాస్కర్, తహశీల్దార్ విజయశ్రీ, సర్వేయర్ సురేంధ్రనాథ్, పాఠశాల హెచ్ఎమ్ బిఎస్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన గ్రంధాలయ వారోత్సవాలు

యడ్లపాడు, నవంబర్ 20, ప్రభాతవార్త : యడ్లపాడు శాఖ గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. ఈ సంద్భంగా గత వారం రోజుల నుండి వివిధ పాఠశాల విద్యార్దులకు వివిధ అంశాలలో నిర్వహించిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీలలో గెలు పొందిన విద్యార్దిని, విద్యార్దులకు బహుమతులను అందజేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన నూతలనపాటి కాళిదాసు, ఎల్ భాస్కరరావు, తాడిపత్రి శ్రీనివాసరావులు విద్యార్దులకు బహుమతులు అందజేసారు. గ్రంధాలయాధికారి సిహెచ్ అంజమ్మ, ఎడ్లూరి సంజీవరావు, పాఠకులు, గ్రామస్దులు పాల్గొన్నారు.



## మౌలిక వసతులు పొందాలి





రేపల్లె, నవంబరు 20, ప్రభాతవార్త: ఆదర్శ గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, నిధులను సమకూర్చుకునేందుకు అవగాహన కలిగి ఉండాలని విజన్ బిల్డింగ్ రిసోర్స్ పర్సన్ ఎపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అన్నారు. గురువారం భట్టి ప్రోలు మండల పరిషత్ సమావేశపు హాలులో జరిగిన విజన్ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమానికి జాలాది ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ప్రవర్తనలో మార్పు, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధి, సామర్థ్యాల పెంపు తదితర అంశాల గురించి వివరించారు. శిక్షణలో ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి కట్టా జ్యోతి, సి.సిలు హానోక్, రజినీ కుమారి, నరేంద్ర, ఎఫ్‌పిఓ అధ్యక్షురాలు ఝాన్సీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## దళితుడి భూమి కబ్జా...పోలీసుల నిర్లక్ష్యం ...

## --చిన్నప్పకు న్యాయం చేయాలంటూ మాల మహాసభ ఆవేదన

తాడేపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త : నంధ్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన దళితుడు వంకధార చిన్నప్పకు ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల భూమిని ఆక్రమించేందుకు కుమ్మరి దస్తగిరి '(ఆర్ఎంపి) చేసిన ప్రయత్నాలను పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. గురువారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు చిన్నప్పతో కలసి మీడియా సమావేశం నిర్వహించి, భూమి వివాదంపై పోలీసుల నిర్లక్ష్య ధోరణిని ఖండించారు. మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ చిన్నప్ప ఫిర్యాదుపై కేసు ఉన్నప్పటికి సంబంధిత సీఐ రమేష్‌బాబు అధికార దుర్వినియోగం చేస్తూ చిన్నప్పపైనే తప్పుడు కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరిచాడని మల్లెల వెంకట్రావు పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్నప్పకు ఇచ్చిన భూమిని కబ్జా చేసిన దస్తగిరిని అరెస్టు చేయకుండా అతన్ని కాపాడుతున్న సీఐ రమేష్‌బాబును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు రెవెన్యూ శాఖల్లో కొనసాగుతున్న అక్రమాలు, లంచగొండి అధికారుల దౌర్జన్యాలను అరికట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎసీ్స, ఎస్టీ సమస్యలపై ప్రతి రెండె నెలలకు ఒకసారి సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మంత్రి లోకేష్‌కు మాల సంఘ నాయకులు విన్నవించారని చెప్పారు. బాధితుడు చిన్నప్ప మాట్లాడుతూ డిజిపి కార్యాలయంలో తనపై ఉన్నప్రాణహానిని వివరించామని, గ్రామంలోకి అడుగుపెట్టినా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని బాధితుడు చిన్నప్ప ఈ సందర్భంగా తెలిపారు. తాను న్యాయం అడిగే హక్కు మాత్రమే వినియోగించుకున్నానని, తమ కుటుంబం భయంతో జీవిస్తుందని చిన్నప్ప ఆవేదన వ్యక్తంచేశారు. మీడియా సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్‌పాల్, ఆవుల దేవరత్నం, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు వంకధార రవికుమార్, శీలం శ్రీనివాసరావు, సేవ సామేలు తదితరులు పాల్గొన్నారు.



### ఎఎఫ్‌సి ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్‌లో..

## తూర్పు బెంగాల్ 0-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్‌లో తూర్పు బెంగాల్ 0-2 తేడాతో వుహాన్ జియాంగ్డా చేతిలో ఓడిపోయింది. గురువారం చైనాలోని వుహాన్‌లో జరిగిన ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో వుహాన్ జియాంగ్డా తూర్పు బెంగాల్‌ను ఓడించింది. భారత ఛాంపియన్ తూర్పు బెంగాల్‌తో జరిగిన మ్యాచ్ లో, షువాంగ్ ఓపెన్ ప్లే, స్పాట్ నుండి ఒక్కొక్క గోల్‌తో తన క్లాస్‌ను ప్రదర్శించింది. ఛాంపియన్స్ లీగ్ విజేత మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి ఎనిమిది నిమిషాల్లోనే పురోగతి సాధించింది. భారత ఛాంపియన్ తూర్పు బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, షువాంగ్ ఓపెన్ ప్లే మరియు స్పాట్ నుండి ఒక్కొక్క గోల్‌తో తన క్లాస్‌ను ప్రదర్శించింది. మహిళల ఫుట్‌బాల్ హెవీ వెయిట్‌తో తలపడే ఈస్ట్ బెంగాల్ జట్టు రక్షణాత్మక లోపంతో భారీ మూల్యం చెల్లించింది. షువాంగ్‌పై పాంథోయ్ ఆలస్యం చేయడంతో ఫార్వర్డ్ విఫలమైంది. ఆసియా క్రీడలరజతపతక విజేత, నాలుగుసార్లు చైనా మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఆఫ్‌ది ఇయర్‌గా నిలిచిన షువాంగ్ తన అనుభవాన్నంతా ఉపయోగించి, పాంథోయ్‌ను పక్కదారి పట్టించిఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఈ విజయంతో వుహాన్ జియాంగ్డా రెండు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో గ్రూప్ దశలో అగ్రస్థానానికి చేరుకోగా, తూర్పు బెంగాల్ 2రౌండ్ల తర్వాత మూడు పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. మోషల్ గర్ల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవాలంటే ఈ 23న నసాఫ్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో కనీసం డ్రా చేసుకోవాలి.



## ముక్కోణపు వన్డేలో భారత్ ఓటమి

### అఫ్ఘానిస్థాన్ చేతిలో 97 రన్స్‌కే ఆలౌట్

**న్యూఢిల్లీ:** భారత్ అండర్-19 ముక్కోణపు వన్డే టోర్నీలో భారత్ రెండో ఓటమి చవిచూసింది. బెంగుళూరు వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 71 పరుగుల తేడాతో ఆఫ్గనిస్తాన్ చిత్తు చేసింది. కేవలం 169 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ జట్టు చతికిలపడింది. ఆఫ్గన్ బౌలర్ల ధాటికి భారత్ 29.3 ఓవర్లలో కేవలం 97 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యువరాజ్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. యువరాజ్ 80 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 60



పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి మిగిలిన వారి సపోర్ట్ లభించ లేదు. ఆఫ్గన్ పేసర్ అబ్దుల్ అజీజ్ 6 వికెట్లతో టీమిండియా పతనాన్ని శాసించాడు. తన 10 ఓవర్ల కోటాలో కేవలం 38 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడితో పాటు, సలీం ఖాన్, జద్రాన్ తలా రెండు వికెట్లు సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్గన్ యువ జట్టు ఇండియా బౌలర్లు చెలరేగడంతో 45.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. ఆఫ్గన్‌బ్యాటర్లలో షినోజాడా (58) టాప్ స్కోరర్‌గా నిలవగా, అజీజుల్లా మియాఖిల్ (42) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

## వన్డేల్లో నం.1 డారిల్ మిచెల్

### రోహిత్‌శర్మకు భారీ షాక్





### బౌలర్లలో నంబర్ వన్‌గా బుమ్రా

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మకు షాక్ తగిలింది. నెలరోజుల వ్యవధిలోనే అతడు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కోల్పో యాడు. పురుషుల తాజా ర్యాంకింగ్స్ లో రోహిత్ శర్మ స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ అగ్రస్థానంలో నిలిచాడు, భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. సిరీస్ ఓపెనర్‌లో వెస్టిండీస్‌పై మ్యాచ్ విన్నింగ్ సెంచరీ తర్వాత గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలగే ముందు, మిచెల్ 118 బంతుల్లో 119 పరుగులు చేశాడు. ఇది అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సంపాదించిపెట్టింది. ఈ విజయంతో అతను ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రహీం జద్రాన్, రోహిత్‌లను ఒకే రేటింగ్ పాయింట్ తేడాతో అధిగమించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో 83 ఇన్నింగ్స్‌ల తరువాత శతకాల కరువు ముగించిన పాకిస్తాన్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజామ్ ఆరో స్థానానికి చేరుకున్నాడు. టీమ్‌ఇండియా స్టార్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీలు వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ పరంగా ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లు సహా ఆరు వికెట్లు పడగొట్టిన బుమ్రా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నం.1 బౌలర్‌గా తన స్థానాన్ని నిలుపుకున్నాడు. అతని సహచరులు కుల్దీప్ యాదవ్ మరియు రవీంద్ర జడేజా కూడా లాభాలను ఆర్జించారు, మాజీ బౌలర్లు కుల్దీప్ యాదవ్ 2స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా 13వ స్థానానికి చేరుకున్నారు మరియు రెండోవాడు నాలుగు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి చేరుకున్నాడు.

## పరువు కోసం బిగ్ ఫైట్

### మార్పులతో టీమిండియా.. సౌతాఫ్రికా సిరీస్ సమం లక్ష్యం

**న్యూఢిల్లీ:** భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి తర్వాత, టీమిండియా ఇప్పుడు 0-1తో వెనుకబడి ఉంది. సిరీస్‌ను సమం చేయాలంటే ఈ నెల 22 నుంచి గువహతిలో జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ కచ్చితంగా గెలవాలి. అయితే ఈ కీలకమైన మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆడకపోవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గిల్‌కు మెడ గాయం



కారణంగా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం గిల్ జట్టుతో కలిసి గువహతికి ప్రయాణించినా అతని ఆరోగ్య పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకుంటారు. గిల్ ఒకవేళ అందుబాటులో లేకపోతే వికెట్ కీపర్‌బ్యాట్స్‌మెన్ రిషభ్ పంత్ జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉంది. గిల్ స్థానంలో ఆడించేందుకు ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని తిరిగి టీమిండియాలోకి తీసుకున్నారు. మొదట్లో ఇండియాఎ తరఫున ఆడేందుకు రిలీజ్ అయిన నితీష్, గిల్ రిప్లేస్‌మెంట్‌గా జట్టుతో తిరిగి చేరాడు. మరోవైపు చైనామెన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. నవంబర్ నెలాఖరులో కుల్దీప్‌కు పెళ్లి ఉండటం వలన అతను బీసీసీఐకి సెలవు కోసం అభ్యర్థన పంపినట్లు తెలుస్తోంది. కుల్దీప్ లేకపోతే భారత జట్టు స్పిన్ విభాగంపై మరింత భారం పడుతుంది. ప్రస్తుత పరిస్థితులు, జట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌతాఫ్రికాతో జరిగే రెండో టెస్ట్‌కు భారత జట్టు సంభావ్య ప్లేయింగ్ ఎలెవన్ ఈ విధంగా ఉండే అవకాశం ఉంది. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ ఆడగా, మిడిల్ ఆర్డర్‌లో సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్ (కెప్టెన్ వికెట్ కీపర్) ఉంటారు. ఆల్‌రౌండర్లుగా నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ ఉండగా, పేస్ బౌలర్లుగా మహమ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌కు నాయకత్వం వహిస్తారు. ఈ బలంగా ఉన్న ప్లేయింగ్ ఎలెవన్ ద్వారా భారత జట్టు సిరీస్‌ను 11తో సమం చేయాలని గట్టి ప్రయత్నం చేయనుంది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు ఆయుష్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత షట్లర్ ఆయుష్ శెట్టి ఆ16లో కోడై నరోకాను ఓడించాడు. ఇదే సమయంలో సాత్విక్-చిరాగ్ జోడీ కూడా వరుస గేమ్‌ల విజయంతో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. గురువారం సిడ్నీలో జరిగిన ఈ టోర్నీలో నాల్గవ సీడ్ కోడై నరోకాను ఓడించి ఆయుష్ క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించుకున్నాడు. 20 ఏళ్ల అతను ప్రపంచ 9వ ర్యాంక్ జపనీస్ షట్లర్‌పై 21-17, 21-16 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. వరల్డ్ టూర్‌లో ఈ సంవత్సరంలో అతడు 6వ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. గత వారం జరిగిన కుమామోటో మాస్టర్స్‌లో కోడై చేతిలో ఓటమికి ఈసారి ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. అలాగే క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సాత్విక్-చిరాగ్ జోడీ పురుషుల డబుల్స్‌లో అగ్రశ్రేణి భారత జంట సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి కూడా వరుసగా రెండో గేమ్ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. 31 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వారు 21-18, 21-11 తేడాతో చైనీస్ తైపీకి చెందిన చింగ్ హెంగ్ సు-గువాన్ సన్ వు జంటపై విజయం సాధించారు. తొలి ఆట ప్రారంభంలో భారత ద్వయం చాలా ఇబ్బందుల్లో పడి 915తో 6 పాయింట్లు వెనుకబడి ఉంది. కానీ తదుపరి పుంజుకుని ఐదు పాయింట్లు గెలుపొంది ఆటను ముగించారు. రెండవ గేమ్‌లో ఆట వేగాన్ని పెంచి ఆధిక్యంతో మ్యాచ్‌ను గెలిచారు.



వాణిజ్యం

## రూ.46.32 లక్షలకోట్లకు పెరిగిన భారత్ టాప్‌బ్రాండ్స్!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారతదేశంలోని టాప్100 బ్రాండ్ల సత్తా మరోసారి నిరూపితమైంది. ఈ ఏడాది వాటి మొత్తం విలువ 52,350 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ.46.32 లక్షల కోట్లకు చేరినట్లు లండన్‌కు చెందిన ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ కాంటార్ వెల్లడించింది. ఈ మొత్తం విలువ భారత జీడిపిలో దాదాపు 13 శాతానికి సమానమని 'కాంటార్ బ్రాండ్స్ రిపోర్ట్ 2025'లో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ బ్రాండ్ల మొత్తం విలువ 6 శాతం పెరిగింది.



నివేదిక ప్రకారం ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి దేశంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్యాంక్ బ్రాండ్ విలువ 18 శాతం వృద్ధితో దాదాపు 4,500 కోట్ల డాలర్లకు అంటే రూ.3.98 లక్షల కోట్లకు చేరుకుంది. 2014లో ఈ రిపోర్టు ప్రారంభమైనప్పటి నుంచి చూస్తే హెచ్‌డీఎఫ్‌సీ బ్రాండ్ విలువ నాలుగింతలకు పైగా పెరగడం గమనార్హం. ఈ జాబితాలో దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 4,420 కోట్ల డాలర్లు మన కరెన్సీలో రూ.3.91 లక్షల కోట్ల విలువతో రెండో స్థానంలో నిలిచింది. టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ 4,110 కోట్ల డాలర్లు అంటే రూ.3.64 లక్షల కోట్ల విలువతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఐదో స్థానంలో, ఐసిఐసిఐ బ్యాంక్ ఆరో స్థానంలో ఉన్నాయి. బ్రాండ్ విలువ పరంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో వరుసగా రెండో ఏడాదికూడా అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది కాలంలో జొమాటో బ్రాండ్ విలువ ఏకంగా 69 శాతం పెరిగింది. ఈసారి జాబితాలో అల్ట్రాటెక్ సిమెంట్, హ్యుండయ్‌తో సహా 18 కొత్త కంపెనీలకు చోటు దక్కింది. 111 విభాగాలకు చెందిన 1,620 బ్రాండ్లపై 1.45 లక్షల మంది అభిప్రాయాల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లను రూపొందించినట్లు కాంటార్ తెలిపింది.

## 'డార్క్ ప్యాటర్న్స్‌లో లేం'

### 26 ఇకామర్స్ సంస్థల వెల్లడి

**న్యూఢిల్లీ, నవంబరు 20:** దేశంలోని 26 ఇకామర్స్ కంపెనీలు తమ ప్లాట్ ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జొమాటో, జెప్టో, స్విగ్గీ, బిగ్ బాస్కెట్, జియో మార్ట్ వంటి ఇకామర్స్ ప్లాట్ ఫామ్స్ ఇందులో ఉన్నట్లు తెలిపింది. డిజిటల్ మార్కెట్ యూజర్ల హక్కుల పరిరక్షణలో ఇదొక ముందడుగు అని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ పేర్కొంది. డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్ మార్గదర్శకాలు 2023కు అనుగుణంగానే తమ ప్లాట్ ఫామ్స్ ఉన్నాయని ఆయా కంపెనీలు స్వీయంగా ప్రకటనలు సమర్పించినట్లు తెలిపింది. వినియో గదారులను తప్పుదారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేలా కేంద్రం చర్యలు చేపట్టింది. దీంతో సంబంధితకంపెనీలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించినట్లు కేంద్రం పేర్కొంది. డార్క్ ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్ ఫారాల్లో లేవని ఈ 26 కంపెనీలు ప్రకటించినట్లు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ సిసిపిఎ పేర్కొంది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, సబ్



స్క్రిప్షన్ ట్రాప్, ఫోర్స్డ్ యాక్షన్, ఇంటర్ ఫేస్ ఇంటర్ ఫియ రెన్స్, బైట్ అంట్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్మెంట్స్, ట్రిక్ వర్డింగ్, నాగింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయని తెలిపింది. ఫార్మ్ ఈజీ, జెప్టో మార్కెట్ ప్లేస్, మింత్రా, ఫ్లిప్ కార్ట్, వాల్ మార్ట్ ఇండియా, బిగ్ బాస్కెట్, మేక్ మై ట్రిప్, జియో మార్ట్, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, పేజ్ ఇండస్ట్రీస్, విలియమ్ పెన్, రిలయన్స్ జ్యూవెల్స్, క్లియర్ ట్రిప్, రిల యన్స్ డిజిటల్, టాటా 1ఎంజీ, మీషో, ఇక్సిగో, నెట్ మెడ్స్, హామ్ లెస్, అజియో, డ్యూరో ఫ్లెక్స్, టిరా బ్యూటీ, కూరాడెన్ వంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా ప్లాట్ ఫామ్స్ సొంత ఆడిట్లు పూర్తి చేసి డార్క్ ప్యాటర్న్స్ తొలగించిట్లు ప్రకటనలు చేశాయని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.



## రూ.9వేల కోట్ల అనిల్ అంబాని ఆస్తులు జప్తుచేసిన ఇడి

**ముంబయి, నవంబరు 20:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌నకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరో గట్టి షాక్ ఇచ్చింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, తాజాగా రూ.1400కోట్ల విలువైన ఆస్తులను ప్రొవిజనల్‌గాజప్తుచేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.9000కోట్లకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తాజాగా జప్తు చేసిన ఆస్తులు నవీ ముంబై, చెన్నై, పూణె, భువనేశ్వర్‌లలో ఉన్నట్లు సమాచారం. అనిల్ అంబానీ నేతృత్వంలోని కంపెనీలలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఇడి కొంతకాలంగా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నారు. ఇదే కేసులో గతంలో ఇడి సుమారు రూ.7500 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, నవంబరు 20:** సెన్సెక్స్, నిఫ్టీసూచీలు గురువారం లాభాల్లోనే ముగిసాయి. వరుసలాభాల అనంతరం నష్టాల్లోనుంచి కోలుకున్న సూచీలు రెండోసారి కూడా లాభాల్లోనే నడిచాయి. గ్లోబల్ సెంటిమెంట్ మెరుగుపడటం, ఎన్విడియా పటిష్టమైన ఫలితాలు సాధించడం వంటివి కొంత తోడయ్యాయి. విదేశీ పెట్టుబడులు కూడా దేశీయ మార్కెట్లలోకి పెరిగాయి. సెన్సెక్స్ డెరివేటివ్స్ కాలపరిమితి ముగింపు కూడా కీలకం అయింది. సెన్సెక్స్ నిఫ్టీలు రెండూ కూడా 52 వారాల గరిష్టాన్ని తాకాయి. నిఫ్టీ 26,150 ఎగువనముగిసింది. ఆర్థికసేవలు, ఇంధనం, ఆటో స్టాక్స్‌మద్దతిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 446.21 పాయింట్లు లాభపడి 85,632.68 పాయింట్లవద్ద నిలిచింది. నిఫ్టీ 50 కూడా 139.50 పాయింట్లుపెరిగి 26,192,15 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఇంట్రాడేలో రెండుసూచీలు కూడా 52 వారాల గరిష్టాన్ని బ్రేక్‌చేసాయి. గడచిన రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.08శాతం లాభపడ్డాయి. బజాజ్‌ఫైనాన్స్ 2.28శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.42శాతం నిఫ్టీకి మద్దతుగా నిలిచాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.13శాతం ర్యాలీ తీస్తే స్మాల్‌కాప్ సూచీ 0.17శాతం క్షీణించింది. బిఎస్ఇలో 1872 స్టాక్స్ పెరిగాయి. 2304 షేర్లు క్షీణించగా 186 కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండు 0.17శాతంపెరిగి 6.543కి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.71వద్ద తచ్చాడింది. అంతకుముందు రోజు 88.48 వద్దముగిస్తే తాజాగా 88.71వద్దకు చేరింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు 5నాటికి 0.28శాతం క్షీణించి 1,22,710రూపాయలుగా నమోదయ్యాయి. ఇక కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు జనవరి సెటిల్‌మెంట్‌చేసింది 49 సెంట్లు లాభపడి బ్యారెల్‌కు 64 డాలర్లుగా కొనసాగింది. బయోకాన్ సంస్థ నేటి మార్కెట్‌లో 3.50శాతం క్షీణించి 395.50వద్ద నడిచింది. లోకేష్ మెషిన్స్‌కూడా 4.89శాతం క్షీణించింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ 3.40శాతం లాభపడితే ట్రాన్స్‌రైల్‌లైటింగ్ కూడా 2.26శాతం లాభపడింది. ఈప్యాక్ ప్రిఫబ్ టెక్నాలజీస్ 4.85శాతంపెరిగింది. మహీంద్ర హాలిడేస్ అండ్ రిసార్ట్స్ కూడా 3.26శాతం పెరిగింది. అలాగే గ్లోబస్ స్పిరిట్స్ 2.22శాతం క్షీణించింది. మాన్ ఇండస్ట్రీస్ 4.04శాతం, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్‌కంపెనీ 1.56శాతం చొప్పున పెరిగాయి. ఇక ఐపిఒలపరంగా ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ 6.72 రెట్లు ఎక్కువ కొనుగోళ్లు బిడ్లు వచ్చాయి. 19 నవంబరున ప్రారంభించిన 21వ తేదీ ముగిసింది. ఐపిఒ ఇష్యూధర రూ.11 నుంచి రూ.120 చొప్పున ప్రకటించింది.

## మందగమనంలో కీలకరంగాల ఉత్పాదకత!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్‌లోని కీలకరంగాల ఉత్పత్తి స్థిరంగా కొనసాగింది. అక్టోబరులో ఎనిమిది కీలక పరిశ్రమల ఉత్పత్తి 162.4 పాయింట్లవద్దనే నిలిచింది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే యధాతథస్థితిని నమోదు చేసింది. ఎరువులు, ఉక్కు, సిమెంట్, పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు అక్టోబరులో సానుకూల వృద్ధిని నమోదుచేసాయి. ఎనిమిది కీలక రంగాలు కూడా భారత పారిశ్రామిక ఉత్పత్తికి 40శాతం వాటా అందిస్తున్నాయి. సెప్టెంబరులో 3.3శాతం వృద్ధినమోదుచేసినా అక్టోబరులో నిలకడగా కొనసాగింది. ఏప్రిల్‌నుంచి అక్టోబరు వరకూ సమిష్టివృద్ధి 2.5శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. బొగ్గు ఉత్పత్తి 8.5శాతం క్షీణించింది. ముడిచమురు ఉత్పత్తికూడా 1.2 శాతం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే క్షీణత నమోదుచేసింది. సమిష్టిగా ఏప్రిల్ అక్టోబరు వరకుకూడా 1.1శాతం క్షీణించింది. ఇక సహజ వాయు ఉత్పత్తికూడా 5శాతంక్షీణించింది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు మాత్రం 4.6 శాతం పెరిగింది. ఇక ఎరువులు ఉత్పత్తి పరంగా 7.4 శాతం పెరిగింది. ఉక్కు ఉత్పత్తిలో కూడా 6.7శాతం వృద్ధిని నమోదుచేసింది. ఏడునెలల కాలంలో సమిష్టిగా 10.3శాతంవృద్ధిని నమోదు చేసింది. ఇక సిమెంట్ ఉత్పత్తిపరంగా చూస్తే 5.3శాతంగా ఉంది. ఏడునెలల కాలానికికూడా 7.3శాతం వృద్ధిని నమోదుచేసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెపుతున్నాయి.

## ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్లకు భారత్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగం!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగం 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరుకోగలదని ప్రైస్‌వాటర్‌కూపర్స్ అంచనావేసింది. ప్రస్తుతం ఉన్న 282 బిలియన్ డాలర్ల టర్నోవర్‌కు మంచి వృద్ధి అవకాశాలున్నాయని అంచనావేసింది. ప్రపంచస్థాయిలో సరఫరా చెయిన్స్, దేశీయంగా కూడా



పటిష్టమైన డిమాండ్, పాలసీ ఆధారిత ప్రోత్సాహకాలు వంటివి ఇందుకు దోహదంచేస్తున్నట్లు అంచనావేసింది. నీతి ఆయోగ్ పాలసీ లక్ష్యాలు, ప్రభుత్వ మద్దతు, మౌలికవసరుల ఆధునీకరణ, వ్యూహాత్మక పెట్టుబడులతో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు భారీగా ఉంటాయని పిడబ్ల్యుసి అంచనావేసింది. మొబైల్‌ఫోన్లు, సెమికండక్టర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వంటివాటిలో వృద్ధికి అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు అంచనావేసింది. భారత్‌ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌తో ఉంది. ఈ మొబైల్‌మార్కెట్, వేరబుల్స్ రంగాన్ని 2030 నాటికి 159 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఐటి హార్డ్‌వేర్ మార్కెట్ 32 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ రంగంలో డేటా సర్వర్లకు అత్యధిక డిమాండ్ ఉంది. డిజిటైజేషన్ వృద్ధి, కృత్రిమమేధ అమలు, క్లౌడ్ సేవలతో మరింత వృద్ధికి ఆస్కారం ఉందని ప్రైస్‌వాటం కూపర్స్ తెలిపింది. ఇక భారత టెలికాం మార్కెట్ గడచిన ఐదేళ్లలో ఆరురెట్లు పెరిగింది. 65శాతం 5జి డేటా 2026నాటికి వృద్ధిచెందుతుందని అంచనా. అందువల్లనే నెట్‌వర్క్ ఇన్‌ఫ్రా, ఎలక్ట్రానిక్స్ సంబంధిత పరికరాలకు డిమాండ్ పెరుగుతుందని అంచనావేసింది. ఇక ఈవీఛార్జర్లు, స్మార్ట్ ఉత్పత్తి వ్యవస్థలు ఆటోమేషన్ టెక్నాలజీలు మరింతగా పెరుగుతాయని పిడబ్ల్యుసి అంచనావేసింది. అయితే ఇందుకు మూలధన వ్యయం సవాలుగా మారుతుంది. ఇన్‌ఫ్రా ఆధునీకరణ, రవాణా వ్యవస్థలు, దీర్ఘకాలిక పాలసీల అమలు, సులభశైలి వాణిజ్యం అమలుకు రావాలి. అందువల్లనే భారత్ పబ్లిక్‌ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఎక్కువ ప్రోత్సహిస్తోంది. దీనికి తోడు మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ప్రణాళికలు కార్యాచరణలతో విదేశీ కంపెనీలు భారత్ భాగస్వామ్యంతో దేశంలోనే ఉత్పత్తికి ముందుకువస్తున్నాయి. లేదా టెక్నాలజీని నూరుశాతం బదలీకిసైతం అంగీకరిస్తున్నాయి. వాటిలో ఫాక్స్‌కాన్, యాపిల్, వేదాంత వంటి భారీ సంస్థలు పెట్టుబడులకు వస్తున్నాయి. వారు విస్తరణకు వెళ్లడం లేదా సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్‌లో ప్రవేశించడం వంటివిచేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14